
ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక



4 అణాలు
12-11-'52



పంచతంత్రం
మిత్రభేదం
కర్త... విశ్వాత్ముల నరసింహమూర్తి
వెనుకటికొక నగరమందు రాకుమారుడొకడు గలడు. ఆతనికి స్నేహితులిద్దరు: ఒకడు వర్తకుని పుత్రుడు; మరొకడు పండిత పుత్రుడు
ప్రతి రోజూ వీరంతా షైలా పచ్చీసుగ తమ కాలం గడిపేవారు
రాజు, కుమారునితో
"నా కడుపున చెడబుట్టావ్! - ఆటలలో పాటలలో - పడి, రాజులకుచితమైన - విద్యలు మానేశావ్!! - ఛీ, ఛీ, అప్రయోజకుడ!!!"
జనకుడు పెట్టిన చివాట్లు - ములుకులవలె సోకి అతడు, - మిత్రులతో చెప్పాడు.
"మానాన్నా ఇంతే నోయ్! - ఎప్పుడు తిడుతుంటాడు!"
"అసలు తండ్రులంతా తమ - కొడుకుల పాలిటి యముళ్లు!"
"ఇంతవమానం జరుగగ మన మిక్కడ దేనికోయి? ఇంకొక దేశం పోదాం."
"పోవచ్చును గాని మరి 'ధనమూలం ఇదం జగత్!' ఆరోహణ పర్వతమున కరిగితిమ వలసినన్ని ధనరాసులు దొరుకగలవు!"
ముగురు మిత్రులు కతిపయ దినములకారోహణ గిరి సమీపించి ఎక్కు సరికి ముగ్గురికి మూడు మణులు వెలలేనివి దొరికాయి.
"మణులైతే దొరికె గాని దొంగలకివి దక్కకుండ జనపదములకేగు టెట్లు?"
"ఈ మణులను కడుపులలో దాస్తే, యిక బ్రహ్మరుద్రులైనా కనిపెట్టలేరు."
మణులు వారు మింగుచుండ చాటునుండి గమనించిన దొంగ ఒకడు తలచెనిట్లు:
"ఎన్నిసార్లు వెదికిననూ మణులు నాకు దొరుకలేదు. ఏదో ఒక మాయజేసి ఈ మణులను కాజేసెద."
"అయ్యలార! క్షణమాగుడు; ఒంటరిగా అడవిదాట భయము వేయుచున్నదండి. నన్ను గూడ మీతోటె తీసుకు వెళ్లండి బాబు!"
"సరే రమ్ము, మాతోటే."
అడవి దారి పోతుండగ కోయపల్లె కనబడినది. కోయ నాయకుని పెంపుడు పక్షి ఒకటి వీర్ని చూచి గగ్గోలుగ అరచింది.
పక్షి అరుపు వినగానే - వీరివద్ద డబ్బుందని - కోయనాయకుడు గ్రహించి - నలుగురినీ బంధించెను. - ఎంత వెదికినప్పటికీ - డబ్బు దొరకనందువల్ల - నలుగురినీ తిట్టి తన్ని - పొమ్మని వదిలేశాడు.
కాని ఆపక్షి తిరిగి గగ్గోలుగ అరచింది! మరల వార్ని పట్టుకొని గట్టిగ సోదా చేసి మళ్లీ విడిచేశాడు.
42

సంవత్సర చందా
రు 12-0-0
విడిప్రతిక 4 అ.


ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder K NAGESWARA RAO

సంచిక 12
12.11-52

నందన కార్తిక బహుళ దశమి బుధవారము



కేంద్ర ఆహార పరిశోధనాలయం, మైసూరు.

విషయానుక్రమణిక

గమనిక

అనివార్యమైన కారణాలచేత 'సంసారమ్' శీర్షిక క్రింద నాలుగో వ్యాసాన్ని ఈవారం ప్రచురించలేక పోతున్నాం. —సంపాదకుడు.

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక.

సంక్రాంతికి ప్రత్యేక సంచిక, కథలపోటీ

రాబోయే సంక్రాంతికి (14-1-1953) ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రిక ప్రత్యేక సంచికగా వెలువడుతుంది. ఈ సంచికలో ప్రత్యేకాకర్షణగా కథల పోటీని ఏర్పాటు చేయదలచాము. గ్రామీణ వాతావరణం, గ్రామీణ జీవితం, గ్రామీణసమస్యలు ఆధారం చేసుకుని, మా వారపత్రికలో ఆరుపేజీలకు మించకుండా, స్వతంత్రంగా రచించబడిన కథానికలను పోటీకి స్వీకరిస్తాము. మొదటి బహుమతి కథకు 75 రూ॥లు, రెండవ బహుమతి కథకు 50 రూ॥లు ఇవ్వబడుతుంది. పోటీలో యావన్మంది రచయితలు పాల్గొనవచ్చును.

పోటీ కథానికలు డిసెంబరు 1 వ తేదిలోగా మా కార్యాలయానికి చేరాలి.

సంక్రాంతి సంచికకు ఇతర కథానికలు, గేయాలు, పద్యాలు, ఛాయాచిత్రాలు, లిఖితచిత్రాలు పంపగోరేవారు కూడా డిసెంబరు 1 వ తేదీలోగా పంపగలరని ఆశిస్తున్నాము. ముఖ్యంగా ఛాయాచిత్రాలు, లిఖితచిత్రాలు గ్రామీణ వాతావరణం, సంక్రాంతిపండుగ దృశ్యాలు చూపించేవైతే మరీ సంతోషం.

పోటీకి పంపే కథానికలను "సంక్రాంతి సంచిక కథానికల పోటీకి" అనీ, సంక్రాంతి సంచికకు పంపే ఇతర రచనలను లిఖిత చిత్రాలను "సంక్రాంతి సంచికకు" అనీ స్పష్టంగా వ్రాయాలి.

సంక్రాంతి సంచికను సాధ్యమైనంత ఆకర్షకంగా వెలువరించాలని మా ప్రయత్నం. పాఠకులు, రచయితలు, అభిమానులు మా యీ ప్రయత్నానికి సర్వవిధాలా సహకరిస్తారని ఆశిస్తున్నాము.

★ కాలక్షేపం ★

"గురువుల రాక, దాసిమృతి,
గుఱ్ఱపుధాటియు, వానలేమియున్,
పొరుగున నప్పుబాధ, చెవి
పోటును, దొమ్మరులాట, యింటిలో
వరసతి గర్భవేదన, వి
వాహము, విత్తుట, యల్లునల్కయున్,
కరవు, దరిద్ర, మాబ్దికము,
కల్గు నొకప్పుడు కృష్ణభూవరా!"

(1) గురువుల రాక (2) దాసి మృతి (3) గుఱ్ఱపుధాటి (4) వానలేమి (5) పొరుగున నప్పుబాధ (6) చెవిపోటు (7) దొమ్మరులాట (8) ఇంటిలో వరసతి గర్భవేదన (9) వివాహము (10) విత్తుట (11) అల్లుని అల్క (12) కఱవు (13) దరిద్రము (14) ఆబ్దికము...మనిషిని ఏడ్పించడానికి ఏడు కష్టాలు చాలవన్నట్లుగా దానికి రెండు రెట్లుగా ఇరు ఏడు (ఈరేడు) అనగా 14 కష్టములు ఒక్కసారిగా సంప్రాప్తించినవి. ఇన్ని చిక్కులు ఒక్కసారిగా వస్తే ఉక్కు వంటివాడు కూడా బిక్కమొగం వేస్తాడు. స్టాలినంతవాడు స్తంభించిపోతాడు. "ఈరేడు కష్టంబు – లీడేఱు టెట్లు?" అని ఏడ్చి ఏడ్చి రెండురెట్లుగా ఏడ్చి ఎవడైనా మొండిపోరిన గుండెతో భీష్మిస్తాడు. అయినా, కవి హృదయం మాత్రం యీ పద్యంలో స్తంభించక సజీవంగానే ఉంది గనుక పద్యాన్ని సవిస్తరంగా పరిశీలించడం ప్రశస్తం.

ఈ పద్యం చివర "కృష్ణభూవరా!" అని ఉన్నందువల్ల శ్రీకృష్ణదేవరాయల వారిని సంబోధించి చెప్పబడిన పద్యంగా విశదమవుతోంది. కృష్ణదేవరాయలవారివద్ద మంత్రిగా ఉండిన తిమ్మరుసు ఒకనాడు రాయలవారి ఆస్థానమునకు రావలసినవేళకు రాజాలక చాలా ఆలస్యముగా రావడం సంభవించిన దనిన్నీ, ఇంట్లో కొన్ని యిక్కట్టులు, యిబ్బందులు తటస్థించడం మూలంగా తాను నిర్ణీతకాలమునకు రాలేక పోతిననియు, రాయలవారికి విన్నవించి, పెక్కు చిక్కులు ఒక్కుమ్మడిని గ్రుక్క తిప్పుకొనుటకు వీలులేకుండా ఏవిధంగా బాధించగలవో వివరిస్తూ పై పద్యమును చెప్పియుండిరని ఒక గాథ కర్ణాకర్ణిగా అనుశ్రుతంగా తరతరములనుంచీ పరంపరానుగతముగా ప్రచారంలో ఉంది. ఆ పద్యంలో అపూర్వమైన అనుభవజ్ఞానం అత్యంత రసవత్తముగా నిర్వచింపపడుట వల్లనే, ఆ పద్యం గ్రంథస్థమైనది కాకపోయినా, రసజ్ఞులైన ఆంధ్రులకు చాలామందికి కంఠస్థమై, స్థిరస్థాయిగా నేటికిని నిలిచి ఉంది.

ఇంటికి మతగురువు గాని, కులగురువు గాని అయినటువంటి జియ్యరో, అయ్యవార్లంగారో, స్వాములవారో వచ్చినారంటే, ఆకాలంలో విధిగా గురువుగారికి పాదపూజలు జరిపించితీరాలి. స్వాముల వారికి భిక్షు చేయకపోతే అంతు విధించేవారు. పదిమందిచేత వెలివేయబడినట్లయితే పల్లెటూళ్లలో బ్రతకటం దుర్ఘటంఅయ్యేది.

అటువంటి కాలపరిస్థితులలో ఇంటికి గురువు వస్తే ఉండే అవస్థ అది. తాతాచార్యులుగారి ముద్ర బుజం తప్పినా వీపు తప్పదు అనే కాలం అది. కృష్ణదేవరాయల వారి ఆస్థానంలో శ్రీమాన్ అద్దంకి తాతాచార్యులుగారికి చాలా అధికారప్రాబల్యం ఉండేది. ఈ తాతాచార్యులుగారి చెవులకు తాటియాకులు కట్టడంలో తెనాలి రామకృష్ణకవి సమర్థుడనే వదంతి ఉండేది. కాని, తాతాచార్యులుగారి ముద్ర తదితరుల కెవ్వరికీ తప్పేదికాదు. ఇటువంటి గురువుల రాక ఆ కాలంలోగాని, ఏ కాలంలోగాని గృహస్థుకు సంభవించేటటువంటి పెద్ద యిబ్బందిగా పరిగణింపబడి, పై పద్యంలో మున్ముందుగా దీనినే ప్రస్తావించడం సంభవించినదేమో!

గురువుగారు యింటికి వచ్చిన కాలంలోనే యింట్లో పనిచేసేటటువంటి దాసీది (పరిచారిక) మరణించడంవల్ల, ఇంటిపని అంతా రెండోమనిషి సహాయం లేకుండా చేసికోవలసిన దుస్థితి యజమానికి సంభవిస్తుంది. అయితే, ఇంకో పరిచారికను పనిలో ఏర్పాటుచేసికొనకూడదా? అని ప్రశ్నించవచ్చు. కాని, మరొక పనిమనిషి సులభంగా కోరినవెంటనే లభించదు. ఒకవేళ ఎవరైనా కొత్త దాసీది తటస్థపడినప్పటికీ, వెంటనే దానియందు నమ్మకము కుదరడం అసంభవం. అయినప్పటికీ, ఇంటివారికిన్నీ ఇంటిలోని పనిపాటులకున్నూ అది అలవాటు పడుటకు సహజంగా కొంతకాలం పట్టుతుంది. పిల్లలతో గురించిన దాసీది అయితే, ఆ పిల్లలకు ఆ దాసీదానితో అన్యోన్యభావం ఏర్పడడం చాలా కృత్యాద్యవస్థగాను, బ్రహ్మయజ్ఞంగాను ఉంటుంది.

ఇటువంటి యిబ్బంది సమయంలోనే గుఱ్ఱాలచావడిలో కట్టబడి ఉండే గుఱ్ఱాలు సరియైన మాలీసు లేకపోవుటవల్ల గాని, వాటికి మసాలా తినిపించకపోవుటవల్ల గాని, సరియైన సవారీకదం లేకపోవుటవల్ల గాని, కాళ్ళకట్లు తెంపుకొని హారాము చేసి, రహదారిలవెంట దవుడుతీసి ఉడాయించినట్లయితే, ఆరీతిగా కట్లు తెంపుకొని వీథులలో దవుడు తీస్తున్న గుర్రాన్ని తిరిగి పట్టి కట్టివేయడం సామాన్యంగా సులభసాధ్యమైన పనికాదు. గుర్రం పోతే పోయిందని విడిచిపెట్టి ఊరకుండుటకు వీలులేదు. తెల్లవారిలేస్తే ఏ పొరుగూరికి పనిమీద పోవాలన్నా, సవారీకి సొంత గుర్రం ఆ రోజులలో చాలా అవసరంగా ఉండేది. కొండఊళ్ళల్లో, పెళ్ళిళ్ళకు తరలివెళ్లుటకు కూడా, ఆడవాళ్లు, మొగవాళ్లు ఎవరి మూటలు వారు ప్రక్కను పెట్టుకొని కొన్నితట్టు గుర్రాలమీద ఎక్కి తరలివెళ్ళేవారు. శత్రుసేనలు వచ్చాయంటే గుర్రాలెక్కి ఆడవాళ్లు మొగవాళ్లు కూడా ఒక గ్రామం నుంచి ఇంకో గ్రామానికి పారిపోయేవారు. ఆ కాలంలో ఆ

[illegible]

కాలక్షేపం

పాంటీనగర ప్రాంతాలలో బట్ట లేకపోయినా గడచేది గాని, గుఱ్ఱం లేకపోతే గడచేది కాదు. మన గుఱ్ఱం మన స్వాధీనంలో లేకపోతే, ఎవరి గుఱ్ఱం ఎవరిస్తారు? మన గుఱ్ఱమే మనకు స్వాధీనం కాకపోతే, మన అవసరానికి తెచ్చిన యింకొకరి గుఱ్ఱం మనకు స్వాధీన మవుతుందా? ఇంటికి గురువులైన తాతాచార్యులుగారు వచ్చినా, దాసీది చనిపోయి యింటిలో యిబ్బంది పడుతున్నా, కట్టుతప్పిన గుఱ్ఱాన్ని పట్టి తెచ్చుకోవలసిందే. అది తప్పదు.

ఈ అవస్థలుయిట్లాఉండగా, కురియవలసినవానలు కురియడం లేదు. గత సంవత్సరం అంతా వానలు లేకపోయినప్పటికీ, పంటలు శూన్యమైనప్పటికీ, వచ్చే సంవత్సరమైనా వర్షాలు కురుస్తాయేమో అనే ఆశ పీడిస్తోంది. సకాలంలో విత్తనాలునాటి, నారు పోయకపోతే, విత్తనాలునాటే తరుణం తప్పితే, ఆ సంవత్సరానికిక పంటఆశ అడుగంటిపోతుంది.

గడచిన సంవత్సరం పంట పండకపోవడంవల్ల పొరుగువానికి యివ్వవలసిన బాకీల ఒత్తిడి ఎక్కువగా ఉంది. పంటలేని సందర్భంలో అప్పు పుచ్చుకొన్నవాని కెంత అవస్థగా ఉందో, అప్పు యిచ్చినవాడూ అంతకంటె ఎక్కువ చిక్కులపాలై ఉంటాడు. తన పైకం వడ్డీకి యిస్తే వృద్ధి అవుతుందనే ఆశతో అందరికీ అప్పులిచ్చి ఉంటాడు. విత్తనాలు వెదజల్లినట్లుగా తన పైకాన్ని లోకులకు వెదజల్లినాడు. అందుమూలంగా అతని పని మొదలు చెడిన బేరం అవుతోంది. బెస్తవాడు సముద్రంలోని చేపలు పట్టవలెనని వలవేస్తే చేపలు చిక్కలేదు సరిగదా, అల వచ్చి వల కొట్టుకొనిపోయినదన్నట్లుగా ఉంటుంది. పంచతంత్రపు కథలలో చెప్పినట్లుగా, బోయవాడు పిట్టలను పట్టవలెనని వలవేస్తే, ఆ పిట్టలు వలతో సహా పలాయనమై గగనవీధిని ఎగిరిపోయినాయి. కాని, పంటలు పండని రోజుల, అప్పులను రద్దు చేసే ఋణగ్రస్తులసహాయచట్టం కృష్ణదేవరాయలవారి కాలంలో కన్పించదు.

అప్పుల బాధకంటె అతి తీవ్రమైనవి చెవిపోటు, పంటిపోటు మొదలైనవి. ఏపని చెయ్యడానికీ తోచదు. పనిచెయ్యనివ్వదు-పండుకోనివ్వదు - వానలు లేక పోవడం దైవిక బాధ - చెవిపోటు అనేది దైహిక బాధ - చెవిపోటుతో ఒకమూల బాధ పడుతూఉంటే, చెవులు బద్దలయ్యేటట్లుగా

వాకిట్లో నడివీధిలో దొమ్మరివాళ్ళు గడవేసి డోలు బజాయిస్తున్నారు. ఊళ్ళోవాళ్ళందరూ వద్దంటేనే ఆదొమ్మరివాళ్ళు ఆవీధిలో నుంచి పోతారుగాని, ఎవరో ఒక గృహస్థుకు చెవిపోటుగా ఉందంటే వాళ్లు లేచిపోతారా? డోలువాయించడం మానుతారా? అవస్థపడుతున్న గృహస్థే అవసరమైతే లేచిపోవాలి. మరొక గత్యంతరం లేదు. ఊళ్లో ఉండే ఆసాములు నలుగురూ ఆ దొమ్మరివాళ్లకు యివ్వవలసిన చందాలు సక్రమంగా యిచ్చి వాళ్లను పంపించకతప్పదు. అది గంగానమ్మముడుపు. అది ఇవ్వనివానికిగాని, వాళ్లకు ఎదురుతిరిగి వాళ్లను ధిక్కరించి కసరికొట్టినవానికిగాని, కొంప మీదకు ఏదో ముప్పు రప్పించుకొనినట్లవుతుంది.

యజమానికి చెవిపోటు దుర్భరంగా ఉన్న సమయంలోనే నిండుగర్భంతో ఉన్న యిల్లాలుకు నొప్పులు ప్రారంభమైనాయి. కర్ణవేదనతో ఆయన ఒకగదిలో, ప్రసవవేదనతో యీమె యింకొక గదిలో-మూల్గుతూ ఉండే అవసరంలోనే, ఇంటికి వచ్చిన అల్లుడు తనసంగతి ఎవరూ సరిగ్గా కనుక్కోవడం లేదనిన్నీ, తనకు భోజన వేళకు పిలుపు అందలేదనిన్నీ, అనేక చిల్లర పేచీలతో అలకవచ్చి ఆయన ఏ చెరువు గట్టుమీదనో ఏ రావిచెట్టు క్రిందనో కూర్చుండవచ్చు; లేదా, వీధిలో జరుగుతున్న దొమ్మరులాటకు వెళ్లి కూర్చుండవచ్చు. కట్టుతెంచుకొని పారిపోయిన అశ్వాన్ని ఎవడు పటితెస్తాడు? అలుకవచ్చి వెళ్లిన అల్లుణ్ని ఎవడు తెస్తాడు? ఊళ్లోకి వచ్చి మకాంచేసిన గురువుగారిని ఎవరు భిక్షకు పిలుచుకొనివస్తారు? యిల్లాలు నొప్పులు పడుతుంటే మంత్రసాని నెవరు పిలుచుకొని వస్తారు? దాసిదానినైనా పంపిద్దామంటే అదికూడా సమయానికి అకస్మాత్తుగా మరణించింది.

ఇవన్నీ యిట్లా ఉండగా తద్దినం ఒకటి వచ్చింది. ఇల్లాలు ప్రసవించి పురుడువస్తే సరే—పురుడు పదిరోజులు వెళ్లిన తర్వాత పదకొండో రోజున పురిటిశుద్ధిస్నానం అయిన వెంటనే తద్దినం పెట్టాలి. కాని, ఆ యిల్లాలు రోజంతా నొప్పులు పడుతూ ఉండడమే గాని ప్రసవించలేదు. పురుడు రాలేదు. అపరాహ్ణం ప్రవేశిస్తోంది. ఆనాడు తద్దినం పెట్టవలసిన తిథి ప్రవేశించింది. శాస్త్రిలుగారు ధర్మశాస్త్రం త్రిప్పి చూచి, యిటువంటి యిబ్బందిసమయంలో క్లుప్తంగా, సంక్షిప్తంగా, సులభసంగ్రహంగా, యథాశక్తిగా, ఆబ్దికం అయిన దనిపించుటకు తగిన ఆపద్ధర్మ సాధన విధానం ఏదైనా యోచించి చెప్పాలి.

ఈ బాధలిట్లా ఉండగా, పెళ్లి యీడుకు ఎదిగిన పిల్ల యింట్లో ఉంది—శారదా ఆక్టు పెళ్ళిళ్ళకు పూర్వపుకాలం అది. రజస్వల కాకపూర్వమే పిల్లకు పెళ్ళిచెయ్యక పోతే తలవంపులుగా, నలుగురిలో నామర్దాగా ఉండేటటువంటి కాలం అది. అప్పుడు సంఘంలో అమలులో ఉన్నది ఈ నామర్దా ఆక్టుగాని, శారదాఆక్టుకాదు. రజస్వల అయిన పిల్లకు సంబంధం లభించడం అసంభవం-యీడేళ్లుదాటి లిమిటేషన్ పట్టినప్రోనోటు ఏవిధంగా వ్యర్థమో, యీడుమీరిన కన్య జీవితంకూడా వ్యర్థమే. అందువల్ల పెళ్లికిఎదిగి యింట్లో ఉన్న ఆడపిల్లయొక్క వివాహప్రయత్నం కోర్టు వ్యాజ్యంకంటె జరూరైన మనోవ్యాకులం.

పైజెప్పినవాని కన్నింటికీ ధర్మశాస్త్ర ప్రకారంగా ఆపద్ధర్మవిధానం ఉండి తీరాలి. "కరవు దరిద్రమూడ్డికము కల్గు నొకప్పుడు" అనేమాటశాశ్వత ధర్మసూత్రంగా ప్రజాసామాన్యానికి నాటికీ నేటికీ నిరంతరంగా వర్తిస్తూనే ఉంది.

కరవులు దేశాన్ని బాధిస్తూనే ఉన్నాయి. ఇది—కేవలము దైవికమైనవిషయం అన్నారు. కాని, ఆవిధంగా వాదించే కాలం పోయింది. మానవులు బుద్ధిహీనులు కావడంవల్లనే నదీప్రవాహములలోని నీరును, పాతాళగంగను, మేఘాలలోని ఆకాశగంగను చక్కగా వినియోగించుకొని పంటలు పండించుకొనలేక పోతున్నారని యీ కాలములోని ఆర్థికశాస్త్రవేత్తలు వాదిస్తున్నారు. మానవుల వివేకదారిద్ర్యం వల్లనే, అనేకయితర దారిద్ర్యములుఅనగా, ఆర్థికదారిద్ర్యంగాని, ఆరోగ్యదారిద్ర్యంగాని సంభవిస్తాయని సిద్ధాంతీకరించారు. అయితే, ఆర్థికదారిద్ర్యం మూలంగానే ప్రజలకు అనేక జీవిత సౌకర్యాలు సమకూరడం లేదనిన్నీ, కడుపు నిండా సరియైనతిండి, నివసించడానికి సరియైన కొంప, కట్టుకొనుటకు తగిన బట్ట లేక, అనేక అధివ్యాధిబాధలపాలై ప్రజలు కృశిస్తున్నారనిన్నీ వాదిస్తున్నాము. సరియైన కూడు, గూడు, గుడ్డ లేనటువంటి, దిక్కు-

ఆ వూరికి క్రొత్తగా వచ్చి ప్రాక్టీస్ పెట్టిన రోజుల్లో, రోగులు ఎవ్వరూ యీ డాక్టరుగారివద్దకు వైద్యానికి వచ్చేవారు కారు.

అలాటిది - ఒక్క ఏడాదిలో ఆయన ప్రాక్టీస్ అంచెలమీద పెరిగిపోయి, ఆయనకు క్షణం తీరిక దొరకటం దుర్లభమైపోయింది. రోగులను సరిగా విచారించటానికికూడా ఆయనకు 'టైం' చాలటం లేదు.

అందుకని ఆయన తెగ ఆలోచించి, చివరకు యిలా ఒక బోర్డు వ్రాయించి వాకిట్లో తగిలించాడు.

"మీకు వచ్చిన జబ్బులేవో ముందుగానే తెలుసుకొని వైద్యునివద్దకు రా ప్రార్థన."

కాలక్షేపం

లేని పక్షులై, గ్రాసవాసోదైన్యంబులు ఎందుచేత ప్రజలు అనుభవిస్తున్నారంటే, దేశంలో పాడి పంటల ఉత్పత్తి సమృద్ధిగా లేకపోవడంవల్ల — ప్రజలలో ఎంతమంది బంజరుగా ఉన్నారో, దేశంలో అంత భూమి బంజరుగా ఉంది. బంజరు భూమిని ఫలవంతం చేయాలంటే, దేవుడిచ్చిన నదీప్రవాహాలున్నాయి. ఆ ప్రవాహాలకు ఆనకట్టలుకట్టి కాల్వలు త్రవ్వించాలి. అప్పుడు వేలకొలది రైతులు, లక్షలకొలది యకరాలుసాగుచేసి, కోట్లకొలది జనానికి సరిపడేటట్లు సమృద్ధిగా అన్నవస్త్రాలు ఉత్పత్తిచేస్తారు. వాన లేదంటే ఆనకట్టలు కట్టడంమాట ఏమిటి? దేశం దరిద్రంగా ఉంది గనుక ఆనకట్టలు కట్టడానికి తగిన ద్రవ్యం లేదు. ద్రవ్యం సమృద్ధిగా ఉంటే, యీ రోజులలో ఎటువంటి నదులకైనా కట్టం పట్టి కాల్వలు త్రవ్వవచ్చు. ద్రవ్యం సమృద్ధిగా లేకపోతే, ఆనకట్టలు కట్టలేము, పంటలు పండించలేము. దేశంలోని కరవు ఏ పేట ఆబ్దికముల లాగున వస్తూ ఉండవలసిందే. నిత్య శ్రాద్ధంగా కరవులు కాపురాలు చేయక తప్పదు. "కరవు దరిద్ర మాబ్దికముగా ఘటియించును కృష్ణభూవరా!" అని రాయలసీమ కవి ఎప్పటికైనా దిద్దక తప్పదు. దేశంలో ఐశ్వర్యం ఉంటేనేగాని అటువంటి భగీరథ ప్రయత్నాలకు ప్రభుత్వం పూనుకొనదు. అటువంటి భగీరథ ప్రయత్నాలు చేస్తేనేగాని దేశం ఐశ్వర్యవంతం కాదు. ఇటువంటి భగీరథ ప్రయత్నాలకూ, ప్రాజెక్టులకూ పూనుకొన్నవారు సాక్షాత్తు భగీరథులే. కాని, అట్టివి సాధించలేనివారు భాగీరథీ సమానులనే గౌరవం పొందగలరా అనే శంక శంకరునివంటివానికైనా కలుగుతుంది. తగినంత ఐశ్వర్యం ఉంటేనే గాని ఐశ్వర్యప్రదమైన ప్రాజెక్టులు సాగవు. ఇది ఎట్లా ఉందంటే, పిచ్చి కుదిరితేనే గాని పెళ్ళి కాదు. పెళ్ళి అయితేనేగాని పిచ్చి కుదరదు. ఆంధ్ర రాష్ట్రవిషయం కూడా ఉన్మాదోద్వాహ న్యాయంగానే ఉంది. అన్ని పక్షాలవారూ ఏకమైతేనేగాని రాష్ట్రం ఏర్పడదంటారు పండిత నెహ్రూగారు. రాష్ట్రం ఏర్పడితేనేగాని అన్ని పక్షాలవారూ ఏకీభవించరంటారు స్వామీ సీతారాంగారు.

కాని, ప్రాజెక్టుల విషయంలో పెద్ద పెద్ద యింజనీర్లు లెక్కలు వేశారు. మంత్రులు సంప్రతించారు. వీరిలో వీరికి కూడా లెక్కలు తేడాలు ఎక్కువవుతున్నాయి. ఏకీభావం ఎక్కడా లేదు. యీ గణికులు నందిని పంది చేస్తారు పందిని నంది చేస్తారు. ఒకరు 80 కోట్ల రూపాయిలు ఖర్చు అవుతుందంటే, ఇంకొకరు దానికే 110 కోట్లు ఖర్చు అవుతుందంటారు. గణికుల గుణప్రవర్తనం అటువంటిది. ఆ గణికా గుణప్రవర్తన మహిమా ప్రభావం ఫలితంగా అగణితమైన పరివర్తన కలుగవచ్చు. నంది పంది కావచ్చు. పంది నంది కావచ్చు.

"కరవు దరిద్ర మాబ్దికము కల్గు"నని రాయలసీమ కవి చెప్పినమాటను రాజగోపాలాచారిగారు గ్రహించారు. రాయలసీమకు నిజంగా నందికొండప్రాజెక్టు మహానందదాయకమై మహదైశ్వర్యదాయకమైతే, మహారాజులాగున మన రాజాజీగారు మంజూరు కావలసిందే అది అన్నారు. ధన్యోస్మి! ధన్యోస్మి!

కాని, నంది కొండకు నంబి కొండయ ఎదురు వస్తూనేఉన్నాడు. నంబి ఎదురు రాకుండా ఉండడమే మహోపకారమని ఆంధ్రుల కొక నమ్మకం ఉంది. నందిమీద శివుడున్నాడు. శివుని నెత్తిమీద గంగ ఉంది అని ఆ నంది ఆనందించవలసిందే. కాని, ఆ బసవడు తినే కసవు కూడా రాయలసీమలో కరవైంది. నందికి మేత లేదు. నందికొండకు నంబికొండయలాగున, నందికొండ ప్రాజెక్టుకు ఎదురుగా కృష్ణాపెన్నారుప్రాజెక్టు ఎదురవుతోంది. ఈ ప్రాజెక్టుకు మదింపులు మదించిన కారణము చేత, నందిని పందిగా పరివర్తన చేయడమవుతోంది. ఇదంతా గణికాగుణ ప్రవర్తనవల్ల కలిగిన పరివర్తనగా ప్రత్యక్షప్రమాణమై ఉంది.

ఇదంతా పరిశీలించగా, అసలు దారిద్ర్యబీజం ఎక్కడ ఉన్నదంటే, అనూయలో ఉంది — కృష్ణాలోయలో లేదు. ఐశ్వర్య దారిద్ర్యం ఎందులో ఉందంటే, ఐకమత్య దారిద్ర్యంలో ఉంది. అన్నీ ఉన్నాయి గాని అయిదోతనం లేదన్నట్లుగా, అన్నీవున్నా ఐకమత్యం లేదు. అది లేనప్పుడు ఐశ్వర్యమున్నా, ఆనందం గాని ఆ నందికొండ గాని గగనకుసుమాలుగానే ఉంటాయి. అదృష్టాలే దురదృష్టాలవుతాయి. అనైశ్వర్యాలవల్లనే అష్టకష్టాలు వస్తాయి.

బాగా ఆలోచిస్తే అదృష్టానికీ దురదృష్టానికి భేదం అంతగా కన్పించదు. ఇంగ్లీషులో మాత్రం యీ భేదం లేదని ఒక

మేష్టారు ఆవేళ ఎందుకనో వేదాంతధోరణిలో పడిపోయారు. మనిషి అయి పుట్టినవాడు ఎల్లప్పుడూ ఇంకో మనిషిని సంతోషపెట్టటానికే ప్రయత్నించాలని సూత్రీకరించి పిల్లలకు చెప్పారు. ఆ విషయం పిల్లలకు బాగా బోధపడేటట్లు చేద్దామన్న వుద్దేశంతో ఒక పిల్లవాణ్ణి యిలా అడిగారు:

"నువ్వు ఎవరినైనా ఎప్పుడైనా సంతోషపెట్టావా?"

"ఆ!"

"ఎవరిని? ఎప్పుడు? ఎందుకు?"

"శెలవలు అయిపోయి, స్కూలుకు వస్తున్నప్పుడు యింటోవాళ్ళకీ, స్కూలు అయిపోయి యింటికిపోతున్నప్పుడు మీలాంటి మేష్టర్లకీ సంతోషం కలిగిస్తుంటాను."

పండితుడు వినోదంగావింతగా నిరూపించాడు. ఇంగ్లీషుభాషలో "ఫార్చ్యూన్" అంటే అదృష్టం అని అర్థం. "మిస్ ఫార్చ్యూన్" అంటే దురదృష్టం అని అర్థం. ఒక ఆంగ్లేయుని పేరు "ఫార్చ్యూన్" అని ఉండేదిట. అతడు వ్యాపారంచేసి జీవిస్తున్నాడు. ఒకరోజున అతనిభార్య ప్రసవించినదనిన్నీ, ఇద్దరు ఆడపిల్లలు కవలుగా పుట్టినారనిన్నీ, ఒక మిత్రుడు అతని అంగడికి వచ్చి కబురు చెప్పాడు. వెంటనే, ఆ వర్తకుడు ఒక కాగితం మీద "మిస్ ఫార్చ్యూన్స్-నెవర్ కమ్-సింగిల్" (*Miss Fortunes never come single*) అని వ్రాసికొన్నాడు. మిస్టర్ ఫార్చ్యూన్ అనేవాని కుమార్తెలను "మిస్ ఫార్చ్యూన్స్" అని ఇంగ్లీషులో అంటారు. కాబట్టి ఫార్చ్యూనుగారికి కుమార్తెలు ఒక్కొక్కరుగా ఎప్పుడూ

(8-వ పేజీ చూడండి)

నాతో నా సంవాదం

శ్రీ సాంప్రూడి భాస్కరరావు

'ఏమిటి విషయం?'

'ఏమీ లేదు. ఎందుకో చాలా దిగాలుగా ఉంది.'

'అంటే?'

'మహా యిబ్బందిగా ఉందంటున్నా.'

'ఎందుల్లాగ?'

'జీతం చాలటం లేదు.'

'ఎంతపాటిజీతం ముట్టుతుంది నీకు?'

':00 రూపాయిలు.'

'ఒరి పిడుగా, తల కొక్క రెండణాల రోజుజీతం కిట్టడం దుర్లభమైన యీ దేశంలో 200 రూపాయిల నెలజీతం సంపాయిస్తున్న నిన్ను తిండిపోంగ అనీ హోర్డర్ అనీ కేపిటలిస్ట్ అనీ శిక్షించవచ్చు'

'అలాటి ప్రమాదం సంభవిస్తుందంటే కిక్కురుమనను'

'పోనీలే. అసలు విషయం చెప్పు'

'అదే. జీతం చాలటం లేదంటున్నాను.'

'ఎందుచేత చాలటం లేదు?'

'మూడు నెలలుగా ఒక హింద్ సైకిలు కొనుక్కుందామంటే ఊపిరాడటం లేదు. కాలేజీకి నడిచేపోవలసివస్తోంది.'

'మరి మూడు వందల రూపాయిల కేడియో కొన్నావే'

'ఆ అప్పే యింకా తీరక కొట్టుకుంటున్నాను.'

'అంత అరువుపద్దుమీద ఈ బరువు నెత్తి నెత్తుకోకపోతే నేం?'

'అప్పటికి బుద్ధి మందగించి అలా చేశాను.'

'సరే దారి కొస్తున్నావు. ఎంత జీతం కావాలి.'

'ప్రస్తుతం చేతులోకి రెండువేల రూపాయిలు కావాలి. నెలజీతం 380 రూపాయి ఉంటే చాలు.'

'సరే నువ్వు కోరం దేమంత అబ్బరం కాదు. అయినా నువ్వు చేయగల పని ఏమిటి?'

'ఏ పనైనాసరే హాంగులుంటే బాగా చేస్తాను.'

'యింటో బంగారం వెండి అమ్మేస్తే నాలుగు వేల రూపాయిలు పైగా వస్తుంది. మంచి లాభసాటిగా బిజినెస్ చెయ్యగలవా?'

'ఆ చేవ మనలో కనపడదు. అలా తెగిస్తే మొదటికే మోసం రావడం తప్పదు.'

'పోనీలే. ఒక గ్రామంలో ఉండే జనాభా అందర్నీ కూడగట్టుకుని ఒక గ్రామాభివృద్ధి ప్రణాళికని అమలులో పెట్టగలవా?'

'ఏ గ్రామంలోనైనా ప్రజలు కూడగట్టుకొస్తే కూడుకుంటారని నాకు నమ్మకం లేదు.'

'లేకపోతే రెండు సంవత్సరాలు కష్టపడి పరిశోధనలు సాగించి డాక్టరు బిరుదు సంపాదించగలవా?'

'రెండు సంవత్సరాలు పరిశోధనలు సాగిస్తాను గాని కష్టపడ దల్చుకోలేదు. ఇప్పటికి నేపడ్డ కష్టంచాలు.'

'అయితే నీవుకోరిన జీతం నీకిస్తే పరిశోధనలు సాగిస్తావన్నమాట.'

'సాగిస్తాను'

'సాగించిన తరువాత డాక్టరు పట్టం పొందగల యోగ్యత కనబరుస్తావా?'

'దానికి నే నిప్పుడు మాటయివ్వను. నా పరిశోధనలు యాచుకుపోవచ్చును.'

'పోనీ యిప్పుడు నేనొక అయిదు వేల రూపాయిలు పెట్టుబడి పెడితేఏం చేస్తావ్?'

'హాయిగా ఖర్చు పెట్టుకుంటాను. మళ్ళీ తీర్చడం యెలాగ?'

'కాఫీగింజల వర్తకం పెట్టుకున్నా, వీసెకి అర్ధరూపాయి లాభం వస్తుంది.'

'అలాంటిదే మనకు చేతకానిపని.'

నాతో నా సంవాదం

'పోనీ అయిదు వేల రూపాయిలతో ఏం చేస్తావు.'

'మా యింట్లో ఒక గది రీడింగ్ రూము గానూ, ఒక గది చదరంగపు క్లబ్బుగానూ మారుస్తాను.'

'మనిషిలో ఉన్న అసలు రోగం బయట పడుతోంది. సరే యిప్పుడు నాదగ్గర అయిదు వేల రూపాయిలు లేవు. మరి ఏం చేయ దల్చుకున్నావు?'

'ఏమీ చేయదల్చుకోలేదు. కాని తప్పకుండా ఏదో గాలిపాటున సిరికొట్టుకొస్తుందని తలుపు తెరుచుకుని ఎదురు చూస్తున్నాను.'

'బాగుంది. రేపటికి నీయిల్లు బంగారం అవుతుందిగాని అందాకా ఒక మేదరి తట్ట లోకి నీళ్ళు తోడుతూ ఉండు.' ★

కాలక్షేపం

(6-వ పేజీ తరువాయి)

సంభవింపవు - అని ఆ ఇంగ్లీషు వాక్యం యొక్క అర్థం. కాని ఆ వాక్యానికి యింకొక బాహ్యార్థం ఏమిటంటే "మిస్ ఫార్చ్యూన్స్" అనగా దురదృష్టాలు అనేవి ఒక్కొక్కటిగా విడివిడిగా సంభవింపవు అని అర్థం. చిక్కులన్నీ ఒక్కసారిగా వస్తాయని అర్థం. కాని "అదృష్టం" యొక్క సంతానమే "దురదృష్టం" అన్నట్లుగా ఇంగ్లీషులో పదవిభాగం చేశాడు. ఈ మహానదులు మనకు లభించడమే మన అదృష్టం. ఈ అదృష్టంలోనుంచి సంభవించినవే మన దురదృష్టాలు - కరవు దరిద్రము నిత్యాబ్దికములుగా ఉన్నాయి. యీ దురదృష్టాన్ని తొలగించే దూరదృష్టి కావాలి.

"దూరదృష్టి" దీర్ఘంగా లేనప్పుడే "దురదృష్టం" సంఘటిస్తుందని ఒక సరసమధుర చతురవచన సుజనవరుడు అన్నాడు. "కృష్ణా-పెన్నారు" ప్రాజెక్టు, నందికొండ ప్రాజెక్టును నంబికొండయ లాగున ఎదురు వచ్చినదనే హేతువుచేత నందికొండకు కృష్ణాతీరవాసులందరూ "కృష్ణార్పణం" అనవలసినదేనా? భూమిన్ (భూమియందు), వరులన్ (వరి ధాన్యములను) పెంచు భూమివరులు (భూస్వాములు) అందరూ ఈ విషయమై ఆలోచించాలి. కృష్ణానదీప్రాంత భూమివరుల-పెంచు భూమివరులను ఉద్దేశించిచెప్పబడిన పద్యం ఇది. అందుకనే "కృష్ణభూవరా!" (కృష్ణా ప్రాంత భూస్వామీ!) అని పద్యం చివర సంబోధింపబడింది. కరవు, దరిద్ర మాబ్దికముగా (సంవత్సరవారీగా) సంభవించకుండా సాధనోపాయం సాధించవలెనో కృష్ణభూవరా! అనే ప్రబోధం యీ పద్యంలో ఉంది. దానిని సాధించే శక్తి మనలో లేకపోయినట్లయితే,

"కరవు దరిద్ర మాబ్దికముగా
ఘటియించును కృష్ణభూవరా!
అనేమాట తథ్యం. ★

బరోడా మహారాజాగారి బ్రహ్మాండపు వస్తాదు

పూర్వము బరోడా మహారాజాగారైన శ్రీమంతు ఖండేరావు మహారాజ్ గైక్వారుగారు "రాంజూ" అనే వస్తాదుకు చాలా శ్రద్ధగా తయారు పెట్టించి పోషించారు. ఈ విషయవివరములు 1927 సం॥లో "వ్యాయామ" అనే ఇంగ్లీషు పత్రికలో యీ క్రింది విధంగా ప్రకటింపబడెను. "రాంజూ" వస్తాదు రోజు 1½ పౌనుల వెన్న, వెండి రేకులు బంగారు రేకులు కప్పినటువంటిది తినేవాడు. పాలకోవా మిఠాయీలు లడ్డూలు ఇంకా యితర విలువగల ఆహారం తినేవాడు. రోజు 1½ వేయి దండెములు బస్కీలు తీసేవాడు. ఎద్దులు మోట తోలేటటువంటి పెద్ద బక్కెటుతో రోజుకు 2 వేల బక్కెట్లు నీళ్లు తోడేవాడు. రోజూ 10 మైళ్ల దూరం పరుగెత్తేవాడు. ఇతడు కుస్తీలో సాటిలేని వస్తాదు.

ఇతని శరీరము యొక్క తూకము 860 పౌనులు ఉండేది.

బ్రహ్మాండమైన శరీరంగలవాడగుటచేత, నలుగురు కూర్చుండే ఏనుగ అంబారీలో ఇతడొక్కడే కూర్చుండేవాడు.

"రాంజూను" కుస్తీలో ఓడించగలవాడు ఎవ్వడూ లేకపోవుటచేత అతనికి గర్వం ఎక్కువైపోతున్నదనే కారణంచేత "బూటా" అనే మరొక వస్తాదుకు ఖండేరావు మహారాజ్ గైక్వారుగారు, తయారుపెట్టించడం ప్రారంభించారు. "రాంజూ" అంతటి బ్రహ్మాండమైన శరీరము ఇతనికి ఏర్పడలేదు. కాని "బూటా" యొక్క కాళ్లుగాని చేతులుగాని ఇనుప ఖడ్డీలవలె ఉక్కు ముక్కలవలె తయారైనాయి. ఒకనాడు "బూటా" కున్నూ "రాంజూ" కున్నూ కుస్తీ జరిగింది. అందులో "కళావరు జంగు" అనే పేచీతో "రాంజూ"ను "బూటా" అవలీలగా చిత్తుచేసి ఓడించాడు. కాని వీరిద్దరికీ యీ కుస్తీ జరిగిననాటివరకు ఖండేరావు మహారాజ్ గైక్వారుగారు జీవించలేదు. ఇప్పటి బరోడా రాజాగారి తాతగారు వీరు.

సీరియల్ నవల

రెండు మహానగరాలు

చార్లెస్ డికెన్స్

41

"అతన్ని రక్షించాను"

ఆమాట డాక్టర్ రోజూ అంటూన్న పగటికలల పలవరింత మాటలుకావు. డార్నేను రక్షించాడు; అతను ప్రక్కనే నిల్చునున్నాడు కూడా! కాని లూసీ మాత్రం, యింకా, యెందుకో గాబరాగానే వుంది. మనసులో అర్థంలేని యేదో భయం.

చుట్టూవున్న పరిస్థితులు చూస్తే మహాభీభత్సంగా వుంది. జనం మతిచెడిన వీరావేశంలో వున్నారు. అనంతంగా హత్యలు సాగిపోతున్నాయ్; అర్థంలేని అనుమానాలు, అనవసరమైన క్రోధాలు; వేలాది అమాయకులను హత్యచేసిపారేస్తున్నారు. తనభర్త యెలాంటి అమాయకుడో వాళ్ళంతా కూడా అలాంటి వాళ్ళే! తన భర్తకోసం తను యెంత తాపత్రయ పడుతోందో, ఆ నశించిపోతున్న భర్తలకోసం వాళ్ల భార్యలూ అలానే యేడుస్తూ వుంటారు. తన భర్త యెలాగో యివతలపడ్డా, లూసీ మనస్సులో యింకా యేదో గుంజాటనగానే వుంది. ఏమో, మళ్ళా యేక్షణాన యేమిజరుగుతుందో. శీతాకాలపు సంధ్య చీకట్లు యిప్పుడిప్పుడే కొంచెం కొంచెంగా కనుతెరిపోతున్నయ్. కాని హతభాగ్యులను వధ్యశిలల దగ్గిరికి జారవేస్తున్న శకటాలు ఇంకా వీధులవెంట సాగిపోతూ వున్నయ్. ఆ బళ్ల వంక చూస్తోంది; కంగారెత్తిపోయి, ప్రక్కను నిలచివున్న భర్తను అలుముకుని గట్టిగా కావిలించుకుని గజగజావణుకుతోంది. తన భర్త ఆబళ్ళల్లోకి ఎగిరిపోతాడేమోనని భయంతో అతని చుట్టూతీగెలా పెనవేసుకుపోతోంది. డాక్టర్ మానెట్ కుమార్తెభయాన్ని పోగొట్టటానికి ప్రయత్నించుతున్నాడు. స్త్రీహృదయాన్ని ఆవేశించివున్న ఆ బలహీనతను చూసి జాలిపడుతున్నాడు. ఆయన యిప్పుడు అనంతమైన ఆత్మవిశ్వాసంతో వున్నాడు; చీకటికొట్టూ, చెప్పులు కుట్టడం, 105 నార్త్‌టవర్—ఇత్యాదయః రోజులన్నీ నశించిపోయాయ్; తాను అనుకున్న పని సాధించి తీరాడు; ఇచ్చిన వాగ్దానాన్ని చెల్లించి తీరాడు; చార్లెస్‌ను ఉద్ధరించాడు; తను గొప్పవాడు; తక్కిన ఆ బలహీనులంతా, తనమీద ఆధారపడి హాయిగా యిక బ్రతకొచ్చు!

వాళ్లు కుటుంబ ఖర్చులుకూడా చాలా తగ్గించివేసుకున్నారు. చాలా నిరాడంబర జీవితం; డబ్బు ఖర్చయిపోతుందని కూడా లేదు. అలా నిరాడంబరంగా బ్రతకటం క్షేమకరం; ప్రజలకు ఆగ్రహం కలుగకుండా వుంటుంది; ఖర్చుపెడదామన్నా వాళ్ళ దగ్గర యెక్కువ డబ్బుకూడా లేదు; జైల్లో వున్నన్ని రోజులూ, డార్నే యెన్నో ముడుపులు చెల్లించుకోవలసి వచ్చేది. తిండి క్రిందా, దిబ్బలుక్రిందా యెంతో కట్టుకోవలసి వచ్చింది. ఆ విధంగా చాలా డబ్బు ఖర్చయిపోయింది; చేతిలో ఆట్టే డబ్బు లేకుండా పోయింది. అయినా కారణాలచేతనూ, యింట్లోకి గూఢచారి రొమ్ముల కుంపటిని తెచ్చుకోవటం యిష్టంలేకనూ, ఒక నౌకర్నుకూడా యేర్పాటు చేసుకోకుండా కాలక్షేపం చేస్తున్నారు. ఏదైనా, మరీ అంత అవసరమైన పని తగిలితే బ్యాంకు భవనం గేటుముందు కాపలాకాస్తున్న నౌకర్లకు యేదో పనిచేయించుకుంటూ వుండేవారు. జర్రీక్రంచర్ యిప్పుడు వీళ్ళ కుటుంబంతోనే వుండిపోతున్నాడు; లారీగారు అతన్ని పూర్తిగా వీళ్ళ పనులు చూట్టానికి వదిలేశారు. క్రంచర్ ఇక్కడే తిని యిక్కడే పడుకుంటున్నాడు.

ప్రజా ప్రభుత్వం ఒక శాసనాన్ని అమలు జరిపింది. ప్రతి యింటి వీధి తలుపుమీదా, ఆ యింట్లో వుండే యావన్మంది పేర్లూ వివరంగా పెద్దపెద్ద అక్షరాలలో వ్రాసివుంచాలి; అందుచేత క్రంచర్ పేరుకూడా ఆ తలుపుమీది పేర్ల జాబితాలోకి యెక్కింది. ఆ వేళ ప్రొద్దు పడమట తిరుగుతోందనగా క్రంచర్ లోపలికి వచ్చాడు; అతను వీధి గుమ్మంలోకి అడుగు పెట్టేసరికి తలుపు మీద చార్లెస్ డార్నే పేరుకూడా వ్రాస్తూ ఒక ముచ్చివాడు కనిపించాడు. డాక్టర్ మానెట్ ఆ ముచ్చివాణ్ణి తీసుకొచ్చి అల్లుడి పేరుకూడా తలుపు మీద వ్రాయిస్తున్నాడు. ఆ ముచ్చివాణ్ణి ఖాతరీ చెయ్యకుండానే క్రంచర్ లోపలికి నడిచాడు.

ఇంట్లోకి కావలసిన సరుకులన్నీ, మామూలుగా, క్రంచర్‌ను వెంటబెట్టుకు వెళ్ళి మిస్ ప్రాస్ కొనుక్కొస్తూ వుంటుంది. క్రంచర్ తట్ట నెత్తిన పెట్టుకుని ఆవిడ వెంట వెడుతూవుంటాడు. కప్పెడు కప్పెడు చీకటిపడి దీపాలు వెలిగించే సమయంలో యిద్దరూ బయటికి బయలుదేరుతూ వుంటారు. కొనే సరుకులు కూడా అన్నీ ఒక దుకాణంలో కొనరు; అలా కొంటే యెవళ్లకీ అనుమానం తగలకుండా వుంటుంది.

క్రంచర్ తట్ట నెత్తిన పెట్టుకుని ప్రాస్ వెంట బయలుదేరాడు.

'ఈ వేళ అడ్డమైన సరుకులూ అనేకం కొనాలి—చాలాసేపు పట్టేట్టుంది; ఇంత వైన్‌కూడా కొనాలి, అది కొనడానికి యెక్కడికి పోయినా యీ ఎర్రతలలవాళ్లు తప్పతాగుతూ వుంటారు' అన్నది ప్రాస్.


మరేం ఫరవాలేదన్నాడు క్రంచర్.

'ఏం ఫరవాలేదు—హత్యలూ హంగామాలూ—తట్టుపర్ల వెధవలు!'

'ఇష్!—అలా అనకూడదు—కొంచెం జాగ్రత్తగా మాట్లాడుతూ వుండు' అని మందలించింది లూసీ.

'అవునవును! మరిచేపోయాను—జాగ్రత్తగా మాట్లాడాలి

అనువాదం: తెన్నేటి సూరి



ప్రభాతసమయంలో హౌరాబ్రిడ్జి, కలకత్తా. —ఛాయా చిత్రకారుడు: శ్రీ రావులపర్తి భద్రిరాజు.

★ రెండు మహానగరాలు ★

నిందే—నేను మళ్ళీ ఇంటికి తిరిగొచ్చేదాకా నువ్వుమాత్రం గుమ్మందాటి కదలకు; మీ ఆయన్ను కూడా గుమ్మం దాటనివ్వకు—అతని భుజంమీదనుంచి తల యివతలికి తియ్యొద్దు—అంతే! అయితే డాక్టర్ గారూ మిమ్మల్ని ఒకమాట అడగొచ్చా?'

'ఓ! అడగొచ్చు—నువ్వు నాదగ్గిర ఆమాత్రం స్వాతంత్ర్యం తీసుకోవటానికి అభ్యంతర మేమిటి?'

'మీరు స్వాతంత్ర్యం సంగతి మాత్రం ఇకెప్పుడూ ఎత్తొద్దు—ఇప్పటికే ఆ దౌర్భాగ్యం చాలా అనుభవించాం'—

'ఇష్—మళ్ళీ అదే ధోరణా'—లూసీ మరొకసారి తిరిగి మందలించింది!

'లేదు లేతల్లీ—ఇంతకీ చెప్పొచ్చిం దేమిటంటే—నేను మహోఘనత వహించిన జార్జిరాజుల దేశంలో పుట్టడం పూర్వ పుణ్యం—'గాడ్ సేవ్ ది కింగ్! (భగవంతుడు మహారాజును రక్షించుగాక!)—

ఆ జోహారును అందిపుచ్చుకుని క్రంచర్ కూడా తన ప్రభుభక్తి తత్పరతను వెల్లడించుకున్నాడు.

'నీలో ఆమాత్రం ఆంగ్లేయతత్వం వుంటం మెచ్చదగిన సంగతే—కాని, ఆ విధవ బొంగురుగొంతేమిటి?' అన్నది ప్రాస్—'ఇంతకీ, డాక్టర్ గారూ! మనకి యమపట్నం చేర వొదిలేది వుందా లేదా?'—

'ఇప్పుడప్పుడే వీల్లేదు—చార్లెస్ యోగక్షేమాలదృష్ట్యా యిప్పుడప్పుడే బయలుదేరడం మంచిదిగాదు.

'ఊహూ! సరే!—అదా?—అవును తొందరపడటం మంచిది గాదు—మాతమ్ముడు సాల్మన్ అంటూవుండేవాడు—

అలవిగాని వేళ అధికుల మనరాదు, తలవంచుకు తిరగాలి అని—ఆఁ!—ఏవిటా అబ్బీ ఇక బయల్దేరదామా?—రా నాయనా రా!—అమ్మాయ్ వెళ్లి రామ్మా?'

ఇద్దరూ బయటికి వెళ్లిపోయారు. లూసీ, డార్నే, డాక్టరూ, లూసీకూతురూ గదిలో కూర్చుని యేవో కబుర్లు చెప్పుకుంటున్నారు. బ్యాంకునుంచి లారీ వస్తాడని యెదురు చూస్తున్నారు. పసిబిడ్డ లూసీ తాతగారి పక్కనే కూర్చుని బాతాఖానీ వేస్తోంది; డాక్టర్ గారు మనుమరాలికి కథ చెబుతున్నాడు: ఆ కథలో, ఒక దేవకన్య వుండేదనీ, అది జైలుతలుపులు పగలగొట్టేసి లోపలున్న ఖైదీని ఒకణ్ణి బయటికి తీసుకొచ్చి కాపాడిందనీ, యిత్యాదయః చెప్పుకుపోతున్నాడు.

ఉన్నట్టుండి: 'ఆఁ!—ఏమిటది?—' అంటూ కంగారు పడ్డది లూసీ.

చెబుతూ చెబుతున్న కథను చివాల్న ఆపేసి, డాక్టర్

'ఏవిటి తల్లీ కంగారూ నే నిక్కడవుండగానే' అంటూ భుజంమీద చెయ్యి వేసి బుజ్జగించాడు.

'అది కాదు నాన్నా; మెట్లమీద ఎవరో కొత్తమనుషులు నడుస్తున్నట్లు అడుగుల చప్పుడు వినిపిస్తోంది.

'మెట్లమీద చప్పుడేవిటి తల్లీ—ఏమీ లేందే' డాక్టర్ యీ మాట అంటూండగానే ఎవరో గబగబా తలుపు కొడుతున్నట్టు చప్పుడు వినిపించింది.

'నాన్నా! నాన్నా!—ఎవరో! ఏవిఁటో!— ఆయన్ని దాచేయ్—నా భర్తను రక్షించు'—అంటూ, వెర్రిదానిలాగ బెంబేలుపడి యేడ్చింది.

'వెర్రి తల్లీ! యేవిటంత పిరికితనం; అతన్ని రక్షించి తెచ్చుకుని యెన్నాళ్ళయింది; ఇంత పెద్ద గుండె లేవేఁటి తల్లీ?—అసలు యేవిఁటో తలుపు దగ్గిరికి వెళ్లి చూణ్ణీ'—

లాంతరు చేత్తో బుచ్చుకుని ముందున్న రెండు గదులూ దాటి బయటి తలుపు తెరిచాడు. కత్తులూ తుపాకులూ బుచ్చుకు నలుగురు యెర్రటోపీ గుండాలు బిలబిలా లోపలికి వచ్చారు.

'డార్నే అనే ఎవ్రీమాండ్ యెక్కడ?' అన్నాడు అందులో ఒకడు.

'నాకోసం వచ్చింది వరు?' అంటూ డార్నే దగ్గిరికొచ్చాడు.

'నేనూ!—మేవూఁ—నిన్ను మళ్లీ ఖైదు—చేస్తున్నాం' అంటూనే నలుగురూ అతన్ని చుట్టేశారు. లూసీ లూసీబిడ్డా, కంగారుగా యేడుస్తూ అతన్ని పెనవేసుకున్నారు'

'నన్ను ఎందుకు అరెస్టు చేస్తున్నారో—ఏమిటో చెబుతారా?'

'ముందు జైలుకు దయచేస్తే: రేపు ఉదయం విచారణసంఘం వారినడిగి అవన్నీ తెలుసుకోవచ్చు' అన్నాడు, వాళ్ళలో ఒకడు.

వాళ్లు హఠాత్తుగా అలా రావటం చూసి, దిగ్భ్రాంతుడై స్తంభించి నిల్చునిపోయిన డాక్టర్ అప్పటికి కాస్త స్పృహలో కొచ్చాడు. లాంతరు నెమ్మదిగా క్రింద బెట్టి:

'అబ్బాయి నే నెవరో తెలుసా?' అన్నా అంటూ ముందు కొచ్చాడు.

'మిమ్మల్ని యెరక్కపోడం యేమిటండీ డాక్టర్ గారూ?' అన్నాడు, ముందు పీటేలో తుపాకి బుచ్చుకు నిల్చున్న ఆ కుర్రాడు.

'మిమ్మల్ని అంతా యెరుదుమండీ' అన్నారు ఆముగ్గురూ కూడా.

'అయితే అబ్బాయీ?—ఇదంతా ఇలా ఎందుకు జరిగిందో కాస్త చెబుతారా?' అన్నాడు డాక్టరు.

'సెయింట్ ఆంటోనీ ప్రజలు ఈయన మీద "నేరారోపణ చేశారు'

'ఎవరా నేరారోపణ చేసినవారు—పేరు చెబుతారా? –

'అల్లా చెప్పటం తప్పనుకోండి—అయినా మీరు తెలుసుకోవాలంటే చెబుతాం— ఆ నేరారోపణ చేసినవారిలో ఒకరు డిఫార్జ్—మరొకరు?'

'ఆఁ!—మరొకరు?'—

'అంతే లేండి—ఆ రెండో మనిషెవరో రేపు కోర్టులో తెలుసుకుందురు గాని—ఇక ఇప్పుడు చెప్పేదిలేదు.' ★

అందని రాగాలు

శ్రీ చల్లా చంద్రమౌళి

రాధాయి డాబామీద నాన్న పక్కలో దొల్లుతున్నాడు. ఇవాళ వాడికి నిద్రకూ చాలా దూరమైపోయింది. అమ్మా నాన్నా కూడా అంత ఉత్సాహంగా లేరు. పగలంతా కష్టించి, ఫలితంగా పట్టెడు ముద్దనుకూడా పొందలేక పస్తులు పడుంటే పాటకపుజనాన్ని కూడా చిరుగాలి వీవనలో వెలుగుపాటలతో బాధనంతా మరిచిపోయి పరవశమయేటట్లు నిద్రపుచ్చ గలిగిన ఆ వెన్నెలరాత్రి కూడా వారి ముఖాన విషాదచ్ఛాయలను పోగొట్టలేకపోతోంది. కనీసం రాధాయి చిన్ని హృదయాన్నైనా మురిపించి మురిపించలేక పోతున్నది.

మెడవరకూ కప్పుకున్న దుప్పటిలో విసుగ్గా పక్కకు ఒత్తిగిలాడు రాధాయి.

“వెధవాయి వీడూ నిద్రపోలేదింకా, ఊరికే దొల్లుతున్నాడు” అన్నాడు నాన్న?

“వాడికి మాత్రం బెంగగా ఉండదూ. మనకే ఇలా ఉందే” అని అమ్మ అంది. “రోజూ ఈ పాటికి ఇక్కడే కబుర్లు చెప్పుకుంటూ ఉండేవాళ్లు” అంది అమ్మ. ఈ మాటల్లో కనిపించిన సానుభూతికి రాధాయి కేడుపొచ్చింది.

‘అవును అక్క తనకెన్నో కబుర్లు చెప్పేది. రోజూ అక్కా తనూ అక్కడే పక్కేసుకుని పడుకునేవాళ్ళు. అక్కను ఎన్నో అడిగేవాడు. తెల్లనివెన్నెల్లో అస్పష్టంగా కనుపిస్తున్న చెట్ల వెండి రెక్కలను టపటప లాడిస్తూ వింతగా అరుస్తున్న పక్షులను గురించి అక్కను ఏవేవో అడిగేవాడు. అక్కకూడా అన్నిటికీ సమాధానం చెప్పేది ఓపిగ్గా. తెల్లగా వెన్నముద్దలా ఉన్న చందమామను గురించీ, మిలమిలా మెరుస్తూ తనవైపే చూస్తున్నట్లున్న చుక్కల్ని గురించీ అక్క తనకెన్నో కథలు చెప్పేది అక్కకివన్నీ ఎలా తెలిశాయో అనుకునేవాడు. తన అక్కకు తప్ప ఇంకెవరి అక్కలకూ తెలియవనుకునేవాడు. ఒక్కసారిగా అక్క మీద అభిమానం పుట్టుకొచ్చేది ఆప్యాయంగా అక్క వళ్లోచేరి ‘ఇవన్నీ నీకెవరు చెప్పారే’ అనేవాడు యాచనగా అక్క చిన్నగానవ్వి కాసేపాలోచించి ‘ఆ చందమామ చెప్పాడురా’ అనేది తన కాశ్చర్యం కలిగేది. తనెంత ఆలోచించినా అక్కకు చందమామ కథ లెప్పుడెలా చెప్పుతాడో అర్థమయ్యేది కాదు. కాని అక్క అబద్ధం చెప్పదనే నమ్మకంతో అది నిజమే ననుకొనేవాడు. ఐనా ఎప్పుడు చెప్పాడో అక్కను కనుగొందామని నోరు తెరిచేసరికి, ‘ఇంకా పడుకోలేదూ? తెల్లవారి ఎనిమిదైనా లేవరు.’ అని నాన్న గద్దింపులు వినబడేవి. అప్పటికి నిద్రపోవాలనేసంగతి గుర్తుకొచ్చి అక్క పక్కలో చేరి అక్క చెప్పిన కథలు గుర్తుకు తెచ్చుకుంటూ, తనకుకూడా చందమామ ఎప్పుడైనా కథలు చెప్తాడేమో ననే ఆశతో నే నిద్రపోయేవాడు.

ఇప్పుడు రాధాయి మనస్సులో ఆ జరిగిపోయిన వన్నీ తిరిగిపోతున్నై.

అమ్మా నాన్నా దగ్గర ఉన్నా కూడా వాడికా వేళ ఏదో ఒంటరిపాటుగానే ఉంది.

“అక్క ఎప్పుడొస్తుందో?...” పక్కకు తిరిగి పడుకుంటూ తనలో తానే అనుకున్నాడు మెల్లిగా.

నిద్ర రావడం లేదు. అసలు నాన్న దగ్గర పక్కే కుదరడం లేదు వాడికి.

“...అమ్మదగ్గిర పడుకుంటే???” రాధాయి మెల్లిగా లేచాడు.

“ఎందుకురా లేచావు, పడుకో” అన్నాడు నాన్న.

‘నిద్రపట్టడం లేదు నాన్నా.’

ఎందుకు పట్టడం లేదో నాన్నకు తెలుసు. కాబట్టే గద్దింపుగా రావలసిన మాటలు, బుజ్జగింపుగా వచ్చినై “కళ్ళుమూసుకు పడుకో నాన్నా, నిద్రపడుతుంది.”

‘అమ్మదగ్గర పడుకుంటాను నాన్నా’ గారాబంగా అడిగాడు.

‘అమ్మ దగ్గర పాపాయుందిగా’.

‘అటువేపు పడుకుంటాను.’

‘ఒద్దులే. ఇక్కడే పడుకో.’

నాన్న వద్దనేసరికి అమ్మ దగ్గరే బా-- టుందని రాధాయికి ఇంకా ఎక్కువగా అనిపించింది.

‘పోనీ పంపండి ఇటువైపు పడుకుంటాడు’ అని అమ్మ అంది. “రోజూ అక్క దగ్గర పడుకునేవాడు, నా దగ్గరైనా కాస్త నిద్రపోతాడేమో.’

‘ఏరా? అమ్మదగ్గరన్నా నిద్రపోతావా? ఇట్లాగే దొల్లుతుంటావా?’

‘నిద్రపోతాను.’

అమ్మ దగ్గర కొచ్చి పడుకున్నాడు. నిద్రపట్టడం కోసం నాన్న చెప్పిన సూత్రాన్ననుసరించి కళ్లుగట్టిగా మూసుకున్నాడు.

...కానీ...అక్కడకూడా వాడికేం సంతృప్తిగా లేదు. నిద్రకూ వాడికీ చాలా దూరం ఏర్పడిందా వేళ...పక్కకు తిరిగి కళ్లు తెరిచాడు. అక్కా తనూ పడుకునే మంచం కాళీగా ఎత్తిపెట్టివుంది. ‘అక్క మళ్ళీ ఎప్పుడొస్తుందో?’ అంటూ పక్కకు ఒత్తిగిల్లాడు రాధాయి.

‘సన్నాసి ఊరికే దొల్లుతున్నాడండీ’ అని అమ్మ అనునయంగా అంది. ‘ఇవాళ వాడికి మనదగ్గర నిద్రపట్టడం లేదు కామాలు.’

‘కళ్లుమూసుకు పడుకోరా’ నాన్న కొంచెం గదిమాడు.

‘గదమకండీ అసలే వాడదోరకంగా ఉంటే?...’

‘అదోరకమేమిటి వాడిమొహం నువ్వే ఏదో కెపెడుతుంటావు—’

నాన్న అలా అనాలని అన్నట్టుగా అన్నాడు.

‘నేను కెపెట్టాలీ? ఇన్నేళ్ళొచ్చి మనకే ఇట్లా ఉండే. మరి వాడు బెంగపడ్డాడంటే పడడూ? ఊహ తెలిసినప్పటినుంచి దాన్నొదిలి ఎరగడాయెను!—’

ఆ మాటకు నాన్నకూడా నిట్టూర్చాడొక్కమాటు.

అమ్మ మళ్ళీ అంది. ‘అక్కడే అదెల్లా ఉందో? ఒక్క క్షణం వాణ్ణొదిలుండేది కాదు.’

రాధాయి ఒక్క ఊపులో బావగారి వూళ్లో పోయిపడ్డాడు. అక్క ఇప్పుడేం చేస్తుంటుందో?...ఎవరికైనా కథలు చెప్తుంటుందేమో?... ఎవరికి చెప్తుంది?...ఒకవేళ బావకు చెప్తుందేమో?...ఆ ఆలోచన కలిగేసరికి రాధాయికి నవ్వొచ్చింది.

అక్క అసలు బావతో మాట్లాడనే మాట్లాడదు. స్నానానికి పిలవడానికీ, ఫలహార మివ్వడానికీ తననే పంపేది. అక్క బావకు కథ లెలా చెప్తుంది! ఒక వేళ

చెప్పినా చిన్నపిల్లలల్లే బావ కథలు వింటూ వేమిటి?... తెలిసీ తెలియని రాధాయి ఊహాల్లో ఏమేమో తిరిగి పోతున్నై.

'ఏమోలే; నా బరువు తీరింది. వాళ్ళ పిల్లను వాళ్ళ కప్పచెప్పి దానింటికి దాన్ని పంపించాను.' ఇందాకటినుండీ ఏదో ఆలోచిస్తున్న నాన్న బరువుగా నిట్టూరుస్తూ అన్నాడు.

రాధాయి కీ మాటలు వింతగా ఉన్నై. 'అక్క వాళ్ళ పిల్లా? అక్క ఇల్లు ఇది కాదూ?, అయితే నేనెవరి పిల్లాణ్ని?, నా ఇల్లేదీ?...రాధాయి కేమీ అర్థంగా లేదు...పోనీ అమ్మనడిగితే?...కోప్పడుతుం దేమో?...రాధాయి కొంచెం సంశయించాడు. 'అక్కైతే అన్నిటికీ ఓపిగ్గా సమాధానం చెప్పేది.'

'అక్క ఇల్లు ఇదికాదటే అమ్మా?' అడిగేశాడు ఉండబట్టలేక కొట్టినా సరేనని. అమ్మకునవ్వువచ్చిందా అమాయిక ప్రశ్నకు.

'ఇదెందుకౌతుందీ? ఇది నీ ఇల్లు' నవ్వులోనే సమాధానం చెప్పింది.

'అయితే మరి అక్కకు?'

'బావగారిల్లే అక్క ఇల్లు'

'ఐతే అక్క ఇహా ఇక్కడ ఉండదూ?'

'ఏమో బావ దయ, బావపంపితే రెండు పూట లుండిపోతుంది. లేకపోతే లేదు', అమ్మలో మళ్లీ కొంచెం విషాదరేఖలు తలెత్తినై.

రాధాయి కిదేమీ అర్థంకాలేదు. అమ్మ చెప్పిన సమాధానంవల్ల ఏమీ అర్థం కాకపోయినా కొత్త సమస్యలు తలెత్తినై వాడి మెదడులో. 'ఇది అక్క యిల్లు కాదూ? నా ఇల్లా?...' తనకంటే పెద్దదైన అక్క ఇల్లు కాకుండా తన దెందుకైంది? రాధాయి చిన్న మెదడెంతాలోచించినా ఈ ప్రశ్నకు సమాధానంలేదు. 'అసలిది తన ఇల్లని ఎప్పుడూ అనుకోలేదే?' అసలా మాటే తనకు తట్టలేదు. అమ్మా, నాన్నా, తనూ, పాపాయీ, అందరిదీ ఈ ఇల్లనుకునేవాడు తను. మరి అమ్మ తనిల్లంటుందేం?...

"అయితే అమ్మా? అక్కది కాకుండా నా ఇల్లెందుకైందే?"

అడిగాడో లేదో 'పలక్కుండా పడుకో వెధవా' అని గదిమాడు నాన్న. అమ్మైనా సమాధానం చెప్పకుండా 'నాన్న కోప్పడతారు కళ్లుమూసుకు పడుకో నాయనా!' అని బుజ్జగింపుగా చెప్పింది

'ఈ పెద్దవాళ్లెప్పుడింతే, అక్కైతే?

అవును అక్కైతే అన్నిటికీ సమాధానం చెప్పేది ఓపిగ్గా' రాధాయి కేడుపొచ్చింది

'ఎప్పుడో బావ పంపిస్తే తప్ప అక్క మళ్ళీరాదు. అదైనా రెండు పూటలే వుంటుంది' రాధాయి మనస్సులో నిరాశ పెద్దపెట్టున చీకట్లు నింపింది

'అక్కకు మాత్రం అక్కడేం తోస్తుందనీ', 'మళ్ళీ తప్పక వస్తుందనీ' తెలిసీ తెలియని వాడి ఊహాకు తట్టినప్పుడు ఒక చిన్న ఆశాబీజం మొలకెత్తినా 'వాళ్ళ పిల్ల వాళ్ళింటికి వెళ్ళింది' తనింటికి రావనే భావం విషపురుగై దాన్ని మొదలంటా తినేస్తున్నది

అక్క ఊరికి వెళ్ళినప్పటినుండీ రెంగ



రాధాయికి ఎందుకో భయంపుట్టింది కళ్లుతెరిచి ఆకాశంవైపు చూశాడు దొరికిన చుక్కలన్నిటినీ మింగుతూ, చందమామను కూడా పట్టుకోడానికి పరుగెత్తుతున్నై మబ్బులు

డిప్యూటీ స్పీకర్

ఒకసారి ఏలూరులో హిందీసభలు జరిగాయి. వానికి భారత శాసనసభ ఉపాధ్యక్షులు శ్రీ మాడభూషి అనంతశయనం అయ్యంగార్ ఆహ్వానింపబడ్డారు. వారి నిమిత్తం ఆహ్వాన సంఘంవారు ట్రావిలర్సుబంగళా రిజర్వు చేసి, బంగళావాచరుతో, 'బంగళా డిప్యూటీ స్పీకర్ గారికి రిజర్వు చేశాం. ఎవరికీ యివ్వవద్దు జాగ్రత్త' అని చెప్పారు. బంగళా రిజర్వేషన్ ఆ అయ్యంగారికి తెలియజేశారు.

శ్రీ అయ్యంగారు వస్తానని వ్రాసిన రోజున రావలసిన ట్రెయినుకు రాలేదు. తర్వాత ట్రెయినుకు వచ్చారు. ఎప్పుడు వస్తారో తెలియక ఆహ్వాన సంఘంవారెవరూ వారిని స్టేషనులో ఎదుర్కొనే అవకాశం లేకపోయింది.

ట్రెయిను దిగి శ్రీ అయ్యంగారు రిక్షాయెక్కి సరాసరి ట్రావిలర్సుబంగళాకు వెళ్ళి వాచరును 'బంగళాగది తాళం తీసి యివ్వ'మన్నారు. వాచరు 'బంగళా డిప్యూటీస్పీకర్ గారికి రిజర్వు చేయబడిం'దనీ, 'ఎవరికీయివ్వడానికి వీలులే'దనీ, అన్నాడు-సాదా ఖద్దరుధోవతీ పంచ, కండువా వేసికొని, కనీసం హోల్డాలైనా లేకుండా, దేశవాళీ,కంబళిచుట్టి తాడుతో కట్టిన బెడ్డింగు చేత్తో పుచ్చుకొని, రిక్షామీద వచ్చినవ్యక్తిని డిప్యూటీస్పీకర్‌గా వాచరు గుర్తించలేదంటే వాడి నన వలసిన పనేముంది?

అయినా సాహసం చేసి శ్రీ అయ్యంగారు తానే ఆ డిప్యూటీ స్పీకర్‌ననీ, తన కోసమే బంగళా రిజర్వు చేయబడిందనీ, గది తాళం తీయవలసిందనీ అన్నారు.

దానితో వాచరుకు కోపం వచ్చిపోయింది. ఏమయ్యా. చూస్తే పెద్దవారుకూడాను, నన్ను మోసంచేసి మాట తెప్పిద్దా మనుకుంటున్నారే. మీరు డిప్యూటీస్పీకరైతే, నేను కలెక్టరును ఎందుకు కాకూడదు - నేనే డిప్యూటీ స్పీకర్ గారిని ఎరక్కపోతే

శ్రీ యం. చంద్రశేఖర్

మరీ మోసం చేసిఉందురు. అబద్ధమాడినా అతుక్కునేటట్లు ఉండాలి గాని, డిప్యూటీ స్పీకర్ అమ్మగారిని నేనెరగనా? మగవాడవు వచ్చి డిప్యూటీ స్పీకర్‌నని అంటే ఏలా నమ్మతారనుకున్నావయ్యా- ఈసారికి సరిపోయింది గాని, ఇకముందెన్నడూ ఈలా మాట్లాడబోకండి అన్నాడు. వాచరు మాట్లాడేది శ్రీ అయ్యంగారికి బోధపడలేదు- "ఏరా అబ్బాయి! డిప్యూటీ స్పీకరు అమ్మగారు అంటావేమిటిరా" అన్నారు.

"అవునండీ, ఆమె మద్రాసు నుండి ప్రతినెలా యిక్కడకు వచ్చి ఈగదిలోనే బస చేస్తారండి. ఆమెనే ఎరగననుకున్నారేంటి" అన్నాడు.

దాంతో అర్థమయింది శ్రీ అయ్యంగారికి - వాచరు మద్రాసు శాసనసభ డిప్యూటీ స్పీకర్ శ్రీమతి సి. అమ్మన్న రాజాగారిని గురించి మాట్లాడుతున్నాడని-ఆమె ఏలూరునుండే శాసనసభకు ఎన్నుకోబడింది కనుక సాధారణంగా ప్రతినెలా ఏలూరు వచ్చి, ఈ బంగళాలో బసచేసేవారు. "నీవన్నది నిజమే, ఆమె మద్రాసు సభకు డిప్యూటీ స్పీకరు-నేను అంతకన్న పెద్దసభ ఢిల్లీలో ఉంది, ఆ సభలో డిప్యూటీస్పీకరును. ఇప్పటికైనా తెలిసిందా? యిక తాళం తియ్యి"అన్నారు అయ్యంగారు-

దానితో వాచరు అగ్గిమీద గుగ్గిల మయ్యాడు- "సరిసరి. యింతవరకూ నేనే డిప్యూటీస్పీకరు నన్నారూ, తీరా, ఆమెను నేనెరుగుదునని దాఖలా చూపేసరికి, ప్లేటు మార్చి, 'ఆమె మద్రాసు డిప్యూటీ స్పీకరు, నేను ఢిల్లీ డిప్యూటీ స్పీకరు' నంటున్నారు. నేనేం, ఈ డబాయింపులకు మోసపోయేరకంకాదు - ఢిల్లీ డిప్యూటీ స్పీకరువో, బొంబాయి డిప్యూటీస్పీకరువో

(42-వ పేజీ చూడండి)

అందని రాగాలు

గానే ఉన్న రాధాయికి ఇప్పుడు అమ్మ చెప్పిన మాటలతో పిచ్చెత్తినట్టైంది.

'ఇది అక్క ఇల్లు కాకుండా తనదెందుకైం'దనే సమస్యలో అక్క మళ్ళీ రాదనే నిరాశ గట్టిగా బిగుసుకుపోయింది.

ఆశానిరాశల అంచుల్లో కళ్లు మూసుకుని దిగులుగా పడుకున్న రాధాయిని చూచి 'నిద్రపోయా'డని సంతృప్తి పడ్డారు అమ్మా నాన్నా.

రాధాయికి నిద్రపట్టలేదు. కళ్లు మూసుకుంటే గజిబిజిగా ఉంది. 'అక్క మళ్లీ రాదూ?'...ఇది వాళ్లిల్లు కాదుగా!...నా ఇంటికెందుకొస్తుందీ? రాధాయికి ఎందుకో భయం పుట్టిం. కళ్లు తెరిచి ఆకాశం వైపు చూశాడు దొరికిన చుక్కలన్నిటినీ మింగుతూ చందమామను కూడా పట్టుకోడానికి పరుగెత్తుతున్నై మబ్బులు. మబ్బుల్లో పడబోతున్న చందమామ కూడా జాలిగా చూస్తున్నాడు రాధాయి కేసి.

'అక్క ఇల్లు ఇదికాదుగా, ఎందుకొస్తుందీ' అని చందమామ జాలిగా తనతో అంటున్నట్టు అనిపించింది రాధాయికి. కొంచెం కొంచెంగా మబ్బుల నోట్లో పడుతున్న చందమామను చూచేసరికి వాడికి భయం కలిగింది. కళ్లు మూసుకున్నాడు. చీకట్లో అన్నీ అల్లిబిల్లిగా తిరుగుతున్నట్లనిపించింది. ఆ అల్లకల్లోలంలో ఎక్కడో ఒక మూలనుండి అస్పష్టంగా రాధాయి గొంతే వినిపిస్తున్నది. 'అక్క యిల్లు ఇది కాదుగా, మళ్లీ ఎందుకొస్తుందీ?...'

* * *

భళ్లున తెల్లవారింది. రాధాయి కళ్లు తెరవలేదు. ఒళ్లు సలసలా కాగిపోతున్నది. నాన్న డాక్టర్ని తీసుకొచ్చాడు. రోగలక్షణాలర్థమైనవో లేదో కాని స్టెతస్కోపు ఒక్కమారటూ ఇటూ చూచి మందిచ్చి పోయినాడు డాక్టరు.

మందుగ్లాసు చేత్తో పుచ్చుకుని మందు తాగమని బ్రతిమాలింది అమ్మ.

రాధాయి కళ్లు తెరిచి అమ్మవైపు చూచాడు. ఆ చూపుల్లో నీరసమూ, నిరాశా వ్యక్తమౌతున్నై.

'అమ్మా!' అని బరువుగా అన్నాడు. ఏదో మాటాడబోయాడు. వణుకుతున్న పెదవుల మీద మెదులుతున్న మాటలు అస్పష్టంగా కదిలినై 'అక్క మళ్లీరాదు' అని. నాన్నకు గాబరా ఎత్తింది. అక్కను 'వైరిచ్చాడు.

'వస్తుంది నాయనా, వస్తుంది' అమ్మ సమాధాన పెట్టాలని ప్రయత్నించింది.

ఆశగా అమ్మవంక చూచాడు. అమ్మ కళ్లనిండా నీళ్లు. ఏడవ్వద్దని చెబుదామనుకున్నాడు. కాని అంతమాట పెగిలిరాలేదు వాడి కంఠంనుండి. కళ్లు మూతలు పడుతున్నై. నిట్టూర్పులు తీవ్రంగా, వేడిగా వస్తున్నై. ఆ తీవ్రతలో వేడిలో ఒకే నిరాశ,నిస్పృహా వ్యక్తమౌతున్నై; 'అక్క ఇల్లు ఇదికాదుగా. మళ్ళీ ఎందుకొస్తుందీ? అని.

రాధాయి మెత్తని మనస్సులో అక్క విడిచిపోయిందన్న బెంగా, మళ్ళీ రాదన్న దిగులూ, కొన్ని అర్థంకాని సమస్యల మధ్య బరువెక్కినై మనస్సు ఉత్సాహంతో నిండిఉన్నదైతే అర్థంకాని ఎన్ని సమస్యలనైనా అవి ఎంత విడదీయరానివైనా సులభంగా జీర్ణించుకుంటుంది. ఎంత ఊహాలకందని రాగాలనైనా సవ్యంగా సారించుకుంటుంది. కాని నిరుత్సాహంతో నిరాశతో నిండిన మనస్సులో సమస్య ఏ కొద్దిదైనా అది సుడితిరుగుతుంది. ఈ అందని రాగాలను సారిస్తున్న మనస్సు సహజంగా పరాజయం పొంది నిరాశను పెంచి అపశృతులను సృష్టిస్తుంది. ఆ అపశ్రుతులు సున్నితంగా పలకవలసిన తంత్రికలను తెంచివేసినా ఆశ్చర్యపడనక్కర్లేదు.

ప్రస్తుతం రాధాయి స్థితి ఇంచుమించు ఆస్థాయిలోనేఉంది. 'అక్కకు చందమామ, కథలు చెప్పతాడు కామాలు' అనే భావాన్ని సులభంగా జీర్ణించుకోగలిగిన వాడి హృదయం, 'తన ఇల్లు అక్క ఇల్లు కాకపోవడానికి గల అవ్యక్తమైన కారణాన్వేషణలో అక్క మళ్ళీ రాదనే బెంగనూ, అక్కను విడిచి ఉండాలనే దిగులునూ బలపరిచింది. ఆ కారణంగా సున్నితమైన రాధాయి మనోవీణలో ఎన్నో అందని రాగాలను సారించవలసివచ్చింది. ఇక దాని ఫలితాన్ని మానసిక తత్వవేత్తలు కూడా తప్పించలేక పోవచ్చు.

డాక్టరొచ్చి మళ్ళీ చూచి వెళ్లాడు ఆయన ముఖంలో ఉన్న ఉదాసీన భావాన్ని 'అక్కను పిలిపించం'డని చెప్పిన మాటనూ చూచి నాన్న గాబరాపడ్డాడు. 'చూడు నాన్నా! ఒక్కసారి చూడు. ఇదిగో అక్క వస్తూంది చూడు' అని నాన్న బొంగురు గొంతుకతో అన్నాడు.

(43-వ పేజీ చూడండి)

అత్తల పార్లమెంటు

[స్థలం : పార్లమెంటు భవనమనే వెంకాయమ్మగారి పెంకుటిభవంతి.]

[సమయం : సాయంత్రం నాల్గుగంటల వేళ.]

(వెంకాయమ్మగారు యింటిలోనుంచి వస్తుంది.)

సుబ్బాయమ్మ : ఏమండీ! వెంకాయమ్మగారూ! పనులైనాయా!

వెం : ఆ! ఏం పనుల్లెండి. అవుతయ్. తొందరేం! రోజూ వుండేవేగా! రండి లోపలకు.

సు : వెళతానండి! పనులేమి కాలేదు. అయినా నీకేంలే అమ్మ. మహారాజువి. నీకోడలు కూర్చోపెట్టి అన్నిపనులు చేసుకుపోతుంది. మాకా భాగ్యంలేదుగా! (లోపలికొచ్చి చాపమీద కూర్చుంటుంది)

వెం : (నిట్టూర్పుతో) ఆ! నాసుఖం అడగక్కర్లే. అదిగాక నీకు మాత్రం సుఖంలేకేమమ్మ! కూర్చున్నచోటినుంచి లేవాల్సిన పనిలేదు. హాయిగా కృష్ణా! రామా! అంటూ కాలం వెళ్ళబుచ్చవచ్చు.

సు : ఏం సుఖంలెండి! మాకోడలు చూశారూ! పనిచేస్తుందేగాని వివరం తవరం ఉండదు. ముందు పనివెనక! వెనకపనిముందు చచ్చిపోతున్నా దానితో! చెపితే వినదు.

వెం : ఈకాలపు వాళ్లు మనమాటలు వింటారుటండీ! మనమేదో వాళ్ళని చెడగొట్టడానికి చెపుతున్నామనుకొంటారుగాని వాళ్లు బాగుంటేనే గదండి మన బాగూను! మనమెన్నిచెప్పినా వాళ్ళ మంచికోసమే.

సు : ఆ సంగతివాళ్ళకు తెలిస్తే ఎందుకలా ప్రేలుతారు! మాకోడలుంది చూశారూ ప్రొద్దస్తమానం నాతో వాదన వేసుకుంటుంది. "అది గాదు యిది" అంటె చాలు ఎక్కడలేని కోపం వచ్చేస్తుంది.

(యింతలో ప్రక్కయింటిపార్వతమ్మ: మేలిముసుగు సరిచేసికొంటూ) యిదిగో! ఎవరా మాట్లాడేది. సుబ్బాయమ్మగారా! ఏమిటి విశేషం మాబజారుకొచ్చారు?

సు : ఆ! ఏదో అలా ఉబుసుపోక వెంకాయమ్మగారింటికి పోదామనుకొని వచ్చేశా! రావమ్మ పోదువుగాని.

పా : వస్తా. పనిగాలేదు. ఎక్కడ పని అక్కడే వుంది.

సు : అదేమిటమ్మా! కోడళ్లెక్కడికెళ్లారు. నీవు పనిచేయడానికి?

పా : పెద్దరాణిగారు పుట్టింటికి వెళ్లారు. మొన్ననే రెండవ జమీందారిణికి జ్వరం వస్తూంటే నిన్న వాళ్ళన్నయ్యవచ్చి తీసుకెళ్లాడు. మూడవదాన్ని వాళ్ళ తమ్ముడు వారసాలయితే తీసుకెళ్లారు. యిక నాల్గవదానికి అసలుపనే చేతగాదు. పైగాదానికెంతసేపటికి తన షోకులేమిటో తనేమిటో తప్ప యింటి విషయం పట్టించుకోదు. ఎటొచ్చీ నా చావుకొచ్చింది. మాయదారి కాపురం (చీమిడి తీసేస్తుంది)

వెం : అలా కూర్చుంటే నీకొడుకేమీ అనడుటమ్మా! అంత విడ్డూరంగా మాట్లాడుతావు.

పా : సరిపోయింది. వాడు అంటే దానికింతకళ్ళు నెత్తికొస్తవి! పైగా నేనేదయినా అనబోతే దాన్ని వెనకవేసుకవస్తాడు. వాడి అలుసు కనుక్కొనే దానికింతపొగరెక్కింది, (కళ్ళనీళ్లు తుడుచుకుంటుంది)

శ్రీ మాచిరాజు సుబ్బారావు

వెం : అవునుసుమా! అందుకే అన్నారు మనబంగారం మంచిదైతే కంసాలివాడేమి చేస్తాడని.

సు : ఆ! ఏమిటోలెండి! అడ్డాలనాడు బిడ్డలుకాని గడ్డాలనాడు బిడ్డలా! (కొంచెం ఆగి) యిదిగో ఎవరాపోయేదీ. మీనాక్షమ్మ గారా! రండి రండి.

మీ : వస్తా. పార్వతమ్మ వదినెగారింటి దాకా వెళ్లిరావాలి.

సు : పార్వతమ్మ గారు యిక్కడే వున్నారు రండి.

మీ : ఔను చెప్మా! నా తెలివిమండా! అందరూ యిక్కడ చేరారు ఏం జేస్తున్నారు? (లోపలికి వస్తుంది)

సు : ఆ ఏదో యింటో బెడద కాసే పయినా వదిలించుకుందామని యిలా వచ్చాను.

మీ : అదిసరేగాని సుబ్బాయమ్మగారూ! నిన్నసాయంత్రం ఏమిటి మీ యింట్లో గొడవ.

సు : ఆ ఏముంది! అత్తా కోడళ్లగొడవే! అయినా మీరు చెప్పండమ్మా! నావల్ల తప్పుంటే నన్ను చెప్పుతో కొట్టినా పడుంటా.

పా : అసలు సంగతేమిటండోయ్. మాకు తెలియనే తెలియదే!

వెం : అవునవును నాకసలే తెలియదు. ఏం జరిగిందండీ!

సు : ఏముందీ! మా కోడలు ఏదో పుస్తకం చదువుతూ కూర్చుంది, లునాగు గంట లయింది. నే నన్నానుగదా "ఒసేరి గంటల దాకా పుస్తకాలముందు కూర్చుంటే ఒక్కదాన్ని యింటెడు చాకిరీ ఎలా చేసేదే. లాంతరులైనా కొంచెం తుడవకూడదా" అన్నా. దానికొచ్చింది గొడవంతా!

మీ : దీంట్లో తప్పేముందండీ! అయినా ఆడదానికంత చదువెందుక యింటిపని, మొగుడు పని చేసికుంటె అదేచాలు.

పా : ఏమోనమ్మ మా కాలంలో యిలాంటి విడ్డూరా లెరగం. అయినా అప్పుడు యిటువంటివాటికి తీరి కెక్కడుండేది.

వెం : కాలం మారినకొలదీ బుద్ధులు మారుతాయంటా రిందువల్లనే. వస్తానుండండి బియ్యం తెస్తా చేసుకోనైనా చేసికొందాం.

సు : అదేమిటమ్మా! వయసుది కోడలెక్కడికి పోయిందీ నీవు చేయడానికి!

వెం : ఆ! అది బియ్యంచేస్తే తగలడ్డట్లే వుంటయ్. సగంవడ్లు సగంరాళ్లూ నులి అలాగే వుంటాయి. అదేమిటే అంటే నా చేతకాదు అని పదిరోజు లసలే మానుకుంటుంది. గట్టిగా ఏమైనా అంటె ఏడుస్తూ కూర్చుని తిండి మానుకుంటుంది. ప్రతిరోజు గంటన్నర నాగదీస్తేగాని భోజనానికి లేవదు. అడుగుతా! నా అవస్త!

పా : ఏమిటోనమ్మా! ఈ కాలంలో అందరూ ఒకేమాదిరి. ప్రతియింట్లో యివే గొడవలు. మొన్న కామాయమ్మగారి పెద్దకోడలుండే అనసూయ పెత్తనాలకి వెళ్ళి సాయంత్రం దీపాలవేళ దాకా రాలేదట. ఎక్కడికెళ్లావే అని అత్తగారడిగితే "నీకెందుకా విషయం? నా యిష్టం వచ్చిన చోటికెళతాను!" అన్నదట. ఆ యిల్లాలు గోడుగోడున ఏడ్చింది.

సు: అదేమిటి చెప్మా! అదేం పోయే కాలం అంత భయంలేకండా అనేసిందా! కొడుకు కూరుకున్నాడా!

పా: ఊరుకున్నాడూ! ఆమాట వినే సరికి పెళ్ళాన్ని ముక్క చీవాట్లుపెట్టాడట.

వెం: అలా వుండాలి మావాడిలాగా పెళ్ళాన్ని వెనకవేసుక రాగూడదు.

మీ: ఏమోనమ్మా! మా కాలంలో మే మెరుగం. అత్తగారంటె గడగడలాడే వాళ్ళం. మావారు గూడ ఆమెగారి పక్షమే. నన్ను నోరెత్తనిచ్చేవారు గారు. వారు మహరాజులాగా వెళ్ళిపోయారు. నా కొచ్చినవి ఈ కష్టాలన్నీ చస్తున్నా (వస్త్ర కిరీటం సరిచేసికుంటూ).

పా: కాలం మారిపోయిందండీ వదినె గారూ! యిప్పుడు అత్తల రాజ్యంగాదు, కోడళ్ల రాజ్యం. (నవ్వుతుంది)

మీ: నీకు నవ్వుగానే వుంటుంది వదినా! నీ కోడలేమి అనదు గాబట్టి సంతోషంగా వుంటావు. మా కెలా వస్తుందా సంతోషం.

పా: ఆహా! నా కోడలంటిదా న్నయితే మీరు ఒక్కనాడే బయటికి నెట్టే వాళ్లే. నేను గాబట్టి యింతకాలం నెట్టుక వస్తున్నాగాని.

వెం: ఎవరేమన్నా మా యింట్లో అంత ఛండాలం ఎవరిండ్లలో వుండదు. ఒక మడి లేదు. మన్నులేదు. అడ్డమైన గుడ్డలతో నానా గడ్డీ తినేయడమే. చచ్చిపోతున్నా దాంతో వేగలేక.

మీ: మడంటే గుర్తొచ్చింది. నా మడి, శుభ్రం సంగతి మీకు తెలుసుగదా! నిప్పునైనా మూడుసార్లు కడిగి పైగా పాలతో శుద్ధిచేసి, మైల అంటకుండ ఉండడానికి పైన నేతితో అభికరించి మరీ పొయ్యి రాజేస్తాను. అట్లాంటిది మొన్నమటుకు మొన్న నేను స్నానంచేసి వస్తూంటె మైలుదూరం నుంచి బరువుబిందె తెచ్చింది గదా అని కాస్త ప్రక్కకి తొలగ గూడదూ! అది లేకపోగా పైగా నన్ను రాచుకపోయింది మా పెద్దకోడలు. నా కడుపులో మండిపోయి బిందెడునీళ్లు ఆ వరసన దాని నెత్తినపోసి మరీ ఊరకున్నాను.

వెం: మంచిపని చేశారు. నే నయితే బిందె గూడ నెత్తిన పగలగొట్టేదాన్ని.

పా: మీనాక్షమ్మగారు కాబట్టి అంత సాహసం చేసింది. మనమలా చేస్తేనా! ఆ రోజే యింట్లోనుంచి శలవు పుచ్చుకొన వలసి వస్తుంది.

మీ: అదేమిటండీ! మీ అబ్బాయిగారు చాల మంచివారు ఆయన మిమ్ముల నేమి అనరు. మాకు తెలియదా.

పా: మా అబ్బాయి మంచి అడగక్కర్లేదు. యిన్నాళ్లూ మంచివాడే. పెండ్లాం వచ్చింది నా కెదురు తిరుగుతున్నాడు.

వెం: నిజంగానమ్మా! ఈ రోజుల్లో మడీ మర్యాదలేదుగాని మా కాలంలో చచ్చినట్లు తడిగుడ్డలు కట్టుకోవాల్సిందే! మంచినీళ్లు తేవాల్సిందే! యిప్పుడు విడిచిన గుడ్డలతోటే మంచినీళ్లు తెచ్చి వంట చేయడం. మనం మైల కూడు ఎలా తింటాం చెప్పు చూస్తూ. శాస్త్రం గూడా వప్పుకోదు. పురాణంలో గూడ మొన్న చెప్పారు.

పా: మీకేం! పురాణాలకు, సంకీర్తనలకు పోతారు. అన్ని తెలుసుకుంటారు. నాకు తీరదుగదా! యింట్లోంచి అడుగు తీసి వాకిట్లో పెట్టడానికి కుదరదుగదా? రాత్రి పదిగంటల దాకా చచ్చినట్లు చాకిరీ చెయ్యాల్సిందే...

వెం: నేను మాత్రం ఎప్పుడు పోతున్నాను. మొన్న మా కోడలితో పోట్లాడి సాయంత్రం వంట చేయకుండా పురాణానికి వెళ్ళాను. లేకపోతే నేనయినా పోను.

సు: ఇంతకీ ఆ రోజు వంట ఎవరు చేసినట్లు.

వెం: ఎవరు చేస్తారు? చచ్చినట్లు రాత్రి ఎనిమిదింటికి వచ్చి వాళ్ళకోసరం కాక పోయినా, నా కడుపులో కాల్తుంటే చచ్చినట్లు నేనే చేసుకున్నా. కోడల్లొచ్చి గూడ నాకీ అవస్థ తప్పలేదు. (కన్నీరు తుడుచుకుంటుంది).

మీ: అదేమిటమ్మా! మీ కోడలు చేయలా!

వెం: సరి సరి. అది వంటచేస్తే నేను చెయ్యాల్సిన పనెందుకొస్తుందీ! నేనొచ్చే సరికి ముసుగుపెట్టుక పడుకుంది. అదేమిటే అంటె "నాకు జ్వరం వచ్చింది. తల నొప్పిగా వుంది" అంటూ బిగుసుకుపడుకుంది. తరువాత చచ్చినట్లు నేనేవంట చేసి భోజనానికి పిలచినారా లేదు.

మీ: మీ కొడుకులేడూ! ఆయనేమి అనలా!

వెం: వాడు ఊరిలోలేడు. లేకపోతే దానిపని తేల్చేదాన్ని. భోజనానికి రానంటె నాదేంపోయిందని నేను గూడ వంటయింటికి తాళంపెట్టి మరీ వచ్చి పడుకున్నా. దానికే మర్నాటికి లేవలేని పరిస్థితికొచ్చింది.

పా: రాదూమరి ఉత్తిపుణ్యానికి కూడు లేకుండ పడుకుంటె.

సు: నిజంగా కామాయమ్మగారు చాల అదృష్టవంతులు సుమండీ! ఆమె కే చీకుచింతలేదు. ప్రొద్దస్తమానం రామా

అత్తలపార్లమెంటు

యణం, భాగవతం మొదలైన పురాణాలు చదువుకుంటూ, వేళకు వెళ్లి భోజనం చేస్తుంది.

మీ : ఆవిడ మంచితనం నామంచితనం మండినట్లే వుంది. కోడలు మాటకు ఎదురు చెప్పమను ఆవిడ మంచి కనబడుతుంది. ప్రతిదానికి చచ్చినట్లు పడివుంటే అందరి మంచి అలాగేవుంటుంది.

పా : నిజంగా ఆవిడేమంచిది. ఎందు కంటె ! ఒకరిని ఒకటి అనదు. తనొకటి పడదు. మనం అనకుండ ఉండవేం గదా గదా చచ్చి !

మీ : కోడళ్లకి పెత్తనమిచ్చి చచ్చినట్లు కూర్చోవడం గూడ ఒక గొప్పతనమే.

వెం : "కోడలికి పెత్తనమిస్తే కొరివితో తలగోక్కున్నట్లే" నంటూండే వారు మావారు.

పా : యీకాలంలో అంతకంటె చేసే దేమిలేనట్లు కనపడుతుంది.

మీ : చేసేదేమిలేదని ఊరుకుంటె అయి నట్లె ! కోడళ్ళమాటలు సాగనీయకండా ఉండటానికి ఏదో ఒక ఉపాయం చెయ్యాలి. అందుకే సగం నేనిక్కడకు వచ్చింది.

వెం : మనమేనా ఉపాయాలాలోచిం చేది! ఏడిసినట్లే వుంది! ఏదో దౌర్జన్యంతో కాలం గడుపుకొనటమే మనం చేయాల్సిన పని.

మీ : మీకు తోచకపోతే నే పుతా వినండి. మన మందరం ఒక సంఘంగా ఉందాం. ఎవరింటో ఏవిధమైన చిక్కు వచ్చినా, ఎవరింట్లో కోడళ్లు అత్తలమీద పోట్లాడినా, అందరం కలసి నిరశనవ్రతం, సత్యాగ్రహం యిత్యాదివి చేసి మన హక్కులు నిలబెట్టుకుందాం.

వెం : చిక్కులంటే !

మీ : చిక్కులంటే యింట్లో కోడళ్ళ చేత ఏవిధమైన తిరస్కారము, చీవాట్లు, మొదలైనవి కలిగితే మన మందరం కలసి పైకార్యక్రమం అమలుపరుద్దాం.

పా : శేష్ ! బాగుందీ అలోచన. ఇవాళ చాలా మంచిరోజు. ఈ దినమే మనం సంఘంగా ఏర్పడుదాం. ఇక కోడళ్ల పెత్తనం సాగనివ్వరాదు.

వెం : ఏర్పడ్డట్లే! మరి మన సంఘంలో క్రొత్తవారిని చేర్చుకొనడానికి అన్ని ప్రయత్నాలు చెయ్యాలి.

మీ : సరే! కార్యక్రమం తరువాత ఆలోచించుదాం. ప్రొద్దుగూక వచ్చింది

వెం : అన్నట్లు మాటల సందడిన ప్రొద్దే మరచాం. వంట వేళయింది.

పా : అయితే! వెళదాంగాని మన సంఘానికి పేరేమి పెట్టుదాం!

మీ : అదే ఆలోచించుదాం.

(వెంకాయమ్మగారి మనుమడు స్కూలు నుంచి వస్తాడు)

మనమడు : ఓ! అత్తల పార్లమెంటు జరుగుతున్నదే! ఎంతసేపటినుంచి? ఏం బిల్లులు ప్యాసుచేశారు ?

మీ : అబ్బా యీ కాలపు వాళ్ళం దరూ యింతే. వాడుచూడు కుర్రవెధవ.

వెం : మీరూరుకోండి వదినెగారూ! వాడొక్క పోకిరీవెధవ.

మీ : నేను మాత్రం ఏమన్నాను. ఏదో వేళాకోళాని కన్నానుగాని (పార్వతమ్మ గారి వైపుతిరిగి) ఏమిటి పిన్నిగారేదో తీవ్రంగా ఆలోచిస్తున్నారు.

పా : మనసంఘానికి పేరేమి పెడదా

(43-వ పేజీ చూడండి)

అమెరికాలో సూర్యవంశ క్షత్రియులు

సర్. వి. జోన్సుగారు "ఏషియాటిక్కు - రిసర్చెస్" (ఆసియాఖండ విషయ పరిశోధనలు) అనే గ్రంథంలో యిలా వ్రాశారు :- దక్షిణ అమెరికాలోని పెరూ దేశమందు "ఇంకా" లు అనే జాతి వారు ఉన్నారు. తాముసూర్య వంశమునకు చెందినవారమని వారు చెప్పకొనుచున్నారు. వారొక పెద్దపండుగను చేసికొనుచుందురు. "రామ సీత్వా" పండుగ అని దాని పేరు-దసరా పండుగ సందర్భములో ఉత్తర హిందూస్థానమందు జరుపబడేటటువంటి "రామచంద్రజీ - కా - మేలా" అను ఉత్సవమువలెనే "పెరూ" దేశంలోని ఇంకాలు జాతివారు "రామసీత్వా" ఉత్సవం చేసుకొంటారు. "రామ సీత్వా" ఉత్సవం అంటె "సీతారాముల ఉత్సవం" అని అర్థం-రాముడు సూర్యవంశజుడనియు, సీతాపతి అనియు, కౌసల్యారాణి కుమారుడనియు వీరు శ్రీరాముని వర్ణించుచున్నారు. దీనిని బట్టి తెలియుచున్న విషయ మేమనగా, ఆసియా ఖండములోని అనేక దూర ప్రాంతాలకు కొందరు భారత దేశంనుంచి బయలుదేరి వెళ్లి రామ కథను తత్సంబంధమైన ఉత్సవాదులనుగూర్చి ప్రచారం చేసి అచట ఆ ఉత్సవాదులను పూజలను అలవాటు చేశారు - ఈవిధంగా ఆసియా ఖండంలోని దూర ప్రాంతాలకు వెళ్లి ప్రచారం చేసిన భారతీయులే దక్షిణ అమెరికాకు కూడా వెళ్లి అచటస్థిరనివాసులై రని ఊహింపవచ్చును హిందువులు అమెరికాకు వలసపోవుట, శ్రీ రామచంద్రుని అనంతరమే అని నిశ్చయింప వచ్చును-

అతకని బతుకులు

— పెద్దకథ —

"నడింపల్లి"

7

నాకు పిచ్చెత్తినట్లైపోయింది; "తాయీ" అని గట్టిగా అరిచాను. పర్వత శ్రేణులన్నీ నా హృదయంలోని వేదనకు కరిగి, నాతోపాటు "తాయీ" అని అరిచి విలపించినై. ఎంత కళ్లు చించుకున్నా తాయి మాత్రం కనబళ్లేదు. వెల్లిగా కొండదిగి వచ్చేశాను. మొదటిసారి, కాలిబాట మలుపులో తాయిని కలుసుకున్నచోట ఆ రాయి నన్ను చూసి చలించి ఏడ్చింది. దాని మీద తలమోపి, నాలో నేను కుమిలి, కసిగా తిరిగి కొండకొనకేసి చూశాను. ఎండకి మెరిసిపోతూ, కొండకొన నన్ను చూసి విరగబడి నవ్వింది. చితికిలపడి, కళ్లు

"మీ బావకి వేదాంతం ముదుర్తోంది జాగ్రత్త" అన్నాడు మామయ్య.



చూసుకున్నాను. హృదయం నిశ్శబ్దంగా దహించివేస్తున్నది విలపించటం మొదలు పెట్టాను. తిరిగి ఆశ్రమంలోకి వెళ్లి స్వామికి ముఖం చూపించటం నాకు మనస్కరించ లేదు. ఒక నిండు ప్రాణం నా చేతుల్లో హత్య చెయ్యబడ్డందుకు తల కొట్టేసినట్లై పోయింది.



ఎక్కడి తాయి? ఎక్కడనేను? నేనీ విధంగా స్థలానికి యీ ఏకాంత, వచ్చి నన్నెరగని తాయిని మురిపించి, మురిపించి దారుణంగా హత్యచేయుట మేమిటి? నిష్కల్మషంగా, లోకంలోని ఘోరాలకు ఎడంగా సుఖజీవనం గడుపుతున్న అమాయిక ప్రాణి నా కళ్లముందు నాశనమై పోవటం!

కసితీరా కళ్లనీళ్లు కార్చాను. చుట్టూ నల్లని కొండరాళ్లు నన్ను చూసి వెక్కిరించినై. నానిస్సహాయతకు కుంగిపోయినాను.

సూర్యుడు మళ్లీ కొండ చాటుకు చేరాడు. నల్లని నీడ నన్ను దాటి పోయి ఆశ్రమాన్ని కప్పేసింది; మళ్లీ సన్నని చలిగాలి ఆరంభమైంది. బరువుగా లేచి నిలబడి నా చుట్టూ చూసుకున్నాను. దొంగలాగా పారిపొయ్యే కంటె. తిరిగి ఆశ్రమానికి వెళ్లి స్వామి పాదాలమీద పడి క్షమాపణ వేడుకోవటమే మేలనిపించింది, పాపానికి నిష్కృతి పశ్చాత్తాపంకంటె ఉత్తమమైంది లేదనుకుని, అడుగుల్లో అడుగు లేసుకుంటూ ఆశ్రమానికి బైలుదేరాను.

నేను వెళ్లేసరికి 'రమణి' వచ్చి కూర్చుని స్వామితో మాట్లాడుతున్నాడు; స్వామి మందస్మితంగా పైకి చూస్తూ రమణిమాటలు వింటున్నారు. నేను పరుగెత్తుకుని వెళ్లి స్వామిపాదాలు గట్టిగా పట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చాను. స్వామి మాట్లాడలేదు; కాసేపటికి నన్ను లేవదీసి, బుజ్జగిస్తున్నట్టు గడ్డంపట్టుకుని నీకళ్లల్లోకి చూస్తూ మందహాసం చేశారు. రమణి, "ఏమిట్రా—వెధవఏడుపూ, నీవూను" అన్నాడు, నన్ను సహించలేనట్టు. నేను ఏడవటానికి గూడ ఓపికలేక కిందికి చూస్తూ మెదలకుండా ఊరుకున్నాను

కాసేపటికి స్వామికదిలి "అమ్మా—తాయీ" అని కేకేశారు. నేను వెర్రిగా ఆయనవంకేచూస్తూ, "తాయి లేదుస్వామీ" అన్నాను. స్వామి బొమ్మలాగానిలబడి పోయినారు. నేను మెల్లిగా జరిగిందంతా చెప్పాను.

స్వామి అట్లాగే నిలబడి, "దైవనిర్ణయం నాయనా" అన్నారు; రెండు వేడికన్నీ ందువులురాలినై. నేను పిచ్చిగా ణి వంక చూశాను; వాడి కళ్లు చింతనిప్పుల్లా మండిపోతున్నై. కళ్లుతిప్పుకుని, దగ్గరో ఉన్న చెట్టుమొదలుకేసి చూస్తున్నాడు.

"దైవనిర్ణయం" అన్నారు స్వామి కూలబడి; కళ్లు గట్టిగా మూసుకుని తలవంచుకున్నారు. నేను ఆయనకేసి వెర్రిగా చూస్తూ ఉండిపోయినాను.

చీకట్లు మళ్ళీ కమ్ముకున్నై; ఆశ్రమమంతా భయంకరంగా అట్టహాసం చేసింది. ఎవళ్ళమూ కదల్లేదు వెన్నెలమాత్రం ఆకులసందుల్లోంచి నేలమీద పడి మారాం చేస్తున్నది. మెల్లిగా తలయెత్తి శిఖరంవంక చూశాను; వెర్రిగా ఇకిలించింది; చుట్టూ ఉన్న పర్వతశ్రేణులు నిశ్శబ్దంగా గర్జించినై.

రమణి నన్ను తీసుకుపోవటానికి వచ్చినట్టు తర్వాత తెలిసింది. స్వామి మౌనంగా వీడ్కోలిచ్చి పంపించారు. అప్పుడే ఉదయిస్తున్న సూర్యుడు నన్నుచూసి మండిపడ్డాడు.

రైలెక్కిన తర్వాత, "నీవు వొట్టి ఫూల్ విరా" అన్నాడు రమణి; నేను మాట్లాడలేదు.

"నీవుగూడా అక్కడ్నుంచి దూకేయక పోయినావ్, పీడావదిలేది?" అన్నాడు, నా మౌనాన్ని గర్హిస్తూ. నేను కిటికీలోంచి బైటికి చూస్తున్నాను, పారిపోయే గరుకు నేలవంక. మాట్లాడలేదు.

రమణి నన్ను తనవేపు తిప్పుకుంటూ, "నిన్నేరా—మాట్లాడవేం?" అన్నాడు.

తను చేసింది తప్పని తనకి తెలిసి బాధపడినా, ఇతరులదేమాటగనక అంటే సహించలేనిది మానవనైజం.

"నేనేం, కావాలని కిందికి నెట్టానా?" అన్నాను.

"ఏమో—" అన్నాడు రమణి, పెట్టెలో అవతలివేపు కూర్చున్న ఆడమ్మాయివంకే చూస్తూ.

మళ్ళీ నా వేపు తిరిగి, "నేను నీకు చెప్పిందేమిటి?" అన్నాడు, కోప్పడుతూ. నేను మాట్లాడలేదు: ఎదురుగా కూర్చున్న ముసలావిడ మనమడితో ఆడుకుంటుంటే చూస్తున్నాను.

"వేదాంతమంతా ఒలకబోస్తివే, నాముందు!" అన్నాడు రమణి, మళ్ళీ.

నేను, మెల్లిగా "వేదాంతమని నే నన్లేదు; 'తాయి' హత్యకి నామీద నేరం ఆపాదించటం అన్యాయం" అన్నాను.

"తాయిని చంపినందుకు కాదు—నీవు తాయితో ఎట్లా ప్రవర్తించాలో తెలుసుకోనందుకు" అన్నాడు రమణి, కిటికీలోంచి బైటికి చూస్తూ.

"తాయిని నేను 'లవ్' చెయ్యలేదు" అన్నాను.

"ఆమాట అబద్ధం—లేకపోతే నీ వింత దూరం రాశేరావు" అన్నాడు, నావేపు పరీక్షగా చూస్తూ.

★ అతకని బతుకులు ★

"నేను తాయికోసం రాలేదు" అన్నాను.

"అయితే ఆ స్వామిపీచుగడ్డాన్ని పట్టుకుని వేళ్ళాడలేక పోయినావ్?" అన్నాడు కోపంగా. రైలు దౌడనపడి వేగంగా పరుగెత్తుతున్నది; నేను మాట్లాడలేదు.

కాలం ఒకగోడలాంటిది: యీ క్షణానికీ... నేటికీ, రేపటికీ మధ్య అడ్డై నిలిచి భ్రమపెడుతుంది. ఈనాడు కరాళదంష్ట్రలొంచి నాలుకలు చాచి అట్టహాసం చేసే భయంకరప్రవృత్తులు రేపటికి చల్లబడి మందహాసంతో స్వాగతం ఇవ్వక పోతయ్యా అనిపిస్తుంది. ఈక్షణం మనవి గాని సుఖాలు మరుక్షణం తమకుతామే పరుగెత్తుకొచ్చి, ఒడిలో రాలకపోతయ్యా అనిపిస్తుంది.

కాసేపుండి, "నీవు రాకపోతే నా దోవన నేను పొయ్యేవాణ్ని" అన్నాను, రమణి వేపు ముక్కోపంతో చూస్తూ.

రమణి నావేపు రెండుక్షణాలు తీవ్రంగా చూసి, "ఇప్పుడు మాత్రమేం?" అని ముఖం తిప్పుకున్నాడు. రైలు ఏదో స్టేషన్లో ఆగబోతున్నది.

రైలు మళ్ళీ బైలుదేరింతర్వాత, "ఒరే, నీకు సిగ్గూ, శరమ్ లేదట్రా?" అన్నాడు, నావేపు తిరిగి: నేను మాట్లాడకుండా వాడివేపు చూశాను.

"జీవితంలో అడుగుపెట్టింతర్వాత, మనం తీర్చవలసిన ఋణాలు తీర్చకుండా పారిపోదామనుకోటం క్షమించటానికి గూడా వీల్లేని మహాపచారం" అన్నాడు.

నాకు వెంటనే అర్థమైంది. "ఆ ఋణాలు నే చేసినవి కావు, కనీసం నా కోసం చెయ్యబడినవన్నా కాదు" అన్నాను.

"కావొచ్చు—అయినా ఆ విధిని నీవు దాటిపోలేవు; దాటిపోవాలనుకోవటం పిరికితనం; దాటిపోవటం వెర్రితనం గూడా" అన్నాడు రమణి.

"నావల్లగాదు" అని గొణిగాను.

రమణి ముఖం తిప్పుకుని కూర్చున్నాడు; రైలు మెల్లిగా సాగిపోతున్నది.

"నావల్ల గాదు—ఇతరులుచేసిన తెలివి తక్కువ పనులకి నేననుభవించవలసిరావటం దురన్యాయం" అన్నాను, ఆఖరుసారిగా; రమణి నావేపు వెర్రిచూపుచూశాడు.

8

ఇంకా కాలేజీకి పెట్టిన సెలవు అట్లాగే ఉంది. అందుకని రమణిని పంపించేసి, నేను ఇంటికి వెళ్ళిపోయినాను.

చేసిన నేరానికి శిక్షపడటంకంటె, ఎవరిదృష్టిలోనూ పడకుండా దాటిపోవటంలోనే చాలా బాధఉంది. నేను ధైర్యంగా తిరగలేకపోయినాను. స్వామి ఆశ్రమ ప్రాంతంలోని మృత్యువు నిశ్శబ్దంగా నన్ను వెంటాడి వేధిస్తున్నది; ఆ శిఖరం నన్నుచూసి వెర్రిగా నవ్వుతున్నది.

"మళ్లీ ఎక్కడికీ పారిపోకు" అన్నాడు రమణి, రైలు కదలబోతుండగా. వెళ్లిపోతున్న రైలువంక మౌనంగా నిలబడి చూసి, నేను ఊళ్లోకి బైలుదేరాను. అప్పుడే సూర్యోదయమౌతున్నది.

స్టేషనుకు దగ్గర్లో ఉన్న కాఫీహోటలులోకి వెళ్లికూర్చున్నాను. వచ్చి, వెళ్లిపోతున్న ఒక్కొక్క ముఖాన్నే పరిశీలించటం మొదలుపెట్టాను. నిజంగా, అమాయికత్వంలోనే ఆనందం ఉన్నదేమో ననిపించింది; అజ్ఞానంలోనే సౌఖ్యంఉన్నదేమోనని మనస్సు గొణిగింది.

కాఫీ తాగి, మెల్లిగా, చలిగాలికి ఒణుకుతూ గోడ్డువెంటే బైలుదేరాను.

* * *

"ఎల్లుండి విశాఖపట్నం వెళ్తున్నా మామయ్యా" అన్నాను.

మామయ్య చుట్టపొగ వదలి, "మంచిది నాయనా, ఉత్తరాలుమాత్రం తరుచుగా వ్రాస్తూండు" అని, తను చెప్పదల్చుకున్నది ఇంకా ఉన్నదన్నట్టు ఆగిపోయినాడు. నేను పైన మెరుస్తున్న నక్షత్రాల వంక చూస్తున్నాను.

చల్లని పైరుగాలి కొడుతున్నది.

శకుంతల అప్పుడే లోపల్నుంచి వచ్చి, మామయ్య మంచంమీద కూర్చున్నది. "మీ బావ ఎల్లుండి విశాఖపట్నం వెళ్తున్నాడ్టే" అన్నాడు మామయ్య.

"వెళ్లనీ—నాకేం?" అంది శకుంతల, సన్నగా; నా హృదయంలో ఏవో అపశృతులు పలికినై.

"ఊఁ—" అన్నాడు మామయ్య, సాగదీస్తూ; శకుంతల లేచి లోపలికి వెళ్లింది.

"కాని మామయ్యా, నాకిదంతా ఓ నాటకంలా ఉంది" అన్నాను, సంశయిస్తూ.

"ఏమిట్రా?" అన్నాడు మామయ్య, చుట్టపీకె అవతల పారేసి.

"ఈ చదువులూ, యీప్రపంచం-ఒక్కోమాటు అరణ్యాల్లోకి పారిపోయి తపస్సు చేసుకుందా మనిపిస్తుంది" అన్నాను; అవి నాలో భక్తి ప్రకోపించిన రోజులు.

అత్తయ్య అప్పుడే వచ్చింది, చెంబునిండా మంచినీళ్ళు తీసుకుని. "ఏమేవ్, నీ అల్లుడికి తపస్సు చేసుకుందామని ఉందిట" అన్నాడు మామయ్య. అత్తయ్య నవ్వింది.

"ఏమో - నా మనస్సు నాకే తెలీటం లేదు; ఒక్కోఘాటు అట్లా అనిపిస్తుంటుంది" అన్నాను, సిగ్గుపడ్తూ.

అత్తయ్య కొద్దిగా మందహాసం చేసి ఊరుకుంది.

"అందుకనేరా-మనస్సు పారిపోకుండా ఉండటానికే, ఆ మూడుముళ్లూ పడితే..." అన్నాడు మామయ్య, నవ్వి.

నా మనస్సు పున్నమనాటి సముద్రంలా ఉప్పొంగింది.

శకుంతల అప్పుడే వచ్చినట్టుంది.

"ఇదుగో నేవ్ - మీ బావకి వేదాంతం ముదుర్తోంది, జాగ్రత్త" అన్నాడు మామయ్య.

"నీ మూలానే" అంది శకుంతల, వాళ్లమ్మ చాటున దాక్కుని.

"సరిసరి -" అన్నాడు మామయ్య, తన కూతురు నా పక్షమే వహించినందుకు. అత్తయ్య హృదయపూర్వకంగా నవ్వింది. నా హృదయం గంతులేసింది.

* * *

శకుంతల! ఒక్కమాటు నా హృదయంలో మెరుపు మెరిసినట్లైంది. తలెత్తి చూశాను. మంచుబిందువు లొక్కొక్కటే విడిపోతున్నై.

నిజంగానే శకుంతల పరాయిదైపోవటం నా యోగం బాగుండే నేమో ననిపించింది. లేకపోతే, నేనుగూడా యీపాటికి అందర్లాగానే విడరాని యీలోకపు చిక్కుల్లో పడి కొట్టుకుంటుండేవాణ్ని.

అజ్ఞానపు బాల్యప్రాయంలో అన్నీ ఆశారేఖలే కనిపిస్తుంటై. కాలం గడిచిన కొద్దీ ఒక్కొక్కటే మాయమై, యీ ఎండమావులకోసమేనా ఇంతకాలం గుండెలు చిక్కబట్టుకుని నిలిచింది, అని హతాశులైపోవటం జరుగుతుంది; చివరికి తుఫాను నాటి సముద్రంలా అంగలారుస్తున్న జీవిత సమస్యల్ని తీర్చుకోలేక పశ్చాత్తాపం మాత్రం మిగుల్చుకుంటాం.

జీవితంలో ఇంత గడ్డుతనం ఉన్నదని నే ననుకోలేదు. మూడు సంవత్సరాలు మూడు యుగాలుగా వాల్తేరుపట్లల్లో కాలం గడిపినప్పుడైనా, బయటిలోకంలో నాకోసం ఇంత కరుకువిధి వేచి ఉన్నదని అనుకోలేదు.


జేబులో చెయ్యిపెట్టి తడుముకున్నాను. సిగరెట్టు పీకలు పలికినై. ఒకటి వెలిగించి

ఈ ఉపఖండములో మలేరియా వలన ప్రతి సంవత్సరము 20 లక్షల మందికి పయిగా మృతి నొందుచున్నారు.

మలేరియా వల్ల కలిగే ప్రజా మారణసంఖ్య అటుండ యీ జాడ్యముచే నీరసించిన రోగులు యితర వ్యాధులకతి శీఘ్రముగా పాతులగుట గమనించిన పయి భయంకర సంఖ్య మరియు పెరుగు దల సూచించును. మలేరియా సోకుడు నిన్నెల్లప్పుడు బెదరించుచుండును. ఎందుకన నిన్నా రోగమంటుటకొక దోమ కాటు చాలును. యీ బెదరింపును నీవు నిర్లక్ష్యము చేసుకోకూడదు.

యీ దినమే నిన్ను మలేరియా బారినుండి 'పాల్యుడ్రిన్' కాపాడగలదు. ఒక అణా విలువయిన ఒక మాత్ర వారమునకొక తూరి సేవించుచున్న, రోగమును నీదరికి రానీయదు. నీవుని కుటుంబమును మలేరియానుండి కాపాడు కోగల శక్యతకు కాగల ఖర్చు ఒకరికి ఒక వారమునకు ఒక అణా మాత్రమే. మోతాదులు తెలుసు కొనుటకు క్రింది వివరముల చూడుడు.

మలేరియా రోగకారణమైన దోమ ఒక కాటుతో మలేరియా క్రిములను నీ రక్తములో ప్రవేశపెట్టును. యెప్పుడును యేటవాలుగా మూగు ఆ దోమను నీవు సులభముగా గుర్తింప గలవు. నీటి అభివృద్ధి కాధారమైన నీటి నిలువలు ఇండ్ల పరిసరాలలో వుంచ కుండిన మలేరియా బారి నుండి తప్పుకోగలరు. నిదురించు నపుడు దోమతెరను వాడుడు. దోమలను చంపుటకు 'గమెక్సెన్' క్రిమి కీటక సంహారిణిని మీ గృహములయందు చల్లియుంచుడు.



యీ అపాయకర చిహ్నముల గమనింపుడు:

మొదట చలిచే వణికించును, జ్వరము తగిలి చెమటలు పోయును. దేహమంతట నొప్పులు, తీపులు పుట్టును. యీ సూచనలను అశ్రద్ధ చేయక తక్షణమే వైద్య సలహా తీసుకొనుము. అప్పుడు నీకు మలేరియా సోకయున్న 'పాల్యుడ్రిన్' సేవించిన కొద్ది రోజులలో నయమగు నవియు, యికముందు రాకుండుటకు, అది ఎట్లు తోడ్పడ గలదో కూడ వైద్యుడు నీకు తెలియ పరచును. స్వచ్ఛమైన 'పాల్యుడ్రిన్' పుల్లిపొర కాగితములలో ఆరోగ్య విధానముగా సీలుచేయబడినవే దొరకును. మాత్ర ఒకటి ఒకణా మాత్రమే.

'పాల్యుడ్రిన్'

మలేరియాను తరిమివేయును



సేవించు విధానము

చికిత్సకొరకు: పరివయసుగంవారు, 12 యేండ్లకు మించినవారు ఒక మాత్ర వాడవలెను. 6 నుండి 12 సంవత్సరములలోగల పిల్లలకు అర్ధ మాత్ర. 6 సంవత్సరములు వయస్సు మించని పిల్లలకు పావుమాత్ర చొప్పున ప్రతి దినము జ్వరము తగ్గువరకు యివ్వవలెను.

రక్షణార్థం: మోతాదు పై కనపరిచినట్లే కాని వారమున కొకమారి నిర్ణీతమైన దినముననే సేవించుచుండవలెను.

'పాల్యుడ్రిన్'ను భోజనానంతరం సేవించి జలమునైనను, పాలనైనను ధారాళముగా త్రాగవలెనని జ్ఞాపకముంచుకొనవలెను.

ఇంపీరియల్ కెమికల్ ఇండస్ట్రీస్ (ఇండియా) లిమిటెడ్



ICP 79

★ అతకని బతుకులు ★

వెనక్కి తిరిగి చూసుకున్నాను. మళ్లీ ఏ ముఖంతో ఇంటికి పోయేది?

"ఏరోయ్, సెలవలా?" - ముక్కూ మొగం గుర్తులేని స్నేహితుడు పలకరించాడు. సమాధానంగా నవ్వి, నడక జోరు చేశాను.

సూర్యుడు కొత్త కొత్త ఆకాశంలోకి ఎగబాకుతున్నాడు. ఇంటి వేపు పోతున్న కొద్దీ హృదయం బరువుతో కుంగిపోతున్నది.

"మళ్ళీ పారిపోకు -" రమణి మాటలు చెవుల్లో గింగురుమన్నై; నాలో నేను నవ్వుకుని, సిగరెట్టు అవతల పారేశాను, ఇంకోటి వెలిగించి.

కొందరు వ్యక్తుల్ని చూడగానే, జన్మజన్మాంతరాలుగా ఆప్తులై మనతో కలిసివస్తున్నట్లనిపిస్తారు; తాయిని చూసిన క్షణం నాకలానే అనిపించింది. ఆ మనస్సు కలయిక ఏ జన్మలోనిదో, ఏ తీరుదో నిర్ధారించుకోలేకపోయినాను; ఆలోచన తెగేలోపల తాయి నన్ను విడిచి తన దారిన వెళ్ళిపోయింది, రాళ్ళగుట్టల్ని నాకప్పగించి.

* * *

"ఒరే - ఆడవాళ్ళల్లో ఆడవాళ్ళకేవో పట్టుదల లుండటం సహజం; మనం వాటి నంతగా పట్టించుకోకూడదు" అన్నాడోసారి మామయ్య.

నేను మాట్లాడకుండా, అంగీకార సూచకంగా నవ్వి ఊరుకున్నాను.

"శకుంతలని నీ విష్టపడిం తర్వాత, పై వాళ్ల ఒప్పుదలల్ని నీ వాట్టే పాటించ గూడదు" అన్నాడు, తిరిగి - మామయ్యకెప్పుడూ ఉపోద్ఘాతం అలవాటు.

నేను యీ తడవగూడ మాట్లాళ్ళేదు; శకుంతల నా కళ్ళల్లో నవ్వింది.

"పోనీ - నీకు తెలుసుగదా, శకుంతలకి నీవంటె ఎంత ఇష్టమో? ఎల్లాగైనా, చూసి ఆనందించేవాళ్లమే గాని, అనుభవించేవాళ్లు మీరు" అన్నాడు మామయ్య, రంగంలోకి దిగుతూ.

నేను చెప్పదల్చుకున్నది గొంతు దాటి బైటికి రాలేదు; గోళ్లు గిల్లుకుంటూ కూర్చున్నాను.

* * *

శకుంతల నా జీవితాకాశంలో నాతో పాటే ఉదయించి, వెంటనే మాయమై పోయింది! - కళ్ళు గట్టిగా తెరుచుకుని నడుస్తున్నాను.

నామీద నాకే కచ్చపుట్టింది. బలంగా విసిరేశాను, సిగరెట్టుముక్కని. అంతా భ్రమ! ఈ లోకంలో నేను ఏకాకిగా జన్మించాను; ఏకాకిగానే దాటిపోతాను.

నవ్వుకున్నాను, నా వెర్రికి. జీవితం నే ననుకున్నంత రోత గాదేమో? - లేకపోతే ఇంతమంది ఎట్లా ఆనందంతో కాలం గడిపేస్తున్నారు? బహుశా, జీవిత సుఖాలన్నీ ఎగిరిపోయి, నాకోసం కంటకాలు మాత్రం మిగిలున్నయ్యా?

కళ్ళెత్తి చూశాను, ఇంటిముందు శకుంతల నిలబడి, నన్ను చూసి లోపలికి వెళ్ళి పోయింది. మామయ్య అరుగు మీద కూర్చొని, "ఏరోయ్, ఎక్కణ్నుంచీ రావటం" అన్నాడు. నేను సమాధానంగా నవ్వి, "కాలేజీనుంచే, మామయ్యా" అన్నాను.

"సెలవలా?" అన్నాడు, పక్కకు తిరిగి పొగాకు కాడ సరిచేస్తూ.

"లేదు - నేనే సెలవుపెట్టాను, కొంత కాలం" అన్నాను.

"ఏం - ఒంట్లో బాగా లేదా?" అన్నాడు మామయ్య ఆదుర్దాగా.

"ఏమీ లేదు, ఊరికినే" అన్నాను నవ్వి.

9

"బావా, విశాఖపట్నం వెళ్ళి, సన్యాసం పుచ్చుకుని అటునుంచి అటు వెళ్ళి పోతావా, మళ్ళీ కనబడ్తావా?" అన్నది శకుంతల, వస్తున్న నవ్వు నాపుకుంటూ, తలుపుచాటున నక్కొని. నేను విశాఖపట్నం ప్రయాణానికి పుస్తకాలు సర్దుకుంటున్నాను; మాట్లాళ్ళేదు.

"నిన్నే, బావా?" అన్నది, తిరిగి.

"ఓసి భడవా, పదవే—నిన్నొదిలిపెట్టి ఏమీ పారిపోడులే" అన్నది వాళ్ళమ్మ, అప్పుడే ప్రవేశిస్తూ. నేను వెనక్కి తిరిగి చూశాను. శకుంతల వాళ్ళమ్మ చాటున దాక్కొని, నవ్వుతూ, వెళ్లిపోయింది.

"మామయ్య కేం చెప్పావురా?" అన్నది అమ్మ ప్రవేశిస్తూ.

నేను సగం మనస్సుతోటి, "ఏముంది, చెప్పటానికి?" అన్నాను.

అమ్మ దగ్గిరికి వచ్చి, రహస్యంగా — "మామయ్య మళ్లీ హెచ్చరించాడు మీ నాన్నని: శకుంతల పెళ్లి వచ్చే నెల్లోనే చేద్దామంటాడు" అన్నది.

"చెయ్యమను —" అన్నాను, పుస్తకాలు పెట్టెలో పెడ్తూ; శకుంతల పెళ్ళితో నాకేమీ నిమిత్తం లేనట్టున్నై నా మాటలు!

"ఎన్నిమాట్లు చెప్పినా గ్రహించుకోకపోతే ఏమనుకోవాలి?" అన్నది మళ్ళీ; నేను మాట్లాడకుండా అన్యమనస్కంగా ఊరుకున్నాను.

"అడిగితే, ఏం చెబుతావురా?" అన్నది ఆఖరికి.

"ఆ మాటా మీరే చెప్పండి" అన్నాను కొద్దిగా నిరసనగా. అమ్మ నోరు నొక్కుకుంటూ, "బాగుంది—మాకేం పట్టె? మా కెందుకొచ్చిన సొద? 'నీ అల్లుడిష్టం, నాయనా' అంటే సరిపాయె; మా మా అల్లుళ్లు ఏం చేసుకుంటే ఎవరికి గావాలి" అన్నది, వెళ్లిపోతూ.

అంతకంటే తమ అభిప్రాయం నా చేత చెప్పిస్తున్నట్టు బైటపడితే సరిపోతుందిగా? నాకు చిరాకెత్తింది; తెరిచిన పెట్టె తెరిచి నట్టే ఉంచి, ఊళ్ళోకి బైలుదేరాను.

సాయంత్రం మామయ్యా, నాన్నా కూర్చుని మాట్లాడుకుంటున్నారు; నేను వెళ్ళి కొద్ది దూరంలో కూర్చున్నాను. నన్ను చూచి, "బావా, వీడు సన్యాసం పుచ్చుకుంటాడట; తొందర్లోనే ఆ బండకొయ్యని కట్టేసి అదేమిట్లో చూడాలి" అన్నాడు మామయ్య, నవ్వి. నాన్న నవ్వుతూ నావంక చూశాడు; నేను ఇంకో వేపు చూస్తున్నాను.

మామయ్య కొంచెం కంఠం తగ్గించి, "అదిగాక, మనమూ పెద్దవాళ్ళమై పోతున్నాం. తొందర్లోనే ఆ శుభకార్యం జరి

(54-వ పేజీ చూడండి)



విజ్ఞానవీధులు

"డాక్టర్"




60. పాటు, పోటులు

సముద్రానికి 'పాటు పోటులు' ఎలా వస్తాయి? అని కాకినాడనుంచి వి. కృష్ణమూర్తిగారు అడుగుతున్నారు.

సముద్రపు తీరంలో ఉన్న వారందరికీ, ముఖ్యంగా ఉప్పుటేళ్లు ఒడ్డున ఉన్నవారికందరికీ సముద్రానికి పాటూ పోటులు ఉంటాయని తెలుసు. అయితే ఎంతమందో గమనించని సంగతి ఏమిటంటే రోజుకి రెండుమారులు సముద్రము తీసిపోతుందనీ, రెండుమారులు పొడుస్తుందనీన్నీ. పాటు పోటులకున్నూ చంద్రునికిన్నీ ఏదో సంబంధమున్నదని ఏనాడో కనుక్కున్నారు నావికులు. అయితే న్యూటన్ వైజ్ఞానికుడు గురుత్వాకర్షణసూత్రాన్ని కనిపెట్టేవరకూ పాటుపోటుల కారణాన్ని ఎవరూ చెప్పలేకపోయారు.

"సృష్టిలోని వస్తువులన్నీ - సూర్యుడూ, గ్రహాలూ, భూమీ భూమిమీది వస్తువులూ- ఒకదానిని ఇంకొకటి ఆకర్షించుకుంటాయనీ, ఈ ఆకర్షణ ఆ రెండువస్తువులలోని ద్రవ్యరాసులను గుణించిన లబ్ధానికి సమసంబంధ సామ్యములోనూ, వాటి మధ్యనున్న దూరపువర్గానికి విలోమ సంబంధ సామ్యములోనూ వుంటుంది" అన్నదే న్యూటన్ సూత్రము. భూతలము గంటకి వేయిమైళ్ళ వేగంతో తిరిగిపోతున్నా మనమంతా భూమిని అంటిపెట్టుకునేవుండి ఎగిరిపోకుండా ఉండడానికి కారణము భూమి మనలను ఆకర్షిస్తూండడమే. చెట్టునుంచి తెగిన పండు భూమిమీద పడడానికి కూడా ఈ గురుత్వాకర్షణమే కారణము.

పటములోని భూమినీ, భూమిని చాలా మట్టుకు చుట్టివున్న సముద్రాన్నీ, చంద్రుణ్ణీ గుర్తించండి. చంద్రబింబము ఆకర్షించడము వల్ల భూమిమీది సముద్రాల నీరు కదిలి, చంద్రుడివైపు కుప్పపడింది. ఇదే పోటు. ఈ ఆకర్షణవల్ల 'పా' 'పా'ల దగ్గర నీరు పలచబడి అక్కడ పాటు వస్తుంది. చంద్రుడు భూమినికూడా ఆకర్షిస్తాడు కదా? అందువల్ల 'భూ' అనే భూమి కొంచెము చంద్రుడివైపు జరుగుతుంది. అందువల్ల 'ప' అనే చోట నీరు ఉబికినట్లు కనబడుతుంది. ఇది 'ప' దగ్గర 'పోటు'. 'ప' దగ్గర ఉన్నవారికి చంద్రుడు పటములో చూపినట్లున్నప్పుడున్నూ, చంద్రుడు భూమి చుట్టూ తిరగడములో 'ప'కి అభిముఖముగా వచ్చినప్పుడు కూడా 'పోటు' కనబడుతుంది. ఈ రెండు సమయాల్లోనే 'పా' 'పా'ల దగ్గర పాటు కనబడుతుంది. అంటే



ఏ ప్రదేశంలోనైనా, ఒకసారి భూమి తన చుట్టూ తాను తిరిగేటందుకు పట్టే ఒక రోజులో రెండు పాటులూ, రెండు పోటులూ కలుగుతాయి.

పౌర్ణమినాడు చంద్రుడూ సూర్యుడూ భూమికి ఇటూ అటూ వుంటారు. కనక రెండువేపులా పోటు జోరుగా వుంటుంది. అమావాస్యనాడు సూర్యచంద్రులిద్దరూ ఆకర్షించిన సముద్రము ఒకవైపు పొడిస్తే, ఈ రెండూ లాగిన భూమి జరగడమువల్ల రెండో వేపు నీరు 'కుప్పపడి' పొడుస్తుంది. కనక పౌర్ణమీ అమావాస్యలలో పాటు పోటులు జోరు.

పాటుపోటులవల్ల సముద్రపు తీరమూ, ఉప్పుటేళ్లగట్లూ కోరుకుపోతాయి. పాటు పోటుల సముద్రమట్టపు తేడా తీరరేఖ స్వరూపాన్ని బట్టి వుంటుంది. లండనులో ఈ తేడా 19 అడుగులు, కార్డిఫ్(వేల్సు)లో ఇది 38 అడుగులు! 50 అడుగులు భేదముండే చోట్లు కూడా ఉన్నాయి. ఇలాటి చోట్ల పోటుసమయంలో నీటిని చెరువులలో పట్టి, పాటు పూర్తికాగానే ఈ నీటిని పారించి చక్రాలు తిప్పి విద్యుత్తు సృష్టించవచ్చును. కాని ఎక్కడా ఇలా చేస్తున్నట్లు లేదు.


పాటు పోట్లు దినభ్రమణానికి అడ్డు. అంటే రోజూ భూమి కొంత శక్తిని నష్టపోతోందన్న మాట వీటివల్ల. ఇందువల్ల చంద్రుడు భూమికి దూరదూరంగా పోతున్నాడట. అంటే భూతప్రభూతకాలంలో చంద్రుడు భూమికి దగ్గిరా ఉండేవాడూ, భూమి తనచుట్టూ తాను మూడు నాలుగు గంటలలోనే తిరిగేది. ఇంకా వెనక్కిపోతే భూమిని అంటిపెట్టుకునే ఉండే చంద్రుడు వేరయిపోయి మెల్లిగా జరిగి ఈనాడు ఇంతదూరానికి వెళ్ళిఉన్నాడనాలి!

61. చెట్టునుంచి తెగినపండు భూమిమీద పడుతుందేమి?


'భూమి ఆకర్షించడమువల్ల' అని శాస్త్రజ్ఞుల జవాబు. "పైకి ఎగురవేసిన వస్తువు కిందపడక పైకి ఎగురగలదా?" అని చీరాలనుంచి పాలెపు భిక్షాలుగారు అడుగుతున్నారు.

[చంద్రుడూ, సూర్యుడూ, గురుడూ వలెనే భూమికూడ గుండ్రముగానే వున్నదని అందరూ ఒప్పుకుంటారనుకుంటాను. [నూరుమైళ్లు ఎత్తుకిపోయే రాకెట్టులో కెమెరాపెట్టి ఫొటో తీయించారు భూమికి. గుండ్రదనము విశదంగా కనబడింది ఆ ఫొటోలో] [అయితే ఈ భూమి బొమ్మ చూడండి. నాలుగు వేపులా నలుగురు మనుష్యులు బంతులను పట్టుకుని వదిలేశారు. అప్పుడు బంతులన్నీ "కింద పడతాయం"టే అర్థమేమిటి? భూమివైపు పడతాయన్నమాటా, కిందపడతాయన్న మాటా రెండూ ఒకటేనంటారా?


భూమిపైన వదలిన బంతి భూమివైపు పడుతుంది. ఎందువల్ల? భూమి దాన్ని ఆకర్షించడమువల్ల నన్నారు. సరే మాట



వంసకి భూమ్యాకర్షణవల్లనే వస్తువులు భూమివైపు పడుతున్నాయని ఒప్పుకుం దాము. భూమియొక్క భాగమైన కొండకి కూడా ఈ ఆకర్షణశక్తి వుండాలికదా? కొండదగ్గిర ఒక బంతి దారానికి కట్టి వేలాడదీశా మనుకొండి. ఈ బంతికి కట్టిన



దారము మైదానభూమిలో లంబంగా వున్నా, కొండచరియదగ్గర, కొండ బంతిని లాగడమువల్ల, 'లంబ' రేఖకి కొంచెము పక్కకి వంగవలెనుగదా? షీహాలియన్ అనే కొండదగ్గర ఈ ప్రయోగము చేశారు వంగింది బంతికికట్టిన దారము! [నీటి మట్టమువల్ల క్షితి సమాంతర రేఖ తెలుస్తుంది.]



కొండలదాకా ఎందుకనీ, కెవెండిషు ఒక సన్నని తులాదండానికి రెండు కొసలా రెండు సమానపు బంతులు గుచ్చాడూ, దాన్ని 'తీగా'తో వేలాడ దీశాడు. కగ నిలబడ్డప్పుడు ఏ లైనులో నిలబడిందో గుర్తించాడు. ఇప్పుడు 1, 2 గుండ్లని - పెద్దవి - పటములోలాగ తెస్తే 'క' '2' వైపూ, 'గ' '1' వైపూ కొంచెం మొగ్గేయి. అలాగే '3', '4' దగ్గిరకి ఈ గుండ్లని తెస్తే 'గ' మూడువైపూ, 'క' '4' వైపూ మొగ్గేయి. ఇది ప్రత్యక్షసాక్ష్యము కదా?

నెప్ట్యూన్ గ్రహాన్ని ఏడమ్, లెవెరీయర్ అనే శాస్త్రజ్ఞులు కనిపెట్టిన వైనం అత్యద్భుతమూ, వస్తువు లొకదాని నొకటి ఆకర్షిస్తాయనే న్యూటన్‌సూత్రానికి విజయ భేరీనీ. యురేనస్ గ్రహము అన్ని గ్రహాల లాగా అండాకృతమార్గంలో తిరగక కొన్ని చోట్ల ఆ గీటు దాటి తిరగడము గుర్తించారు. ఈ శాస్త్రజ్ఞులిరువురూ ఈ పక్క దాటుకి కారణము ఇంకో గ్రహము యురేనస్‌ని (ఇంద్రగ్రహాన్ని) ఆ చోటుకి వచ్చినప్పుడు ఆకర్షిస్తూండడమే నని ఊహించి, ఈ అజ్ఞాతగ్రహము యురేనస్‌కి ఎటువైపుండగలదో లెక్కగట్టారు. ఆ దిక్కుకి టెలిస్కోపు సారించి దాన్ని కనుక్కున్నాడు ఒక జర్మన్ వైజ్ఞానికుడు.

62. ప్రొటీన్ షాక్ అనగా నేమి?

"మొన్న మొన్ననుకురుపాం రాజాగారు కాలిలో మేకు గ్రుచ్చుకొనగా ధనుర్వాత నిరోధక యింజెక్షను తీసుకుని ప్రొటీన్ షాక్ వచ్చి మరణించారని పత్రికల్లో చదివాం. అదేమిటండీ" అని ఏలూరినుంచి పరిటాల శ్రీరాములుగారు అడుగుతున్నారు.

మన దేహం చాలామట్టుకు చిక్కని అల్లిక. ఈ అల్లిక టిష్యూలవలన ఏర్పడును శరీరపు టిష్యూ చాలామట్టుకు ప్రొటీను పదార్థమే మనం తినే ఆహారములోని మాంసకృత్పదార్థము ప్రొటీనుల నిర్మాణముకే సహాయము చేయును. ప్రతిజీవి శరీరములోని యీ ప్రొటీనులన్నూ ఆ జీవి గుణములను కలిగియుండును. ఒక జీవి తాలూకు ప్రొటీను మరియొక జీవికి విజాతీయము. కనుక యింజెక్షనుమూలముగ ఒకరి శరీరములోనికి పాలను ఎక్కించినసూ ఆ శరీరములోని టిష్యూలు యీ విజాతీయ ప్రొటీనుమీద తిరగబడును ఈ తిరుగుబాటుకు ఫలితముగా తీవ్రమైన జ్వరమూ కంపరమూ వంటినిండా నొప్పులూ కలుగును. కాలక్రమమున యీ తిరుగుబాటు తగ్గిపోయి జ్వరము దిగిపోవును. అప్పుడు మళ్ళీ యింకొక పాల యింజెక్షను యిచ్చినచో మొదటిసారివలెనే తిరుగుబాటు కలుగును గాని యీ తిరుగుబాటు మొదటి తిరుగుబాటంత తీవ్రముగానుండదు. అంటే శరీరము క్రమముగా విజాతీయ ప్రొటీన్‌కు అలవాటు పడునన్న మాట.

'ప్రొటీనుషాక్' అనగా విజాతీయ ప్రొటీను నెత్తురులో చేరుటవల్ల శరీరపు మొత్తంలోని జీవకణాలు చేసే తిరుగుబాటన్న మాట. ఈ రకపు యింజెక్షను యిచ్చునపుడు డాక్టర్లు మానవ శరీరముల సామాన్య సగటుగుణములను పరిశీలించి నిర్ణయించిన మోతాదునే యిస్తారు. అయితే సామాన్య శరీరపు గుణములకు భిన్నమైన గుణములుగల శరీరములకు యీ మోతాదే ఉపద్రవము తేవచ్చును వేలాది జనులకు యివ్వబడే ధనుర్వాతమును నిరోధించిన మోతాదు ప్రత్యేక మొక వ్యక్తిపట్ల విపరీత ఫలితాలివ్వడం దురదృష్టమే అనవలెను.

'ప్రొటీనుషాక్'వల్ల ప్రాణనష్టం రావడం సాధారణముగా జరగదు. అలా జరిగియుండిన ట్లైతే యీ రకపు యింజెక్షన్లు ఏనాడో మాయమైపోయుండేవి. దీనికి ప్రథమ చికిత్స ఏర్పాటుగా ఏదీ లేదు చేసే చికిత్స షాక్ వల్ల యేర్పడే లక్షణాలని బట్టి వుంటుంది కోటికొక వ్యక్తిలో వచ్చే యీ విపరీతపు ఫలితానికి తీర్చి యేర్పరుచుకొనే చికిత్స ఏలా వుండగలదు?


—పాణి.

ఉత్తి ప్రశ్నలు జవాబులు


—రెండువైపులనుంచీ వచ్చే శబ్దాల్ని వినడముకోసమే రెండు చెవులు. ఒక చెవి వినబడేవారు శబ్దము వచ్చే దిశవైపు చెవి ఒగ్గి వినడము మీరు చూడలేదా?

—సహజసౌందర్యము స్త్రీ కెక్కువా పురుషుని కెక్కువా అన్నది అందమైన ప్రశ్న. పురుషుడి దృష్టికి స్త్రీయే అందమైనదిగానూ స్త్రీదృష్టికి పురుషుడే అందమైనవాడుగానూ కనపడతారన్నదే యీ ప్రశ్నకు జవాబనుకుంటాను. అయితే ప్రశ్న వేస్తే మాత్రం ఎవరికి వారు తమ జాతే అందమైనదని గొప్పలు చెప్పుకుంటారంటాను. కాదంటారా కేశవరావుగారూ!

—బొట్టుకి సంస్కృతంలో తిలకము అనీ విశేషకము అనీ పేర్లున్నాయి. రెండు పేర్లలోనూ మతసంబంధ మేమీ కనపడదు కాదూ! విశేషించి విశేషకము అన్నమాట (అందంకోసం) 'ప్రత్యేకంగా ధరించేదే' బొట్టు అంటోంది. మరి యిలాంటప్పుడు బొట్టు మతానికి చిహ్నంగా ఆవిర్భవించిందని ఎలా అనగలమూ? బొట్టంటూ ఒకటి పుట్టిన తరువాత ప్రత్యేక మతావేశపరులు దాన్ని మతచిహ్నంగా పెంచుకున్నారనడమే నిజమనిపిస్తుంది.



ఫొటోగ్రాఫ్: రాజా దీనదయాళ్.



☆

హుస్సేన్ సాగర్‌లో
ప్రతిఫలిస్తున్న
హైదరాబాద్
సెక్రటేరియట్
బిల్డింగ్స్

☆

బొమ్మరిల్లు

పసివాడు

శ్రీ గణపతి రాధాకృష్ణమూర్తి



ఆఫీసులో అలసి
ఆలోచనలో సొలసి
నాల్గు మెతుకులు గతికి
కునుకు తీసితో, లేదో?

రవ్వలు మలిచిన
కెంపులు పొదిపిన
ముత్యము లొత్తిన
బహు దివ్యకాంతి.

అత్తరు మెత్తిన
అగరొత్తులు వెల్గిన
కస్తూరి కలిసిన
బల్ సెంటువాసన.

పండువెన్నెలవాను
తెల్ల పాలూ పారు
మల్లెపూలూ రాలు
సుఖమైన అనుభూతి.

బంగారు మెరమెరా
జిల్తారు జిగజిగా
చాందినీ ధగధగా
మెరుపు మిరిమిట్లు.

ఇది యేమి టనుకొంటు
కళ్ళు తెరిచీ చూడ
"నిద్రలె"మ్మని మీద
దొర్లు మా పసివాడు.

★ ★ ★


జాబిల్లి

శ్రీ శ. కోటి



అందాల జాబిల్లి అడుగోనే
అమ్మ నాతో ఆడరాడేమే!
చందమామను పట్టి
నాకు ఇమ్మంటే
కోసినవ్వూ నవ్వి
తాత పొమ్మన్నాడు.
నాన్నవద్దకు వెళ్ళి
మారాము చేస్తే

దూరాన ఉన్నాడు జాబిల్లి
దరి చేరరాడు పొమ్మన్నాడు.
అమ్మ ఇప్పుడు చూడు జాబిల్లి
ఆకు సందుల దాగిఉన్నాడే
పరుగు పరుగున వెళ్ళి
పట్టుకుంటానే
బొమ్మరిల్లూ కట్టి
ఆడుకుంటామే ॥అందాం॥



డాన్ క్విక్సెట్

పూర్వకథ

లామంచా అనే గ్రామానికి చెందిన డాన్ క్విక్సెట్ అనే వెర్రివెంగళప్ప తానొక వీరుడుగా చెలామణీ కావాలనుకొని, శాంకో పాంజా అనే చదువురావాణ్ణి తన బంటుగా చేసుకొని వీరవిహారాలకు బయలుదేరాడు. ఎవరో ఒక ఆడామెను చూచి ఆమెకు డల్సీనియా రాకుమారి అనే బిరుదాన్ని తనమనస్సులోనే యిచ్చేసి, ఆవిడను మెప్పించటంకోసమే తానీ ధర్మరక్షణమనే కఠోరదీక్షను స్వీకరించానని నమ్మాడు. ఒకటికి రెండుసార్లు జైత్రయాత్రలకని బయలుదేరిన డాన్ క్విక్సెట్ గారు ఎన్నోసార్లు పరాభవాలు పాలైనాడు. అయినా లెక్క చేయకుండా తిరుగుతూనే వున్నాడు. వాళ్ళ వూరి వాడు 'శాంసన్' అనే యువకుడొకడు, యీయనకు పట్టుకొన్న పిచ్చి వదిలించటం కోసం, తానొక వీరుడి వేషంలో వచ్చి, యీయనతో యుద్ధంచేసి ఓడించాడు. మరి ఏడాదిపాటు యీ వీరవిహారాల జోలికి పోకుండా యింటిపట్టున వుండిపోతానని డాన్ క్విక్సెట్ గారు తనను జయించిన ఆ రెండో వీరుడికి మాట యిచ్చాడు.

22

వీరాభిషేకం చేయించుకొని, వీర కంకణం కట్టుకొని వీరుడుగా 'భీకరానన వీర శూరాగ్రేసరుడు'గా, 'వీర కేసరి'గా పేరు ప్రఖ్యాతులార్జించిన తాను, ఆశ్వేత శశాంకవీరుని చేతిలో ఓడిపోవటమనేది డాన్ క్విక్సెట్ గారి మనస్సుకు చాలా కష్టమేసింది. ఆ శ్వేత శశాంక వీరుడితో సల్పిన పోరాటం సందర్భంలో తగిలిన గాయాలకు తోడైన యీ మనస్తాపం, డాన్ క్విక్సెట్ గారిని ఆరు రోజుల పాటు మంచంలో నుంచి లేవలేని మనిషిగా తయారు చేసింది.



ఆగాయాలు కాస్త నయమై, వొళ్లు నొప్పులు కాస్త తగ్గగానే ఆయన, శ్వేత శశాంకునికి యిచ్చిన మాట ప్రకారం సంవత్సర కాలం వీర విహారాల వూసు ఎత్తకుండా యింటి పట్టునే వుండేటందుకు నిశ్చయించుకొని, లామంచా గ్రామానికి ప్రయాణమైనాడు. ఇంత పరాభవమయ్యాక యింకా యీ వుక్కు కవచమూ, టోపీ, యీ ఈటె యివన్నీ తగిలించుకు తిరగటం ఎందుకన్న విరక్తి తోచి, వాటి నన్నిటినీ విప్పేసి లుంగ చుట్టగా చుట్టి, ఆ 'డాపుల్' మూపున పడేశాడు. తాను మామూలు దుస్తులు ధరించి 'రోజినాన్టే' మూపున ఎక్కి ప్రయాణం సాగించాడు. ఆయన వెనకాలే మాజీ

మూలం: సెరివాన్‌టెజ్ ★ అనువాదం: శ్రీ విశ్వాత్ముల నరసింహమూర్తి

★ డాన్ క్విక్ సెట్ ★

గవర్నరు శాంకో పాంజాకూడా బయలుదరాడు. కానీ,—తన గాడిదమీాద యజమానిగారి తాలూకు పుక్కు సామాను అంతా పడవేసివున్న కారణంచేత, దాని కళ్లేన్ని పట్టుకు, తాను, అంతదూరమూ కాలి నడకనే పోక తప్పిందికాదు.

డాన్ క్విక్ సెట్ గారి మనస్సు బాగ వికలమై పోయింది. ఇన్ని రోజులపాటు సాగిన ఆ ప్రయాణంలో ఆయన ఒక్కమాట అయినా మాట్లాడలేదు. ఉండి వుండి నిట్టూర్పులు విడవటం కంటె ఆయన వేరే విధమైన శబ్దం ఏదీ చెయ్యనేలేదు. అలాటిస్థితిలో వుండగా ఆయనను పలుకరించటానికి శాంకో పాంజాకు ధైర్యం చాలింది కాదు.

ఎలాగైతే నేం చివరకు యిద్దరూ లామంచా గ్రామం చేరారు. శ్వేత శశాంక వీరుడికి యిచ్చిన మాట ప్రకారం డాన్ క్విక్ సెట్ గారు యిక యీావూరి నుంచీ ఒక్క సంవత్సరం పాటు కదలి వెళ్లకూడదు!

లామంచా గ్రామం యింకా ఒకటి, రెండు మైళ్ల దూరంలో వుందనగానే వీళ్లకు ఆకాలేజీ చదువులు చదివిన కుర్రాడు శాంసన్ కరాస్కో ఎదురైనాడు. వీళ్లుకనిపించీ కనుపించంగానే ఆశాంసన్, ఎక్కడలేని సంతోషంతో వాళ్లిద్దరినీ కౌగలించుకొన్నాడు. అక్కడ వాళ్లకు కొంత ఆలస్యం అయింది. ఈలోగా లామాంచా గ్రామస్థులందరికీ డాన్ క్విక్ సెట్ గారు తిరిగి వస్తున్నాడన్న వార్త తెలిసిపోయింది. గ్రామంలోవుండే ప్రతిఒక్కడూ యీాయనకు ఎదురువచ్చి స్వాగత మిచ్చాడు.

డాన్ క్విక్ సెట్ గారి స్వంత యింటివద్ద ఆయన మేనకోడలు, ముసలిదాసీ వళ్లు అంతా కళ్లు చేసుకొని యీాయన వచ్చే వీధివంకే చూస్తూ వుండిపోయారు. శాంకో పాంజా పెళ్లామూ, పదేళ్లపిల్లా కూడా యీా శుభ సమయానికి ముందే, డాన్ క్విక్ సెట్ గారి యింటికి వచ్చి అక్కడే కనిపెట్టుకు వున్నారు.

ఆనలుగురే కాక, ఆ ప్రక్క యిండ్లలో వుండే వ్యక్తులు కూడా వచ్చి, డాన్ క్విక్ సెట్ గారి యింటి వీధి వాకిట్లో పెద్ద గుంపుగా జేరిపోయారు. అందరూ ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కూడా ఆపేసి, పరాజితుడైన యీ వీరుని ఆగమనం కోసం వేచివున్నారు.

ఇంత మందీ యింత ఆత్రంగా చూస్తున్న వ్యక్తులిద్దరూ ఎట్టకేలకు యింటికివచ్చి చేరారు. శాంకో పాంజా తన స్వామిని ఆయింట్లో క్షేమంగా చేర్చాక, పెళ్లాన్ని పిల్లనీ పలుకరించి, వాళ్లతో ఏవేవో కబుర్లు చెప్పుకొంటూ, గాడిదను నడిపించుకొని తన గుడిసెకు చేరాడు. అక్కడకు చేరింది మొదలు, శాంకో పాంజా తనకు యిటీవల అయిన అనుభవాలన్నిటినీ పూస గుచ్చినట్లు పెళ్లానికీ, పిల్లకీ చెప్పేశాడు. ఆ అనుభవాలే వీరగాథ లైనంత యిదిగా ఆ అమాయికులిద్దరూ విని మురిసిపోయారు. ఈ కథలన్నీ చెప్పటం పూర్తిచేసి, తన కోటుజేబులో నుంచీ కొన్ని బంగారు నాణేలను బయటకుతీసి, పెళ్లానికి పిల్లలకు చూపెట్టాడు. ఈ డబ్బును, ఎవరినీ మోసం చేయకుండా, దారులు కొట్టకుండా, న్యాయంగా, కష్టపడి చెమటోడ్చి సంపాదించి తెచ్చానన్నాడు. వాళ్లిద్దరూ ఆ డబ్బును చూసీ, ఆయనగారి అనుభవాలను మననం చేసుకొనీ మహా మురిసి పోయారు.

ఇక్కడ డాన్ క్విక్ సెట్ గారు తనయింట్లో అయినవాళ్లను నలుగురినీ కూర్చో బెట్టుకొని, తాను యీ వీర విహారాల సందర్భంలో పొందిన కష్ట నష్టాలను ఏకరువు పెట్టాడు. శ్వేత శశాంక వీరుని వల్ల తాను పొందిన పరాజయాన్ని వివరిస్తూ ఆయన కంటికి మింటికి ఏక ధారగా ఏడ్చాడు. వీర విహారాలు చేసి విశ్వవిఖ్యాతి నార్జించుకోవాలని తానుకన్న కలలన్నీ యిలా కరిగిపోయాయనీ, తాను కట్టుకొన్న గాలిమేడలన్నీ కూలిపోయాయనీ ఆయన కుమిలి పోయాడు. ఇక సంవత్సరం దాకా వీర విహారాల జోలికి పోరాదన్న విషయం జ్ఞాపకం వచ్చినప్పుడల్లా మనిషి క్రుంగి పోయేవాడు.

ఆ ఏడాదీ గడిచాకనే కాదు - ఆ తరువాత కూడా శాశ్వతంగా డాన్ క్విక్ సెట్ గారు వీర విహారాల జోలికి పోనేలేదు.

ఇంటికి తిరిగివచ్చిన కొద్ది రోజుల్లోనే డాన్ క్విక్ సెట్ గారు మంచాన పడ్డాడు - మంచాన పడ్డ వాడు మళ్ళీ అందులోనుంచీ లేవనేలేదు!

తుది ఘడియలు సమీపిస్తున్న వనగా, తన మిత్రుల నందరినీ పిలిపించి అందరివద్దా శెలవు తీసుకొన్నాడు. వీరాభిషేకం చేయించుకోక ముందు తనను అందరూ అలన్‌జో క్విక్‌సానో అని పిలిచేవారు కనుక తను చనిపోయాక కూడా, మధ్యలో వచ్చిన యీ డాన్ క్విక్‌సెట్ అనే పేరున కాక, ఆ మొదటి పేరుతోనే తనను జ్ఞాపకం పెట్టుకో వలసిందిగా ప్రతి వారినీ బ్రతిమలాడు.

ఈయన యీ విధంగా మరణశయ్యపై పడి వుండి, మిత్రుల నందరినీ మరచిపోవద్దని బ్రతిమాలుతూ వుంటే, శాంకో పాంజా ఒకమూలకు పోయి గుండె బద్దలయ్యేటంత యిదిగా ఏడ్చేస్తున్నాడు. డాన్ క్విక్ సెట్ వాడివైపు మెడ రిక్కించి చూసి "నా వెర్రి వేషాలలో నిన్నూ యిరికించాను. ఇంకా యీరోజుల్లో వీరులు వున్నారని నేను నమ్మటమేకాక, నిన్నూ ఆ నమ్మకాలకు, ఆ వెర్రి మొర్రి విహారాలకు బలి చేశాను. ఈలోకంలో నన్ను క్షమిస్తావా, నా శాంకో?" అంటూ కళ్లనిండా నీళ్లు తెచ్చుకు అతి దీనంగా అడిగాడు.

ఆయన కంటే మిక్కుటంగా ఏడుస్తూ, "స్వామీ! స్వామీ!... వద్దు...తమరు చనిపోవద్దు: స్వామీ! మొన్ననుతమరేదో ఒక్కసారి ఓడి పోయారని, మనస్సు యింత కష్టపెట్టుకొంటే ఎట్లాగండీ? వంటిమీద నాలుగు చోట్ల గీరుకు పోయినందుకే యింత బెంగ పడతారేమండీ?... కాకపోయినా తమరికి అపజయమూ, అవమానమూ వచ్చాయంటే అందుకు బాధ్యత నాదేనేమో ఎవరికి తెలుసు? మీ గుర్రం రోజి నాన్‌టీకి, నేనారోజున సరిగా జీను తగిలించానో? లేదో? జీను పట్టాలు సరిగ్గా వుండ నందువల్లే మీలాంటి వీరుడు పడిపోయి వుంటాడు కానీ, యుద్ధం చేసే సమర్థతలేక మాత్రం కాబోదు. నామాటవిని ధైర్యంగా వుండండి." అంటూ ఆయనను

(39-వ పేజీచూడండి)

నా ఉపవాస దీక్ష

"నేను ఉండదల్చుకున్నాను."

"ఏమిటి ఉండదల్చుకున్నావు? ఎప్పుడు ఉండదల్చుకున్నావు? ఎందుకు ఉండదల్చుకున్నావు?" అమ్మ అడిగింది.

"ఉపవాసం ఉండదల్చుకున్నాను. ఇవాళే ఉంటాను. ఎందుకంటా వేమిటి? - నాయిష్టం. మన ప్రధాని 7 రోజులలో ఒక్కపూట ఉండమన్నారు - అందుకే ఉంటున్నా, ఆరు రోజులు ముప్పొద్దులా తినేవాళ్ళం ఒక్కపూట-ఒక్కటే - ఒక్కపూట ఉండలేమా?"

"వేలెడంత లేవు. ఇప్పట్నుంచీ ఉపవాసా లేమిటే నీకు? అయినా-నిన్ననే వుంటే, ఏకాదశీ ఫలితమూ దక్కేది; పుణ్యమూ వచ్చేది."

"ఈ నాయనమ్మ మాటలు నేను విన్నవే. కాని నేను ఏకాదశీ ఫలం కోసం ఉండడం లేదు; పుణ్యం కోసమూ కాదు. అందుచేత తప్పదు-నేను ఉండదల్చుకున్నాను."

సాయంత్రం బీచినుంచి వచ్చేసరికి ఏడయింది. వస్తూనే "అమ్మా" అని పిలిచాను అలవాటు ప్రకారం. దాని అంతరార్థం-కాదు-ఆ పిలుపు తరువాత వచ్చే మాటలేమిటో నాకూ తెలుసు, అమ్మకీ తెలుసు. అమ్మ నవ్వింది. నాకోపం వచ్చింది - అనుకోకుండా అడిగినందుకు కాదు; అమ్మ నవ్వినందుకు!

"నేను అన్నం అడగడం లేదు. ప్రొద్దుట వచ్చిన పత్రిక ఏదీ?" మొహం ప్రక్కకి త్రిప్పి అడుగు

కుమారి నిడుదవోలు మాలతి

తూనే మేడ మీదికి వెళ్ళిపోయాను. మరి నిజానికి ఆ పత్రిక నేను మధ్యాహ్నమే చదివేశాగా!

"మాలతీ"

గంటలో క్రిందినుంచి పిలుపు వచ్చింది. "'ఏమిటంటూ' క్రిందకి వచ్చా. కంచాలు పెట్టమంది అమ్మ. అడుగు ముందుకు వెయ్యబోతుంటే అభిమానం కాళ్ళమీద తన్నింది. "నేను తిననుగా!" ఒకపాయింటు అమ్మ ముందుపెట్టా.



"నువ్వు తినకపోతే నాన్నగారు, అన్నయ్యా తినరా!" అంది.

వంటింట్లోకి వెళ్ళే సరికి నిద్ర పోతూన్న ఆకలి మేల్కొంది. వంట కాలను చూస్తే మరీ ఎక్కువైంది.

అమ్మ అక్కడే ఉంది కాబోలు- ఫక్కున నవ్వింది. అప్పుడు కాని నాకు తెలియలేదు-మూడు కంచాలు పెట్టేనని.

"నువ్వు ఉంటావని ఎవరను కున్నార్లే, కూర్చో !" అంది అమ్మ.

ఈమాటతో నా అభిమానమే దెబ్బ తింది.

తమాషాగా అన్నా. - "అంత మాట అనిపించుకున్న తరువాత అన్నం ఎలా నయిస్తుం దమ్మా, నువ్వే చెప్పు?" అంటూ.

గుమ్మందాకా వెళ్ళిన దాన్ని మళ్ళీ వచ్చాను. "పోనీలే అనడం అయిపోయిందిగా. ఇంకేం చేస్తాం అన్నంపెట్టు." అనేశాను.

ఈ విధంగా మధ్యాహ్నం 11 గం॥ లనుంచి సాయంత్రం 8 గం॥ వరకు, రాత్రి. 9 గం॥ నుంచి మర్నాడు ఉదయం 10 గం॥ వరకు కాఫీ మాత్రం తీసుకొని ఉపవాసాలు కొన సాగిస్తూనే వున్నాను.

★

పత్రిక నేర్పిన పాఠం

10 గంటల ఎక్స్‌ప్రెస్ దిగి యింట్లో అడుగుపెట్టగానే, “ఇదేనా, రామూ రావటం?” అని మా నాన్నా, అమ్మా అడిగారు.

“అవునమ్మా” - దుమ్ము కొట్టుకొన్న బట్టలు మార్చుకొంటూ బదులు చెప్పాను.

చిన్ననాటి స్నేహితుడు గోపిని కలుసుకోవాలన్న తొందరకొద్దీ ‘బ్యాగ్’లోనుంచి విస్త్రీబట్టలు తీసి తొడుక్కుంటున్నాను.

“అదేమి చొక్కారా రాముడూ? అన్ని ఆకులూ, పూలూ, పాములూ, బొమ్మలూ వున్నాయి. అచ్చంగా మీ అక్కయ్య జాకెట్ లాగానే ఉన్నది” అని అడిగింది — అమ్మ.

పాంటు వేసుకుంటూ-“పట్నంలో ఇలాంటి షర్టు-తొడగడం మామూలు అయిందమ్మా. అందులోనూ ఈరకం క్లాత్ మరీ ఫేషన్ అయిపోయింది” అన్నాను.

“ఈ బస్తీవాళ్ళకు, ఆడవాండ్ల కోకలు చింపి చొక్కాలు కుట్టించడంకూడ ఫేషనేనన్నమాట!” నాన్నగారు అదోరకమైన వెటకరంగా అంటున్నారు. ఆ మాటలేవీ పట్టించుకోకుండా బజారులోకి వెళ్లాను.

వీధిలో నడుస్తుంటే జనం అంతా నావైపే చూస్తున్నారు. నాకు అసలే చెడ్డ సిగ్గు, అందులోనూ వీళ్లంతా అలా రెప్ప వాల్చకుండా చూస్తుంటే, నాకు తల కొట్టేసినట్లుంది. తల వంచేసుకొని సరాసరి వీధి వెంట నడుస్తున్నాను.

శ్రీ ఎం. ఆర్. కొండాల్ రెడ్డి

అంతలో “ఏంరా, రాముడూ; ఎప్పుడు వచ్చావురా?” అన్న కేక వినపడింది. ప్రక్కకు తిరిగి చూశాను. నా చిన్నప్పటి మిత్రుడు సీను పిలుస్తున్నాడు. ఒక క్షణం ఆగి “బాగున్నావా సీనూ?” అని అడిగాను.

“బాగానే ఉన్నా కానీ, నీ చొక్కా గుడ్డ ఆడవాండ్ల జాకెట్ లాగుందేమిరా?” అని అడిగాడు సీను. సమాధానం ఏం చెప్పాలో తెలియక, “నీముఖం పోనీరా! గోపీ ఇంట్లో ఉంటాడురా?” అని అడిగాను-ధోరణి మారుస్తూ. ‘ఆ వుంటాడులే పో’ అన్నాడు వాడు.

గోపిఇంటికి వెళ్ళాను. వీధి వాకిట్లో నిల్చొని, “గోపి ఉన్నాడా అమ్మా?” అని కేకేశాను. ఇంట్లో నుంచి “లేదు బాబూ” అంటూ గోపి తల్లి బయటకు వచ్చి, “ఏం నాయనా రామూ; పట్నంనుంచి ఎప్పుడు వచ్చావు?” అని అడిగింది.

“వాడు బహుశ పార్కుకు వెళ్ళి ఉండవచ్చు నాయనా!” అని ఆవిడ యిచ్చిన సూచనలను అందుకొని, పార్కువైపుకు వెళ్ళాను. కాని అక్కడకూడ వాడు కనిపించలేదు.

పూలవాసనతో వచ్చే చల్లని గాలి పీలుస్తూ, అక్కడే చిన్న చిన్న పొదలు వుంటే వాటి మధ్య కూర్చుని వీధిలో వచ్చేపోయే జనంకేసే చూస్తున్నాను. ‘ఈ చొక్కా వ్యాల్యూ ఈ పల్లెటూరివాళ్ళకు ఏమి తెలుస్తుందిలే’ అని మనసులో అనుకొంటుండగా, నా వీపుమీద బాల్చీతో నీళ్ళు గభీమని గుమ్మరించినట్లయింది. గభుక్కున లేచి నిల్చొని వెనక్కు తిరిగి చూశాను.

బాల్చీ చేతపట్టుకొని తోటమాలి నిల్చొనివున్నాడు. “అయ్యో దొరా, తమరా? తప్పు మన్నించాలి” అంటూ దణ్ణాలు పెట్టుతున్నాడు. పట్టపగ్గాలులేని ఆవేశంతో “ఏం మన్నించడంరా? రాస్కెల్” అని వాడిమీద హుంకరించాను.

“అయ్యో దొరా, తమరు ఆ పూలజాకెట్టు తొడుక్కొని మొక్కలమధ్యను కూర్చొనివుంటే కండ్లు సరిగ్గా కనపడక మీ చొక్కామీ

దివి కూడా పూలే ననుకొని నీళ్ళు జల్లాను దొరా!" అంటూ వాడు ఎంతో భంగపడి సంజాయిషీ చెప్పు కొన్నాడు.

"నీ మొఖం మని పైంటీ, చెడ్డైందీ, కనపడలేదేరా? చొక్కా అంతా తడిపేశావు! నాన్‌సెన్స్." అని చీదరించుకొన్నాను.

'ఈ చొక్కా ఈఊళ్లో ఎందుకు తొడిగానురా భగవంతుడా' అని మనసులో అనుకొంటూ అది ఎండే దాకా ఎండలోనన్నా నిలబడదా మని అలాగే ఎండలో నిలబడ్డాను.

నిలబడి అయిదు నిముషాలు అయిందో లేదో, మళ్ళీ వీపుమీద ఛర్ర్ మని గీకినట్లైంది. కోపంతో నావళ్లు మండి పోయింది. అటు తిరిగి చూతున గదా, - గద్ద ఒకటి నా వీపుమీద తన్ని ఎగిరిపోతోంది. చొక్కా వెనుకభాగం పూర్తిగా చిరిగిపోవటమేకాక, నా వీపుమీద గద్దగోళ్లు గీక్కుపోయి నెత్తురుకూడ కారుతోంది. "హరి భగవంతుడా! తడిసినచొక్కా ఆరితేచాలని ఎండలో నిలబడితే ఈపరీక్ష ఏమిటిరా?ఇంతకీ నిక్షేపంలాంటి చొక్కా యిలా చింపుకొన్నందుకు ఈరోజు ఇంట్లో చివాట్లు తప్పవు" అనుకొంటూ ఇంటిదారి పట్టాను.

ఇంట్లో అడుగుపెట్టుతుండగానే వెనకాలేవచ్చిన సుగుణ(మాచెల్లి) "నాన్నా, నాన్నా! అన్నయ్య చొక్కా చింపుకొచ్చాడు; నాన్నా!" అని కేకలు పెట్టింది. ఆకేకలు వినబడగానే కుర్చీలో కూర్చున్న మా నాన్న లేచి"ఏంరా; చొక్కా ఎల్లా చిరిగిందీ?" అని గద్దించారు. నా పై ప్రాణాలు పైనే ఎగిరి పోయాయి. ఎటూమాట రాక "గ, గ, – గ, గ," అనటం మొదలు పెట్టాను.

"ఏమిట్రా?" అని మానాన్న మళ్ళీ గద్దించాడు.

"గద్ద వీపు మీద తన్నింది నాన్నా."



"గద్దా? గద్ద మనిషిని తన్నట మేమిటిరా? మమ్మల్ని ఏ గద్దా తన్న లేదేమిరా వెధవా?" అని బిగ్గరగా అరుస్తూ కుర్చీలో కూర్చున్నారు.

ఈమాటలు విని వంటఇంట్లో నుంచి అమ్మ యివతలకు వచ్చి, నావీపు చూసి "అరెరే రక్తం కూడా కారుతోంది కదరా! ఇంత పెద్దగా ఏ గద్ద తన్నిందిరా నిన్ను? అలా మంచంమీద కూర్చో" అని, యింట్లోకి పోయి యింత పసుపు తెచ్చి పట్టువేస్తూ "మీరు ఊరు కోండి యింక! వాణ్ణి కాస్సేపు విశ్రాంతిగా వుండనీయండి. రాక రాక యింటికి వచ్చిన బిడ్డను హాయిగా వుండనీయకుండా. యీ మాయదారి గద్ద ఒకటివచ్చి పడింది వాడి ప్రాణానికి" అంటూ ఆవిడ నన్ను బుజ్జగించింది.

ఇంతలో "పోస్టు, సార్" అంటూ పోస్టుమాన్ వచ్చి, ఆంధ్రపత్రిక-సచిత్ర వారపత్రిక ఇచ్చిపోయాడు నాన్న పత్రిక చేతపట్టుకొని పేజీలు తిప్పుతూవున్నారు. వీపు నొప్పితో బాధపడుతూ, గద్ద తన్నటానికి గల కారణ మేమిటో తెలియకపోయెనని మథనపడుతూనే, నాన్న చేతిలో ఉన్న పత్రికవైపు చూడబోయాను. మా నాన్న "ఆహాహా" అంటూ ఆపలేని నవ్వుతో వుక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ చప్పుడు ఎప్పుడు విన్నదో అమ్మ కూడా వచ్చి, "ఎందుకా నవ్వు?" అని అడిగింది.

"చూశావటే! రాముణ్ణి గద్ద తన్నిందంటే అబద్ధమనుకున్నాను" అంటూ యింకా బిగ్గరగా నవ్వుతూ పత్రిక అమ్మకు చూపించారు. పత్రిక చూసిన అమ్మకూడ నవ్వు ప్రారంభించింది. ఏమిటా ఈ నవ్వుకు కారణమని నాలో నేను తికమక పడ్డాను. తీరా నేను ఆపత్రిక చూచేసరికి ఏముందీ-నాకు

(43-వ పేజీ చూడండి)

చిల్లర గిరాకీ

రామారావు, వెంకయ్యగారికి ఒక్కగా నొక్క కొడుకు. వెంకయ్య దిపల్లెటూరయినా, ఆవూరికి అతడే మోతుబరి రైతు వెంకయ్య, కొడుకు ఏది కావాలంటే అది తెచ్చియిచ్చేవాడు ముద్దుల కొడుకుని విడచి వుండలేక పోయినా, ఎలాగో ఓపిక పట్టి అతన్ని పట్నానికి చదువుకోడానికి పంపించాడు.

ప్రతి నెలా రామారావు ఖర్చు కోసం కొంత డబ్బు పంపేవాడు, వెంకయ్య. రామారావు చీకూ చింతా లేకుండా బస్తీలో దర్జాగా ఖర్చు పెట్టుకు తిరిగేవాడు. తన కొడుకు ఎంత బాగా చదువుకుంటే అంత మంచి సంబంధం వస్తుందనే ఆశ కొద్దీ, వెంకయ్య కూడా, అతను పంప మన్నంత డబ్బూ పంపుతూండే వాడు. రాను రాను రామారావుకు సినిమాలు షోకన్లూ అధికమైనాయి. స్నేహితులుకూడా హెచ్చయారు.

అవి యుద్ధకాలపు రోజులు. ఎక్కడ పట్టినా చిల్లర దొరకడం మహా కష్టంగా వుంది. ఒక రూపాయి చిల్లర కావాలంటే కొంత మారకం (కమీషను) కూడా యివ్వాల్సి వస్తూండేది. అలాంటి సమయంలో రామారావు తండ్రికొక ఉత్తరం వ్రాశాడు:

“నాన్న గారికి—

మీ కుమారుడు రామారావు నమస్కారములు.

మీవద్ద నుండి చాలా రోజుల నుంచి ఉత్తరాల్లేవు. ఇక్కడ నేను కులాసాగానే వున్నాను. నాచదువు కూడా సక్రమంగానే సాగుతోంది. అటు వచ్చే


‘‘జీ [illegible]’’

నెలలో పరీక్షలు కూడా రానున్నాయి. ఇక్కడ చిల్లరకి చాలా గిరాకగా వుంది. చిల్లర సంపాదించడ మంటే ఒక ఘనకార్యంలా వుంటోంది. ఇక విశేషాలు ఏమీ లేవు. అమ్మకి నా నమస్కారాలని చెప్పండి. మీ జవాబు కెదురు చూస్తుంటాను.

నీ కుమారుడు
రామారావు”

“పాపం, అబ్బాయి చిల్లర కోసం ఎంత మారక మిచ్చుకుంటున్నాడో!” అనుకుని వెంకయ్య పదిహేను రూపాయల చిల్లరమార్చి రామారావుకి పంపిస్తూ ఒక ఉత్తరం వ్రాశాడు.

“కుమారుడు రామారావుకి [illegible]



★ డాన్ క్విక్ సెట్ ★

(33-వ పేజీ తరువాయి)

మనోధైర్యం రప్పించటానికి ఎన్నో విధాల చెప్పి చూశాడు, శాంకో పాంజా.

ఎన్ని చెప్పినా డాన్ క్విక్ సెట్ గారికి మన ధైర్యం రాలేదు.

"అల్లాకాదు; శాంకో! ఇంతవరకూ నేనేదో పిచ్చిలోపడి బ్రతికానని నాకిప్పుడు బాగా తెలిసి వచ్చింది. నా కిప్పుడే జ్ఞానోదయం అయింది (జ్ఞానోదయం అయింది కనుక ఆయన వీరగ్రాంధిక భాషను వుపయోగించటం మానేశారు!)... నేను ఒకప్పుడు వీరకేసరి డాన్ క్విక్ సెట్ ను అయివుంటే అయివుండ వచ్చును. కానీ, యీ క్షణం నుంచీ మాత్రం అలన్ జో క్విక్ సానో అనే సాధారణ వ్యక్తిని ... నా బ్రతుకిక కొన్ని క్షణాలలోకి వచ్చేసింది. ఈ జన్మలో నేను చేసిన పొరపాట్లు, తలపెట్టిన పాపాలు, మీ అందరి అనుమతిన వెళ్ళ గక్కుకొని, విల్లురాసి, హాయిగా కన్నుమూస్తాను." డాన్ క్విక్ సెట్ గారు — (కాదు కాదు—ఆయనగారి కోరిక ప్రకారమే మనం కూడా ఆయనను యిక ఆపేరుపెట్టి పిలవకుండా, అలన్ జో క్విక్ సానో గారనే అందాం) — అలన్ జో క్విక్ సానో గారు యిక మాట్లాడలేక పోయారు.

హృదయాలను కదలించి వేసే యీఘట్టం గడిచాక, అలన్ జో క్విక్ సానోగారు ఏ ఒకటి రెండు రోజులో మాత్రమే బ్రతికివున్నారు. ఆ తరువాతను ఎప్పుడో ప్రశాంతంగా కన్ను మూసేశారు.

పరాయి వారెవ్వరినీ పల్లెత్తుమాట అనకుండా అందరి పట్లనూ మంచిగా బ్రతికిన యీ క్విక్ సానో గారు చనిపోయారంటే, ఆవూరిలో కంట తడిపెట్టని వ్యక్తి లేడు. వూరి పెద్దలు పదిమందీ ఒకచోక సమావేశమై ఆయన స్మృతికి తమ విచారాన్ని ప్రకటిస్తూ అంత మంచిగా బ్రదికిన వ్యక్తి కనుక యీయనను, ముందు యుగాలవారు 'సాధూ అలన్ జో క్విక్ సానో' అని పిలువాలనీ, ఆపేరటనే ఆయనగారి సంస్మరణం జరుగాలనీ తీర్మానించు కొన్నారు.

సమాప్తం.

చిల్లర గిరాకీ

చిరాయువులుగా దీవించి వ్రాయడమేమనగా-

నీవు వ్రాసిన ఉత్తరం అందింది. అక్కడ నీవు చిల్లరకోసం యెంత కష్టపడుతున్నావోనని, యివాళే పదిహేను రూపాయిల చిల్లర మార్చి మనిఆర్డర్ చేసి పంపిస్తున్నాను. అందినదీ, లేనిదీ జవాబు వెంటనే వ్రాయవలెను. శ్రద్ధగా చదువుకోవలెను.

నీ తండ్రి
వెంకయ్య"

రామారావు, తండ్రి అమాయకత్వానికి నవ్వుకుని, మళ్ళీ యిలా వ్రాశాడు.

"నాన్న గారికి—

మీ కుమారుడు రామారావు నమస్కారాలు.

నీవు వ్రాసిన ఉత్తరమూ, పంపించిన డబ్బూ అందినవి. కాని. పోస్టువాళ్లు చిల్లరగా కాక నోట్లు యిచ్చారు అమ్మకి నమస్కారాలు.

నీకుమారుడు
"రామారావు"


వెంకయ్యకి అరికాలు మంట నెత్తికెక్కింది. గబగబా పోస్టాపీసుకి పరుగెత్తి పల్లెటూరి పోస్టు మాస్టర్ ని పట్టుకొని అడిగాడు—

"ఏమయ్యా! నేను నిన్నంతా బ్రతిమాలుకుని పదిహేను రూపాయిల చిల్లర సంపాదించి మావాడికి మనియార్డరు కడితే! చిల్లర అట్టే పెట్టుకొని నోట్లు పంపించావటగా! మారకంతో మరింత గడించుకోవాలనా? చాల్చాల్లే నీ మర్యాద" అంటూ ఆయనను దుయ్యబట్టాడు.

పోస్టుమాస్టర్ కి నవ్వాలో యేడవాలో యిప్పటికీ తెలీలేదు.

★

జంతుకోటిలో మానవలక్షణాలు



పక్షుల తెలివి తేటలను గురించిన పరిశీలన కొంత చేద్దాం. వీటిలో విశేష మేమంటే - కొన్ని రకాల పక్షులు అతి మేధావుల్లా వుంటాయి: మరికొన్ని వుత్త వాజమ్మల్లా వ్యవహరిస్తాయి. స్థూలంగా పక్షిజాతి అంతా ఒకటే అయినా, వాటిలోనే యింత పెద్ద వ్యత్యాసాలు వుండటం ఆశ్చర్యకరంగా తోస్తుంది.

పక్షుల కనుచూపు చాలా తీక్షణంగా వుంటుంది. కంటెదుర కనుపించే ఆవస్తువుల ఆకారాలను గుర్తించి, పోల్చుకోవటంలో యివి, స్తన్యమృగాల జాతి జీవాలలో చాలా వాటికంటే మెరుగే!

వస్తువుల ఆకారాలను పోల్చుకోవటమే కాదు; వాటిని లెక్కపెట్టటం కూడా పక్షులకు బాగా చేతనౌతుంది. మనుష్యులలో కూడా హాటెన్‌టాట్ జాతివంటి కొన్ని అనాగరిక జాతులు వున్నాయి. వీళ్లకు ఐదుకిమించి అంకెలు కూడుకోవటం, తీసేసుకోవటం సరిగా రాదు. అలాటి వాళ్లకంటే కూడా పక్షులు త్వరగా గుణింతాలు చేసుకోగలవని కొన్ని పరిశోధనల వల్ల తేలింది.

కోడి పెట్టలను పట్టుకొచ్చి వాటికి ఎదురుగుండా కొన్ని గింజలు బారులు బారులుగా పేర్చారు, అయితే ఆ గింజల్లో మొదటి రెండు గింజలూ ఎంత పట్టి పీకినా వూడిరాకుండా జిగురుతో నేలకు అంటించి పారేశారు. మూడో గింజను మాత్రం అంటించలేదు. ఆ తరువాత మళ్ళీ రెండు గింజలను అంటించి పెట్టారు. మళ్ళీ మూడో గింజను వదులుగానే వుంచేశారు. ఈలాటి గింజల మీదకు ఆకోడి పెట్టలను వదిలిపెట్టి, వాటికి ఆ పద్ధతి కొంతకాలం అలవాటు చేసి, అవి నేలకు అంటుకుపోయిన గింజలను పట్టుకొని వేళ్లాడటం వృథా అని తెలుసుకొని సరాసరి మూడో గింజ మీదికే ముక్కును పోనిస్తే మంచిదని తేల్చుకొన్నాక, గింజలను నేలకు అంటించే పద్ధతి మానేసి, మునుపటిలాగే బారులు బారులుగా పెట్టి, వాటిమీదికి యీ కోడిపెట్టలను ఒదిలి పెట్టారట. అయినాసరే-ఆ కోడి పెట్టలు, ఎంత సేపూ మొదటి రెండు గింజలను వదిలేసి, సరాసరి మూడో గింజనే తినటం మొదలు పెట్టాయట. అంటే ఆ కోళ్లకు అప్పటికి మూడో అంకె వరకు ఒంట్లు వచ్చాయన్న మాట.

మన్రో ఫాక్స్ అనే బ్రిటిష్ జంతు శాస్త్రవేత్త యిలాగే కాకుల తోనూ, చిలుకల తోనూ కొన్ని పరిశోధనలు చేశాడు. అలా చేయగా చేయగా, కొంత కాలానికి అవి ఏ ఏడవ గింజనైతే నేలకు అంటించి పెట్టుతూ వుంటారో, దానిని మాత్రం వదిలేసి మిగిలిన ఆరింటినీ నిస్సంకోచంగా తినెయ్యటం నేర్చుకొన్నాయట. అంటే - వీటికి ఏడువరకు అంకెలు వచ్చాయన్నమాట.

మరొక పరిశోధనలో కొందరు శాస్త్ర వేత్తలు కలిసి కొన్ని పావురాళ్లకు ఐదంటే ఐదే గింజలు తీసుకొనే పద్ధతి అలవాటు చేశారట. ఆ పద్ధతి బాగా అలవాటు

అయ్యాక, వాటికళ్ల ఎదురుగుండా తట్టెడు గోధుమలు కుప్పగాపోసి పెట్టి, వాటిలోనుంచీ మూడుఅంటే మూడే గింజలు ఏరి ఆ పావురాళ్ల ముక్కులకు అందించి చూశారట. ఆ పావురాళ్లు ఆమూడు గింజలను ముక్కున కరుచుకొని, ఎదురుగుండా వున్న ఆ గోధుమ గింజల రాసి దగ్గిరకు వెళ్లి, అందులోనుంచీ రెండు అంటే రెండే గింజలు తీసుకొని, మొత్తం ఐదు గింజలూ సమకూడాక, అప్పుడు మింగాయట!

పెట్టెల్లో పడేసి చిక్కులు పెట్టి తెలివి తేటలు పరిక్షించే పద్ధతులయితే పక్షుల బుర్రలు ఏమంతగా పనిచేయవు. ఒకసారి ఒక పిట్టను యిలాంటి పెట్టెలో ఒకదాంట్లో పడేశారట. దానికి ఎటూ పాలుపోక, మెడ వెనక్కు తిప్పకొని, వెన్ను మీది యీకల సందున ముక్కుతో గోక్కోవటం మొదలు పెట్టిందట. అలా చేయటంలో దానితల పొరపాటున ఒక తాడుకు తగిలింది. ఎప్పుడైతే ఆతాడుకు దీని తల తగిలిందో ఆపెట్టె తాలూకు తలుపు తెరుచుకుపోయి దీనికి కావలసిన స్వేచ్ఛ దొరికింది. ఇక ఆతరువాత ఎన్నిసార్లు ఆపక్షిని ఆపెట్టెలో పడవేసినా, అది వెన్ను యీకల సందున ముక్కుతో గోక్కోవటమే పద్ధతిగా పెట్టుకొందిట కానీ, ఎంతకీ యీ తిప్పలంతా పడకుండానే ఆ ముక్కుతో తాడును పట్టుకు గుంజితే చాలు నన్న విషయాన్ని అది అర్థం చేసుకొనేలేక పోయింది.

పక్షులకు తెలివితేటలు వున్నాయని అనుమానం కలిగేటట్లు ప్రస్ఫుటంగా కనిపించే సందర్భాలు కొన్ని వుదాహరిస్తున్నాను.

సామాన్యంగా మన యిళ్లలో నిలువు టద్దాలు వుంటాయి కదా! కిటికీ చువ్వల్లో నుంచి దూసుకు వచ్చే పిచ్చుక దంపతులు యాదాలాభంగా యిల్లంతా తిరుగుతూ యీ అద్దం ముందుకు వచ్చి ఎగురుతూ, తమ ప్రతిబింబమే ఆ అద్దంలో కనిపిస్తే, అవేదో మరొక పక్షులు తమను వెక్కిరించటానికే యిక్కడకు వచ్చాయన్న కోపం కొద్దీ, ఎంతసేపైనా సరే, ఆ అద్దం మీదికే ఎగిరెగిరి వచ్చి, తమ ముక్కు కొనలు మొద్దు బారిపోయేదాకా అద్దం మీద పొడిచి పొడిచి యిల్లంతా నానా హంగామా చేసి పారేస్తాయి. ఇలాంటి వాటికి తెలివి తేటలు వున్నాయంటే ఎలా నమ్మగలం!

అంతేకాదు - పక్షులకు సామాన్యంగా ఏ విషయమైనా అత్యల్ప కాలమే జ్ఞాపకం వుంటుంది. మరొక పక్షిని జ్ఞాపకం పెట్టుకోవాలనుకొన్నా వీటికి ఆరు ఏడు రోజులకు మించి జ్ఞాపకం వుండదు. అందులోనూ, కాస్త వయస్సు మీరిన పక్షులకైతే అంత మాత్రం కూడా జ్ఞాపకం వుండదు. తల్లి పక్షికి పిల్ల పక్షి జ్ఞాపకం వుండే దానికంటే, పిల్ల పక్షికి తల్లిపక్షి జ్ఞాపకం వుండే కాలమే ఎక్కువ.

నీటికాకి పిల్ల ఒకటి మందతప్పి పోయిందట. ఆపిల్ల ఎలాగో నానా యాతనలు పడి, తల్లిపక్షి వుండే గూటికివస్తే, యీ తల్లి పక్షి అప్పటికప్పుడే తన పిల్ల ఎలా వుండేదీ, తన కసలు ఒక పిల్ల

జంతుకోటిలో మానవలక్షణాలు

వుండేదీ లేనిదీ కూడా మరిచిపోయి, ఆపిల్ల పక్షి బుర్రమీది యీకలన్నీ వూడపీకి పారేసి, దాని తలకాయను తీసుకుపోయి ఒక బండకేసి బాది, అందులో నుంచీ వచ్చిన మెదడును ఖాదంపప్పను తిన్నంత హాయిగా తిని హూరు కొన్నదట!



పెన్ గ్విన్స్ అని మరొక రకం పక్షులు వున్నాయి. ఇవి చూడటానికి మహా రాజసంగా కనిపిస్తాయి. హిమ మండలంలోనే ఎక్కువగా నివసిస్తుంటాయి. వీటి ముఖ్యాహారం చేపలు. అయినా కూడా, నీటిలో పట్టుబడితేనే అది చేప అని గుర్తించగలదట కానీ, ప్రమాదవశాన అయినా ఒడ్డుమీద చేప కనబడితే అదేదో రాయో, రప్పో అని తప్పుకు పోతుందట యీ బుద్ధిశాలి! వీటికి తమ పిల్లల మీద మమకారం మహా ఎక్కువ. లేక లేక పుట్టిన పిల్లలను ఆడవాళ్లు ఎంత బుజ్జగించి, ఎంత అపురూపంగా చూసుకొంటారో, అంతకంటె మిక్కుటంగా యీ పెన్‌గ్విన్ పక్షులు తమకు డజన్లు కొద్దీ పిల్లలు పుట్టుకొచ్చినా కూడా, ప్రతి పిల్లనీ అంతగారాబంగానూ పెంచుకొంటుంది. పిల్లపక్షికి, అడ్డగాడిదకు వచ్చినట్లు ఎన్నిఏళ్లు వచ్చినా, తల్లి పక్షి దానికి పాలు యీయటం మానదట!

ఈ పెన్‌గ్విన్ పక్షులు మంచు విపరీతంగా వుండే చోట నివసిస్తుంటాయని చెప్పాను కదూ! వాటికక్కడ గూళ్లు కట్టుకోవటానికి మరేమీ దొరకవు కనుక, చిన్న చిన్న రాళ్లను ఏరి తెచ్చుకొని వాటితోనే గూళ్లు కట్టుకొంటాయి. గూటికి కావలసిన రాళ్లు అన్నిటినీ సంపాదించుకొని వచ్చే బాధ్యత అంతా పూర్తిగా మొగపక్షిదే. ఈ మొగపక్షికి, కొంతమంది మొగవాళ్ల లాగే, తగని బద్ధకం. మనం రేషన్ షాపులకు పోయినట్లు ఎక్కడికెక్కడికో పోయి, పదిమందిలోనూ పోటీలుపడి రాళ్లు దొర్లించుకు రావడమంటే దీనికి మహావిసుగ్గా వుంటుంది. అందుకనిసామాన్యంగా ఈ పక్షులు తేలిక పద్ధతి ఒకటి అమలులో పెట్టుకుంటాయి. తోటి పక్షులు కష్టపడి తెచ్చి పెట్టుకొన్న రాళ్లను, యీ పక్షులు చాటుగా మాటుగా పోయి దొంగిలించుకు వస్తాయి. ఆ దొంగపని చేస్తుండగా మటుకు ఏపక్షి అయినా పట్టుబడి పోయిందో, దాన్ని అక్కడ నిలవేసి, అన్ని పక్షులూ చుట్టూ మూగి చివాట్లు పెట్టి, తమ సంఘంలో నుంచి తెలివేసినంత హడావుడి చేస్తాయి.

మనం వేడుకకోసమని ఎల్లాగైతే 'పిక్‌నిక్స్'కు పోతూ వుంటామో, అలాగే, యీ 'పెన్‌గ్విన్' పక్షులు కూడా ఒక్కొక్కప్పుడు మందలు మందలుగా బయలుదేరి, ఏపనీ లేకపోయినా ఒకసారి అల్లా మైళ్ల తరబడి తిరిగి వస్తుంటాయి. ఈ పక్షులలో యిది కూడా ఒక విశేషమే! (ఇంకావుంది)

డిప్యూటీ స్పీకర్

(14-వ పేజీ తరువాయి)

చైర్మన్‌గారివద్దనుండి పర్మిషన్ లేందే బంగాళా మాత్రం తెరిచేదిలేదు. తరవాత నీ యిష్టం" అన్నాడు.

శ్రీ అయ్యంగారికి యింక చేసేదేం కనపడలేదు - ఆనాడు అమావాస్య తిథి-మాధ్యాహ్నికాలకు కాలం దాటిపోతోంది. "సరే లేరా, పోనీ ఈ బెడ్డింగ్ కొంచంసేపు అరుగుమీదపెట్టి, పంపువద్ద స్నానంచేసి, తర్పణం వదలుకుంటాను. అందు కభ్యంతరం లేదు కదా?" అని అడిగారు. వాచరు సరేనంటూ, స్నానం అయింతర్వాత వెంటనే బంగళా వదలి వెళ్లిపోవలసిఉంటుందని హెచ్చరించారు.

ఈలోగా ఆహ్వానసంఘం వారి కార్యకర్తల్లో ఒకరు బంగళాకు రావడం తటస్థించింది. వారు శ్రీ అయ్యంగారిని గుర్తించి, పరిస్థితులు తెలిసికొని, వాచరుతో వారి సంగతి చెప్పి, అచటనే బస ఏర్పాటుచేశారు– ★

అందని రాగాలు

(15-వ పేజీ తరువాయి)

స్పృహ తప్పిపోతున్న రాధాయికి మాట స్పృహను కల్గించింది. ఆశతో కళ్లు విప్పాడు. అక్క మొహం కనబడలేదు. అమ్మవంకా నాన్నవంకా ఒక్కమారు చూచాడు. ఆ చూపుల కడ్డంగా—ఆశలో నుండి పూర్తిగా నిరాశలోకి జారిపోతున్న ఆ చూపుల కడ్డంగా—బరువైన రెప్పలు కమ్ముకున్నై. ఆ కమ్మికలో 'అక్క ఇల్లు ఇది కాదుగా' అని ధ్వనించింది. కాని ఆ ధ్వని అందరికీ వినబడదు.

* * *

అక్క వచ్చేరు వేళైందని అమ్మా నాన్నా ఆశపడుతున్నారు. అప్పటికి పన్నెండు గంటలనుండీ రాధాయిపరిస్థితి క్రమంగా దిగజారిపోయింది. జీవిత స్వభావాలు తెలియకపోయినా కొన్ని నెలలనుండి మాత్రమే జీవించడాన్నెరిగిన పాపాయి ఆ విషాద వాతావరణా న్నర్థంచేసికోలేకపోయినా అమ్మ ముఖంలోని విచారచ్ఛాయల నేమైనా అర్థం చేసికోగలిగిందేమో కెవ్వుమన్నది. పాపాయిని సముదాయిస్తూ అమ్మ రాధాయిని పలుకరిస్తూంది.

రాధాయిలో ఆవేదన కూడా అంతరిస్తున్నది. బిగువుగా వేడిగా వస్తున్న నిట్టూర్పులు చతికిలబడుతున్నై. నాన్న మళ్లీ డాక్టర్ని తీసుకొచ్చాడు. కాని....అతడు విరిచిన పెదవి అమ్మానాన్నలకు కనబడకపోయినా 'మళ్ళీ వస్తా'నని చెప్పి బయటికి వెళ్లిపోయాడు.

ఒక్కమాటు కళ్లు తెరిచి చూచాడు రాధాయి. ఆచూపుల్లో చలనం జారిపోతూ, అమ్మా నాన్నల హృదయాలను కదిలించి వేసింది. రాధాయి మనఃకోణంలో ఆశ పూర్తిగా చెరిగిపోయింది'...రాదు... అక్క...మళ్ళీ...రాదు...వాళ్లిల్లు.... విడిచి...నా ఇంటికి...మళ్లీ...రాదు...'

“అదుగో అక్క!!” అమ్మ వెర్రిగా కేక వేసింది.

ఉలిక్కిపడ్డ రాధాయికళ్లు కష్టంగా తెరుచుకున్నై. ఎదురుగా అక్క మొహం కనిపించింది లీలగా.

“ఆ...” ఆశ్చర్యాన్ని తెలియజేయడానికో, అక్కను పిలవడానికో తెరుచుకున్న నోరు మళ్ళీ మూతబడలేదు.

...గోడ గడియారంలో 'కీ' ఐపోయి “టిక్కు టక్కు” ఆగిపోయింది...ఆవరించిన నిశ్శబ్దంలో అమ్మా నాన్నల హృదయాలు మాత్రం టప్పుమన్నై.

తరువాతి నెలలో నాన్న బలవంతాన బావ కాపురం బదిలీ అయింది. ఇప్పుడక్క వాళ్లిల్లు విడిచి, 'రాధాయి ఇంట్లో' నే ఉంటున్నది. ★

అత్తలపార్లమెంటు

(19-వ పేజీ తరువాయి)

మని (కొంచెమాగి) ఆ చిన్నవాడు అన్నట్లు మనసంఘానికి “అత్తలపార్లమెంటు సంఘం” అని పేరుపెట్టుదాం.

వెం: చాలా బాగుంది.

మీ: సరే ఆపేరే పెట్టుదాం. వస్తా పొద్దుగూకవచ్చింది.

పా: మేముగూడవస్తున్నాం, అందరం ఆలాగా వచ్చేది. మనసంఘానికి వెంకాయమ్మ వదినెగారిని ప్రెశిడెంటుగా నియమిద్దాం.

మీ, సు: సరే, మాకూ యిది యిష్టమే.

పా: వెంకాయమ్మ వదినెగారూ! కార్యక్రమం సిద్ధం చేయండి.

వెం: చిత్తం.

మీ, పా, సు: వెళ్లొస్తామండి, మనసంగతి మర్చిపోకండి.

వెం: మంచిది. నేనేనా మర్చిపోయేది.

పా: వెంకాయమ్మగారు అసాధ్యురాలు. (అందరూ నిష్క్రమింతురు) ★

పత్రిక నేర్పిన పాఠం

(37-పేజీ తరువాయి)

పట్టలేనంత నవ్వు వచ్చి ఫక్కున నవ్వేశాను.

ఇంతకూ మేమంతా పత్రిక చూచి నవ్వటానికి గల కారణమేమో, ప్రతివారము “ఆంధ్ర వారపత్రిక” చదివేవారు గ్రహించి ఉంటారు. అలా మీలో చదువనివాళ్లూ, చదివినా మరచిపోయిన వాళ్లూ వుంటారుకనుక, మేము ప్రతిక చూచి నవ్వటానికి గల కారణము వ్రాస్తున్నాను: చదవండి.


ఆ పత్రికలో ఒక కార్టూన్ వుంది. అందులో అచ్చంగా నా చొక్కాలాంటి చొక్కా తొడుక్కొని ఒక అబ్బాయి నిల్చొని వున్నాడు. ఆ చొక్కా మీద ఉన్న పాముబొమ్మని చూసి నిజమైన పాము అనుకొని ఒక గద్ద ఆ పోగ్గాణ్ణి తన్నుకుపోతోంది. ఆ బొమ్మని చూచే నవ్వాము మేమందరమూ!

అప్పటికి గాని, నాన్నతో పాటు నాకూ, గద్ద తన్నటానికి కారణము తెలిసింది కాదు. ఇక మీదట ఇక్కడ ఉంటే మంచిది కాదని, నాన్న అమ్మ ఎంత వద్దన్నా వినకుండా మిగిలిన శెలవురోజులు పట్నంలోనే గడపవచ్చునని ఆంధ్రపత్రిక చేత బుద్ధ్యకొని, మరునాడే 10 గంటల ఎక్స్‌ప్రెస్‌కు టిక్కట్టు తెప్పించుకొన్నాను. ఇక అప్పటినుంచీ నాకు ఆ 'పూలజాకెట్టు' తొడుక్కోవడమంటే మాచెడ్డభయం వేస్తోంది!



మిస్ టోక్యో, మిస్ మెడ్రాస్

శ్రీమతి టి సూర్యకుమారి భారతీయ ఫిల్మ్ ప్రతినిధి వర్గంతో తిరిగివస్తూ జపానులో ఆగినప్పుడు తనలాగే అందాలరాణి బహుమతి పొందిన మిస్ టోక్యో (1952)తో కలిసి ఫొటో తీయించుకున్నది.



భాస్కర్ ప్రొడక్షన్సువారి "బ్రతుకు తెరువు"లో నాగేశ్వరరావు, శ్రీరంజని.

★ విదేశాలకు రాకపోకలు ★

గత సంవత్సరం భారతీయ ఫిల్ము ప్రతినిధులు కొందరు రష్యా వెళ్లివచ్చారు ఈ సంవత్సరం మరికొందరు అమెరికా వెళ్లి వచ్చారు ప్రతినిధులుగా కాకుండా వ్యక్తిగతహోదాలో అనేకమంది ఫిల్ము పారిశ్రామికులు, టెక్నీషియన్లు ఇతరదేశాలకు వెళుతూ వస్తూ ఉన్నారు ఇతరదేశాల నుంచి ముఖ్యంగా అమెరికా, బ్రిటన్ల నుంచి డైరెక్టర్లు, టెక్నీషియన్లు మనదేశానికి వచ్చి చిత్రాలు నిర్మిస్తున్నారు వ్యాపారరీత్యాను, టెక్నికల్ రంగంలోను మనకూ విదేశాలవారికీ సంబంధాలు పెరుగుతున్నాయి గడిచిన రెండు మూడేళ్ళలో జరిగిన ఈ పరిణామం హర్షించదగినదని చెప్పవచ్చును

కాని మనదేశంలో తయారయే చలన చిత్రాలస్థాయి పూర్వంకంటె ఏ విధంగానైనా పెరిగిందా అంటే లేదని సమాధానం చెప్పవలసివస్తుంది యుద్ధానికి పూర్వం తయారైన ఉత్తమ చిత్రాలతో నేటి ఉత్తమ చిత్రాలను పోల్చిచూస్తే స్థాయి పెరక్కపోవటమే కాక కొన్ని విషయాలలో తీసికట్టుగా ఉంటున్నది ఫొటోగ్రఫీ, సౌండు రికార్డింగ్ మొదలైన టెక్నికల్ శాఖల్లో సాధించిన స్వల్ప విజయాలు మన చిత్రాల కళాస్థాయికి ఏ విధంగానూ ఉపకరించకుండా పోతున్నవి నిర్మాణ పద్ధతుల్లో మొదటినుంచీ ఉన్న అవ్యవస్థ ఎక్కువైందేకాని తగ్గలేదు అంతర్జాతీయ రంగంలో మన చిత్రాల్ని ప్రదర్శిస్తే ప్రేక్షకులు ముభావంతో స్వీకరిస్తున్నారే కాని సంచలన మేమీ కలిగించటంలేదు నిర్మాణ సంఖ్యలో మన సినిమా పరిశ్రమ రెండో స్థానం ఆక్రమిస్తున్నా స్థాయిలో చాలా దిగువన ఉంటున్నది

ఈ పరిస్థితికి ముఖ్యకారణం చిత్రాల పట్ల నిర్మాతలు ప్రదర్శించే వైఖరి ఏటేటా అనేక నూతన నిర్మాతలు రంగంలోకి దిగుతున్నారు వీ రందరికీ సినిమాపై ఇంత వ్యామోహం కలగటానికి కారణం ఏమిటి? కళగా సినిమాపై వీరికి గౌరవం ఉండవచ్చును కాని ఈ గౌరవాన్ని ధనార్జన కాంక్ష తొక్కివేస్తున్నది వీలైనంత తక్కువ పెట్టుబడితో, వీలైనంత త్వరలో, వీలైనంత లాభం ఆర్జించాలనేదే ప్రధాన ఆశయం ఏ నిర్మాత నడిగినా ఇదే తమ ఆశయమైనట్లు నిర్మొహమాటంగా చెబుతాడు ఈ ఆశయం సఫల మయ్యేందుకు ఏ పద్ధతి అనుకూలమైతే ఆ పద్ధతి అనుసరిస్తారు అదివరకే విజయవంతమైన

విదేశాలకు రాకపోకలు

చిత్రాలను అనుకరించటం, హాలీవుడ్ చిత్రాలను అనుకరించడం ఇవే మన నిర్మాతలు సాధారణంగా అనుసరించే పద్ధతులు. కొత్తదారులు తొక్కితే, కొత్త పద్ధతులు అనుసరిస్తే చిత్రానికి డబ్బు రాదేమో నని సందేహం. ఈ జంకువల్ల ప్రతి నిర్మాతా, కొత్తవాడయినా పాతవాడయినా నలుగురు నడిచే దారి నేతప్ప కొత్తదారి తొక్కడు.

మన సినిమాలు నిజానికి సినిమాలు కావు. ఫోటో తియ్యబడిన డ్రామాలు. మరీ తుచ్ఛ చిత్రాలైతే మెలోడ్రామాలు. మన సినిమాల్లో సినిమాటిక్ లక్షణాలు చాలా తక్కువగా కనిపిస్తాయి. మన చిత్రాలు ఆర్థిక విజయానికై ఆధారపడేది నటీనటుల మీద, పాటలమీద, మెలోడ్రామామీద; దర్శకుడిమీద, కెమేరామీద కాదు. అచేతన వస్తువులచేత, కెమేరాచేత నటింపజెయ్యటం, వాటిచేత కథ చెప్పించటం మనకు ఆచారం కానే కాదు.

పాశ్చాత్యదేశాల్లో సినిమాకళ అంత అభివృద్ధి పొందటానికి కారణ మేమిటి? పాశ్చాత్యులకు ప్రతివిషయంలోను ఎక్స్పెరిమెంట్ చెయ్యాలనే యావ జాస్తి రష్యా ఫ్రాన్సు, జర్మనీ మొదలైన దేశాల్లో కొందరు దర్శకులు ధనార్జన ముఖ్యాశయంగా పెట్టుకోకుండా సినిమా టెక్నిక్‌లో చిత్ర చిత్రమైన ఎక్స్పెరిమెంట్లు చేశారు. ఈ ఎక్స్పెరిమెంట్ల మూలంగా సినిమాకళకు ఎంతో దోహదం జరిగింది. ఒక్కొక్క ఎక్స్పెరిమెంటుతో సినిమాకళ ఒక్కొక్క మైలురాయి గడిచి ముందుకు పోయింది. వీటిమూలంగా కేవల వ్యాపారచిత్రాలకు కూడా ఎన్నో కొత్తదారులు దొరికాయి.

ముఖ్యంగా రష్యాలో దిగ్గంతులలాంటి దర్శకులు బయలుదేరారు. ఐజెన్ స్టీన్, పుడోవ్కిన్, వర్టావ్, డోవ్ జెంకో మొదలైన మేధావు లెందరో సినిమాకళపై గల భక్తికొద్దీ రంగంలోకి కొత్తకొత్త పద్ధతులు కనిపెట్టారు. 1925 లో ఐజెన్‌స్టీన్ తయారు చేసిన "పోటెమ్కిన్" అనే చిత్రం యూరప్ ఖండాన్నంతటినీ ఆశ్చర్యంలో ముంచివేసింది. సినిమా టెక్నిక్‌లో ఇంత వైశాల్యానికి, లోతుకీ చోటువుందా అని యూరపియన్లు ఆశ్చర్యపోయారు. ఆ తరవాత వరసగా ఐజెన్‌స్టీన్, పుడోవ్కిన్‌ల చిత్రాలు వెలువడి సినిమాకళలో రష్యాకు అఖండ గౌరవం ఆర్జించిపెట్టాయి. హాలీవుడ్ వ్యాపార చిత్రాలకు అలవాటుపడిన యూరపియన్ ప్రేక్షకులు రష్యన్ చిత్రాలలోని విప్లవాత్మకమైన కథా వస్తువులు, శక్తివంతమైన టెక్నిక్ చూసి విస్తుపోయారు. ట్రిక్ ఫోటోగ్రఫీ, రకరకాల మాంటేజ్ ఎడిటింగ్ విధానాలు ఉపయోగించి రష్యన్ దర్శకులు తయారుచేసిన చిత్రాలు చూసి రష్యాపై సానుభూతిలేని మేధావులు కూడా 'ఓహో' అని మెచ్చుకున్నారు. క్రాస్ కటింగ్, ఇంటర్ కటింగ్, పారలల్ కటింగ్, టోనల్ మాంటేజ్, ఓవర్ టోనల్ మాంటేజ్ ఇలాగ ఎన్నో విధాల ఎడిటింగ్‌తో రష్యన్లు తమ చిత్రాల్ని మరి ఏ దేశంవారూ అందుకోలేని ఔన్నత్యాలకు తీసుకుపోయారు. రష్యన్ చిత్రాలు మిగతా దేశాలవారిమీద ఎంతో ప్రభావం ప్రసరించాయి. రష్యన్ల పద్ధతులను జర్మనీ, ఫ్రాన్సు, ఇటలీ, ఆఖరికి హాలీవుడ్ దర్శకులు కూడా అనుసరించి ఉత్తమ చిత్రాలు తయారుచేశారు. (ఎర్నెస్ట్ లూబిట్ష్, లూయీస్ మైల్‌స్టన్‌ల చిత్రాలు ఇందుకు ఉదాహరణలు.)

ఫ్రాన్సులో కూడా పలువురు దర్శకులు ఎన్నో ఎక్స్పెరిమెంట్లు చేశారు. ప్రజలకు చూపిస్తే ఒక్క దమ్మిడీ కూడా రాని ఎన్నో చిత్రాలు కేవలం ఎక్స్పెరిమెంటు కోసమే తయారుచేశారు. ఆఖరికి సర్రియలిస్టు చిత్రాలు కూడా నిర్మించారు. జర్మనీలో మన స్తత్వశాస్త్రంమీద ఆధారపడిన చిత్రాలు కొన్ని తయారై ఇతరదేశాలకు కొత్త త్రోవలు చూపించాయి. బ్రిటన్‌లో 20 ఏళ్ళకిందట ప్రారంభమైన డాక్యుమెంటరీ ఉద్యమం చలనచిత్రాల్లో వాస్తవికతాసిద్ధికి దోహదం చేసింది.

మనదేశంలో ఎక్స్పెరిమెంటు చేసి గానుగెద్దులాగ గాడిలో గిరగిర తిరిగే చలనచిత్ర కళను కొత్తత్రోవలు పట్టించే ధైర్యం ఎవరికీ లేదు "కల్పన" చిత్రం ధైర్యంచేసి తీసిన ఉదయశంకర్ అభినందనీయుడే కాని అతని చిత్రాన్ని ఎవరూ పట్టించుకున్నట్టు లేదు. కొత్తగా సినిమా రంగంలోకి వచ్చే నిర్మాతలు "మేము మొదట్లోనే కొత్తదారు లెలా తొక్కగలం? పాతవారే అందుకు సమర్థులు" అంటారు. పాత నిర్మాతలు "కొత్తకొత్త ఆశయాలతో వస్తారు గనక కొత్తవారే కొత్తదారులు తొక్కగలరు," అంటారు. ఈ విధంగా మన సినిమా పరిశ్రమ ఒక్క అడుగైనా ముందుకు వెయ్యలేని పరిస్థితిలో వుంది. మనదేశంలో తయారయే చిత్రాలు అన్నీ కథా చిత్రాలే. మరొక రకమైన చిత్రాల జోలికి (ప్రభుత్వం తప్ప) ఎవరూ పోవటం లేదు. చిత్రాల సంఖ్యను చూసి గర్వించటమే తప్ప వాటి స్థాయి సంగతి ఎవరికీ పట్టలేదు. ప్రజ లాదరిస్తున్నారా లేదా అంటే, ఆదరిస్తూనే వున్నారు ప్రజలకి సినిమాలమీదవున్న వ్యామోహం మరిదేనిమీదా లేదు. ఇదంతా తమ ప్రభావమే అని నిర్మాతలు గర్వపడనక్కరలేదు. మన సినిమాలు ఇంతవ్యాప్తి పొందటానికి కారణం వాటిలోని గొప్పదనం కాదు. సినిమా అతి చవక. ఇంత చవకగా, ఆధునిక పద్ధతుల్లో అక్షరాస్యులకీ, నిరక్షరాస్యులకీ కూడా

(51-వ పేజీ చూడండి)



"బ్రతుకు తెరువు" సెట్టుమీద నాగేశ్వరరావు, డైరెక్టరు రామకృష్ణ, దుర్భ్వారి అన్నపూర్ణ.



నా అమెరికా పర్యటన

శ్రీమతి సూర్యకుమారి

భారతదేశంనుంచి వెళ్లిన ఫిల్ము ప్రతినిధులు అమెరికా చూసివచ్చారు గనకా, పనిలోపని ప్రపంచం కూడా ఒకసారి చుట్టివచ్చారు గనకా చాలా గర్వపడుతూ ఉండిఉంటారనీ మీరనుకోవచ్చు. నిజానికి ఈ విశాలవిశ్వంలో నేనెంత చిన్న రేణువులాంటి దాన్నో ప్రపంచపర్యటనవల్ల తెలిసివచ్చింది మేము మా పర్యటనలో ఎన్నో చూశాం, ఎన్నో నేర్చుకున్నాం ఇన్ని చూసి, ఇన్ని నేర్చుకున్న తరవాత ఇంకా ఎంతో నేర్చుకోవలసింది ఉందనే విషయం తెలిసింది

మేము బయలుదేరి వెళ్ళేముందు మా ప్రతినిధివర్గాన్ని ఆహ్వానించింది అమెరికన్ ప్రభుత్వమా, కాదా అనే విషయంపై కొంతచర్చ జరిగింది. కాని మేము అమెరికాలో దిగగానే అమెరికన్ ప్రభుత్వమే మోషన్ పిక్చర్ అసోసియేషన్ ద్వారా మమ్మల్ని ఆహ్వానించినట్టు తెలిసింది

కళ, కాలక్షేపం

అమెరికన్ ప్రజల దైనిక జీవితంలో కళ, కాలక్షేపం ప్రధాన అంగాలయినాయి అవి లేనిదే వారి జీవితం అసంపూర్ణం నూటికి 99 మంది సినిమా, నాటకమందిరాలకు వెడతారు. అమెరికాలో కాలక్షేపం అనేది సినిమాలతో ఆగిపోదు నాటకాలు, నృత్యాలు, సంగీత కచేరీలు, మంచుమీద స్కేటింగ్ ప్రదర్శనలు, ఇంకా ఎన్నో రకరకాల కాలక్షేపాలున్నాయి కాని వీటన్నిటినీ మించినది టెలివిజన్ సినిమా పరిశ్రమను నిర్మూలం చేసేస్తుందా అన్నంతదాకా టెలివిజన్ అభివృద్ధి అయింది అమెరికన్ కాలక్షేపపద్ధతులలో ఒకటైన సినిమా అత్యుత్తమస్థాయిలో ఉంటూ, ప్రజల కాలక్షేపావసరాలన్నిటినీ తీర్చవలిసి వుంటుంది; లేకపోతే మిగతా వాటికి దాసోహం అనవలిసివస్తుంది అందుచేతనే హాలీవుడ్ అంత గొప్ప చిత్రాలను తయారుచెయ్యగలుగుతోంది

హాలీవుడ్

హాలీవుడ్‌లో నటీనటుల ప్రయోజనాలను రక్షించటానికి "ఆర్టిస్ట్స గిల్డ్" అనే సంఘం ఒకటున్నది ఆ సంఘంలో సభ్యత్వం పుచ్చుకుంటే గాని ఏ వ్యక్తీ నటి గాని నటుడు గాని కాలేరు ఏ నటీ, ఏ నటుడూ రోజుకి 8 గంటలకంటె ఎక్కువ పనిచెయ్య నక్కరలేదు హాలీవుడ్ స్టూడియోలలో రాత్రి షూటింగ్‌లు లేనేలేవు 8 గంటలకంటె ఎక్కువ పని చెయ్యవలిసివస్తే అదనపుజీతం ఇస్తారు ఈ అదనపు జీతం చాలా ఎక్కువ వుంటుంది ఆ జీతం ఇచ్చుకోలేక సాధారణంగా నిర్మాతలు 8 గంటలకంటె ఒక్క నిమిషంకూడా ఎక్కువపని చేయించరు సెట్లమీద ఒక్క నిమిషం కూడా వృథా చెయ్యరు. సెట్లమీద పని ప్రారంభం చెయ్యటానికి చాలా ముందుగానే ప్రతి చిన్న అంశమూ జాగ్రత్తగా, వివరంగా ప్లాను చేస్తారు. అలా ప్లాను చెయ్యటంమూలంగా సెట్లమీద పని చాలా తేలిక అవుతుంది. నటీనటులు ముందే తుణ్ణంగా రిహార్సిల్స్ చేసుకుని వస్తారు గనక సెట్టుమీద తడబడరు అయితే మంచి ఫలితాలు సాధించటానికి వారుకూడా మనలాగే ఎన్నో 'రీటేకులు' తీస్తారు

ప్రతి సినిమా కంపెనీకి సొంతస్టూడియోలుంటాయి ఒక్కొక్క స్టూడియోచూస్తే మన గ్రామాలంత వైశాల్యం ఉంటుంది. స్టూడియోకు సగటున 15 ఫ్లోర్లు ఉంటాయి. ఫ్లోర్లను హాలీవుడ్‌వారు స్టేజీ లంటారు ఇన్ని ఫ్లోర్లు ఉండటం మూలంగా



చిన్న ఇంటి వాసాలు లెక్క పెట్టిన దివాను.
రాజరాజేశ్వరీ వారి "పేదరైతు"లో లింగమూర్తి, కన్నాంబ

నా అమెరికా పర్యటన

ఒక్కొక్క పిక్చరును ఆరు వారాల కాలంలో నిర్మించటానికి వీలవుతుంది. ఆరు వారాలకంటే ఏ పిక్చరూ ఎక్కువ పట్టదు. వేరువేరు ఫ్లోర్లలో ఒకే చిత్రానికి చెందిన సెట్లను నిర్మించి కాలహరణం లేకుండా షూటింగ్ పూర్తిచేస్తారు. ట్వంటీయత్ సెంచరీ ఫాక్సువారి స్టూడియోలో దాదాపు 29 ఫ్లోర్లు ఉన్నాయి.

హాలీవుడ్ సమీపంలోనే తారల నివాస ప్రదేశాలున్నాయి. వీటిలో సన్‌సెట్ బోలివార్డు, బీవర్లీహిల్సు మొదలైన పెద్ద కాలనీలున్నాయి. బీవర్లీ హిల్సుకు వెళ్ళి చూశాను. హాలీవుడ్ తారలు మిలియన్ల కొలది డాలర్ల జీతాలు పుచ్చుకుంటున్నారు గనుక వారేదో మహారాజభోగాల్లో ఉండిఉండాలని అనుకుంటాము కాని ఆ తారలజీవితం చాలా సామాన్యంగా, నిరాడంబరంగా ఉంటుంది. సామాన్యమైన ఇళ్ళు, సామాన్యమైన దుస్తులూ, అలంకరణ. ఇళ్లు మాత్రం అతి పరిశుభ్రంగా ఉంచుకుంటారు. తారలు నైట్ క్లబ్బుల్లో ఎక్కువకాలం గడుపుతారనుకుంటాము గాని పేరుపొందిన ఏ నటీ, నటుడూ నైట్ క్లబ్బులకు వెళ్లరు. వెళ్లటానికి వారికి తీరికే ఉండదు. పగలల్లా స్టూడియో పని, రాత్రి విశ్రాంతి. ఒక్కొక్క కంపెనీ ఏడాదికి 20 దాకా చిత్రాలు తయారుచేస్తుంది. జపానులో నేను చూసిన సోచికూ స్టూడియో కంపెనీ ఏడాదికి 85 చిత్రాలు తయారుచేస్తుందట.

టెలివిజన్

మా ప్రతినిధివర్గ సభ్యులను టెలివిజన్ ప్రేక్షకులకు పరిచయం చేశారు. టెలివిజన్‌లో కనిపించటం చాలా వింత అనుభవం. టెలివిజన్ ఎదట ఉండగా నన్ను పాడమని అడిగారు. ముందు చెప్పకుండా అప్పటికప్పుడు పాడమనేసరికి గొంతు సవరించుకునే వ్యవధి కూడా లేకపోయింది. అయినా పాడాను. అంతా మెచ్చుకున్నారు.

టెలివిజన్‌లో వుండగా మేము కనిపించని ప్రేక్షకులకు ఫలానా ఫలానా అని పరిచయం చేయబడ్డాము. టెలివిజన్‌లో వున్నప్పుడు ప్రతి నిమిషమూ మనం ప్రేక్షకుల ఎదట ఉన్నట్టు గుర్తుపెట్టుకుని ఉండాలి. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రేక్షకులకు తెలిసిపోతుంది. నేను పైకి తల ఎత్తి చూసేటప్పటికి గోడమీది టెలివిజన్ సెట్టులో మా ముఖాలే మాకేసి చూస్తూ కనిపించాయి. ఆ దృశ్యం చూడమని నర్గీస్ను కూడా చేత్తో చూపించాను. ఆ పాడటాన్ని కూడా టెలివిజన్ రికార్డ్ చేసిందని తరవాత తెలిసింది. అప్పుడు నా కంగారు ఏమని చెప్పను!

ఇంత చిన్న వ్యాసంలో నేను చూసినదంతా రాయటానికి వీలులేదు. మా కు అమెరికన్లు ప్రతిచోటా హృదయపూర్వకంగా స్వాగతమిచ్చారు. మా ప్రతినిధి దళంలోని



మద్రాసు ఆర్టు ప్రొడక్షను వారి "రోహిణి"లో జమీందారు కొడుకుగా ఎస్. ఎ. నటరాజన్, ఎస్టేటు మేనేజరు మనుమరాలుగా మాధురీదేవి. తండ్రి మరణ కానకం ఎలాగైనా మార్పించాలని కొడుకు ప్రయత్నిస్తున్నాడు



ఇస్పేట్ మదాంతో డైమన్ ఆస్ గారు లబ్బుగా పాచిక వేస్తున్నారు
రాజా ప్రొడక్షన్స్ వారి "పుట్టిల్లు"లో సూర్యశ్రీ, రమణారెడ్డి.

వారమంతా ఒక కుటుంబంలో వాళ్ళం లాగా మెలిగాము పర్యటన చేసిన అరు కారాల్లోను హాయిగా గడిపాము ముఖ్యంగా మా నాయకుడు శ్రీ చందూలాల్ షా మమ్మల్నెంతో జాగ్రత్తగా కని పెట్టి చూశారు

అమెరికాలో ఉండగా నాకేమనిపించిందని మీ రడగవచ్చు నాకేమనిపించిందో అక్కడివారితో చెప్పాను. ఆ మాటలే మీతో కూడా చెబుతాను

"ఏదో ఇంద్రలోకంలోని ఇంద్రజాలంలో ఉన్నట్టు అనిపించింది అమెరికన్ మహాపురుషులనుండి నుంచుంటే నేను స్వల్పాతి స్వల్ప ప్రమాణానికి సంచించుకుపోయినట్టు అనిపించింది కాని నా దేశపు ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని తలచుకుంటే నేను మేరుశిఖరాన్న యినట్టు అనిపిస్తుంది నేను భారతీయ నైనందుకు గర్విస్తున్నాను." ★

సినిమా వార్తలు

భాస్కర్ ప్రొడక్షన్సువారు తీస్తున్న "బ్రతుకు తెరువు" సాంఘిక చిత్రం నాల్గింట మూడువంతులు పూర్తయింది నిరుద్యోగ సమస్యను చిత్రించే ఈ చిత్రానికి దర్శకుడు రామకృష్ణ, ఫొటోగ్రఫీ కమల్ ఘోష్, పాటలు, మాటలు సముద్రాల, సంగీతం కీ॥ శే॥ సి ఆర్ సుబ్బరామన్, మిగతాది ఘంటసాల, నిర్మాత శ్రీ శి భాస్కరరావు నటీనటులు శ్రీరంజని, సావిత్రి, నాగేశ్వరరావు, రంగారావు, రేలంగి, సూర్యకాంతం, సి హేమలత మొదలైనవారు

* * *

మోహన్ పిక్చర్ టీమ్‌వారు తెలుగు, తమిళ భాషల్లో "కన్‌గళ్" (కళ్ళు) అనే చిత్రం తీయనున్నారు రవీంద్రనాథ టాగూరు రచించిన *Vision* అనే కథ దీనికి మాతృక అని తెలుస్తున్నది దర్శకులు కృష్ణన్‌పంజా, ఫీమ్‌సింగ్, తెలుగులో మాటలు, పాటలు గిడుతూరి సూర్యం, సంగీతం ఎస్ వి వెంకట్రామన్, సహస్రనామం, గణేశన్, పండరీబాయి మున్నగువారు నటిస్తారు ఈ నెలలో నే రేవతి స్టూడియోలో సెట్సుపైకి వెడతారట

* * *

శోభా ఫిలిమ్స్‌వారు తెలుగు తమిళ భాషల్లో తీస్తున్న చిత్రం (తాత్కాలిక నామం 'స్వీట్ హోం') దాదాపు సగం వరకూ అయిందని తెలుస్తోంది జి వరలక్ష్మి, సావిత్రి, ముక్కామల, కె ఎస్ ఆర్, రేలంగి, రామశర్మ మున్నగువారు నటిస్తున్నారు దర్శకుడు, ఫొటోగ్రాఫర్ కమల్‌ఘోష్, సంగీతం

“బైజూ బావ్రా”

స్వర్గ మరాజ్య, భరత్ మిలాప్ లాంటి ఉత్తమ పౌరాణిక చిత్రాలు నిర్మించిన విజయభట్ ఇటీవల “బైజూబావ్రా” అనే చిత్రం నిర్మించాడు (ఈ చిత్రం స్టార్ టాకీస్‌లో ఈనెల 7వ తేదీనుండి ప్రదర్శింపబడుతోంది) దర్శకుడు విజయ్భట్, సంగీతం నౌషద్, ఫొటోగ్రఫీ వి ఎన్ రెడ్డి, డైలాగ్స్ జియాసర్హాదీ భారత్ భూషణ్, మీనాకుమారి, సురేంద్ర కుమ్మగువారు నటించారు లతా మంగేష్కర్, రఫీ, షంషద్, డివి పలుస్కర్, ఉస్తాద్ అమీర్ ఖాన్ ప్లేబాక్ పాటలు పాడారు అర్థుకనూ దేశాయ్,

ఈ చిత్రానికి తాన్‌సేన్ కాలంలో జరిగిందని చెప్పబడే ఒక గాథ ఇతివృత్తం అక్బరు ఆస్థానంలో గాయకుడుగా తాన్‌సేన్ గొప్ప గౌరవం పొందుతూఉంటాడు అతని గానసాధనకు అవసరమైన ప్రశాంతతను ఎవరూ భంగం చెయ్యకుండా చక్రవర్తి అతని ఇంటివద్ద రక్షకభటులను కాపలా ఉంచుతాడు ఆ ఇంటిప్రాంతంలో ఎవరైనా గొంతెత్తి పాడితే, ఆ పాడినమనిషి తను తాన్‌సేన్‌కన్నా గొప్ప గాయకుడనని ఋజువన్నా చేసుకోవాలి లేకపోతే మరణశిక్షకు సిద్ధం కావాలి తాన్‌సేన్ ఓడిపోతే అతడే మరణశిక్ష పొందుతాడు ఒక రోజున భజనపరుల గుంపొకటి భజనపాట పాడుతూ తాన్‌సేన్ హవేలీ దగ్గిరికి వస్తుంది ఆ గుంపులో బైజూ అనే పదేళ్ళ బాలుడు, అతని తండ్రి ఉంటారు వారిని రక్షకభటులు అడ్డగిస్తారు ఆ ఘర్షణలో బైజూ తండ్రి మరణిస్తాడు మరణించబోయేముందు తాన్‌సేన్‌మీద పగ తీర్చుకోవలసిందని బైజూతో చెప్పి, వాగ్దానం తీసుకుని మరీ మరణిస్తాడు

దిక్కులేని బైజూను శంకరానంద్ అనే దయాహృదయుడైన గాయకుడు చేరదీసి పెంచుతూ సంగీతం నేర్పుతాడు బైజూ ఆ గ్రామంలోనే ఉన్న గౌరి అనే పిల్లతో స్నేహం చేస్తాడు బైజూ, గౌరి పెద్దవాళ్ళవటంతో వారి స్నేహం ప్రేమగా పరిణమిస్తుంది

ఇలాఉండగా ఒకరోజు రాత్రి రూపమతి అనే దొంగలనాయకురాలు బైజూ ఉన్న గ్రామంపై దాడిచేస్తుంది బైజూ తన సంగీతంతో గ్రామం దోచుకోబడకుండా రక్షిస్తాడు కాని రూపమతి బైజూను ప్రేమించినందువల్ల అతను తనతో వచ్చేస్తేనేగాని ఊరుకోనని పట్టుపడుతుంది బైజూ అందుకొప్పుకుని రూపమతితో వెడతాడు ఈ రూపమతి జన్మతః దొంగలలో మనిషి కాదు ఆ గ్రామం తన తండ్రిదనీ, గ్రామంనుంచి తనతండ్రిని వెళ్ళగొట్టినందువల్ల అతను మరణించాడనీ, ఆ పగ తీర్చుకోటానికే తను గ్రామంపై దండెత్తానని రూపమతి చెబుతుంది పగ అనే మాట వినగానే బైజూకు తను తన తండ్రికిచ్చిన వాగ్దానం జ్ఞాపకం వస్తుంది వెంటనే కత్తితీసుకుని రూపమతి ఇంటినుంచి తప్పించుకుని తాన్‌సేన్ హవేలీకి ప్రయాణమౌతాడు హవేలీలో నిశ్శబ్దంగా ప్రవేశించి తాన్‌సేన్‌ను చంపబోతాడు తాన్‌సేన్ బైజూను వారించి తనపై పగతీర్చుకోవాలంటే సంగీత యుద్ధంలో తీర్చుకోమని సలహా ఇస్తాడు బైజూ సరేనని తాన్‌సేన్ గురువైన స్వామి హరిదాస్ వద్దకుపోయి సంగీతం సాధన చేస్తాడు

రూపమతి బైజూ ఉనికిపట్టును తెలుసుకుని, అతనికోసం విరహవేదనలో మునిగివున్న గౌరిని అతనివద్దకు తీసుకువస్తుంది గౌరిని చూసి బైజూ సంతోషిస్తాడు కాని ఆమె ప్రేమలో పడబట్టేగదా తను ఇన్నేళ్లూ పగవిషయం మరిచిపోయానని అనుకుని ఆమెను తిరస్కరిస్తాడు గౌరి తను బైజూ మార్గానికి అంతరాయంగా ఉండటం ఇష్టంలేక మరణించాలనే ఉద్దేశ్యంతో ఒక దేవాలయంలో పాముచేత కరిపించుకుని స్పృహ కోల్పోతుంది ఈలోగా గురువు హరిదాసు “సంగీతం ద్వేషబుద్ధ్యాసయంతో సాధించవగినది కాదు



“బైజూ బావరా”లో మీనా కుమారి.

సినిమా వార్తలు

ఘంటసాల; పాటలు, మాటలు ఆరుద్ర, స్టూడియో వాహిని

* * *

రాజా ప్రొడక్షన్స్ వారి “పుట్టిల్లు” చిత్రానికి పర్యవేక్షకుడుగాను, కెమేరామన్‌గాను పనిచేసిన శ్రీ బి ఎన్ రెడ్డిగారికీ, నిర్మాతలకూ ఏవో అభిప్రాయభేదాలు వచ్చి రెడ్డిగారు విరమించుకుని బొంబాయి వెళ్లిపోయారు వారి స్థానే శ్రీ అజిత్ కుమార్ కెమేరామన్‌గా పని చేస్తున్నారు “పుట్టిల్లు” చిత్రం వర్యాస్టూడియోలో చకచక షూటింగ్ జరుగుతున్నది



ఆనందమయ సంసార సరస్సులో తేలియాడే దంపతులు రమేష్, రమ
శోభా వారు తీస్తున్న చిత్రంలో ముక్కామల, జి వరలక్ష్మి

ప్రేమమయులకే అది లభ్యమౌతుంది," అని బైజూకు ఉపదేశిస్తాడు. ఈ ఉపదేశం విని బైజూ మనస్సు మార్చుకుని గౌరివద్దకు తిరిగి వస్తాడు. ఆమె మరణించినదని అభిప్రాయపడి పిచ్చివాడవుతాడు. రూపమతి గౌరి నక్కణ్ణించి తీసుకుపోతుంది. పిచ్చివాడయిన బైజూ దుఃఖగీతాలు పాడుతూ తిరిగి తిరిగి తాన్‌సేన్ హవేలీ చేరుకుంటాడు. రక్షకభటులు అతడు హవేలీముందు పాడుతున్నందుకు నిబంధించి చెరలో వేస్తారు. రూపమతి ఆ రాత్రి చెరలోకి ప్రవేశించి గౌరి జీవించేఉన్నదని చెబుతుంది. బైజూ మనస్సు బాగుపడుతుంది. తాన్‌సేన్‌తో సంగీతం పోటీకి సిద్ధమవుతాడు. అక్బరు సమక్షంలో బైజూ తాన్‌సేన్‌ను ఓడిస్తాడు. ఈలోగా గౌరికి ఆమె తండ్రి నరపతి అనే వానితో వివాహం నిశ్చయిస్తాడు. ముహూర్తం సమయానికి బైజూ తన గ్రామం తిరిగివస్తాడు. కాని గ్రామంలోకి వెళ్ళటానికి వరదల్లోఉన్న యమునానది ప్రతిబంధక మవుతుంది. అయినా సరేనని గౌరికోసం బైజూ ఒక పడవలో బయల్దేరుతాడు. అతని పిలుపు విని గౌరి ఇంటినుండి పారిపోయి, యమునానదిలో దూకి అతన్ని చేరుకోటానికి ప్రయత్నిస్తుంది. బైజూ పడవ తలకిందులై అతడుకూడా నీళ్ళలో పడతాడు. నది మధ్య బైజూ, గౌరీ కలుసుకుంటారు. కాని తీరం చేరుకోలేక ఒకరి బాహువుల్లో ఒకరు మరణిస్తారు.

రసవంతమైన ఈ కథను విజయభట్ ఎంతో నేర్పుతో చిత్రించాడు. కొన్ని సన్నివేశాలు ప్రేక్షకులను తన్మయులను చేస్తాయి. నౌషద్ సంగీతం ఇటీవలి అతని చిత్రాలన్నిటిలోకంటె ఉత్తమస్థాయిలో ఉంది. వి ఎన్ రెడ్డి ఫొటోగ్రఫీ నిర్దుష్టంగా లేకపోయినా కొన్ని దృశ్యాల్లో, ముఖ్యంగా రాత్రిదృశ్యాల్లో శక్తివంతంగా ఉంది. బైజుగా భారత్ భూషణ్, గౌరిగా మీనాకుమారి, స్వామీహరిదాస్‌గా రాయ్ మోహన్ చాలా బాగా నటించారు.

మెలోడ్రామా లేనిదే భారతీయ చలన చిత్రం లేదు. "బైజూబావరా"లో మెలోడ్రమటిక్ సన్నివేశాలు చాలా ఉన్నప్పటికీ, నిజమైన డ్రామా కూడా కావలసినంత ఉండటంచేత హర్షించదగిన చిత్రాల్లో ఇదొకటని చెప్పవచ్చును ★

విదేశాలకు రాకపోకలు

(46-వ పేజీ తరువాయి)

కాలక్షేపం సద్వినియోగం చెయ్యగల మీడియం ఇంకొకటి లేదు. అర్ధరూపాయి పెడితే మూడు గంటలసేపు కాలం గడిచిపోతుంది.

ఇంతకీ చెప్పవచ్చింది ఏమిటంటే విదేశాలకు వెళ్ళే మన సినిమాలవారు ఏదైనా నేర్చుకుని వచ్చి మన పద్ధతుల్లో మార్పులు తెచ్చేట్లయితే ఈ రాకపోకలు ప్రయోజనకారులవుతాయి. లేకపోతే విదేశాలు చూసి వచ్చామనే సంతృప్తిమాత్రమే మిగుల్తుంది *

నవంబరు 14 ప్రారంభము
ఆంధ్రదేశమంతటా!



ప్రకాశ్ వారి

"బైజు బావరా"

గాయక చక్రవర్తి తాన్‌సేన్‌ను సవాలుచేసి ఓడించిన ప్రసిద్ధ గాయకుని కథ...

* మీనాకుమారి * భారతభూషణ్ * సురేంద్ర * కుల్‌దీప్ కౌర్ * బిపిన్‌గుప్త
* మన్‌మోహన్ కృష్ణ నటించినది.

ప్లేబ్యాక్: లతామంగేష్కర్...మహమ్మద్ రఫీ...శంషద్...ఉస్తాద్ అమీర్‌ఖాన్...

సంగీతం: నౌషద్ **దర్శకత్వం: విజయ్‌భట్టు**

నవంబరు 7 నుండి మద్రాసు స్టార్ టాకీస్‌లో విజయవంతంగా నడచుచున్నది.

RAJSHRI RELEASE

BHARAT STUDIO

ప్రశ్నలు - సమాధానాలు

బి. కోటేశ్వరరావు—నెల్లూరు.

సినిమాలకు భావయుక్తమైన సంగీతం కావలెనా? లేక సంగీత ప్రధానమైన సంగీతం కావలెనా.

—సంగీత ప్రధానమైన సంగీతం పాట కచ్చేరీలకు పనికొస్తుంది. సినిమాలలో సన్నివేశానికి అనుగుణమైనది, సన్నివేశం లోని భావాన్ని వెలిబుచ్చేది అయిన సంగీతం మాత్రమే ఉండాలి. ఇటువంటి సంగీతాన్ని *Incidental music* అంటారు.

* * *

శ్రీ భ. కో. రామారావు—భీమవరం.

ప్రతివారము ఆంధ్రపత్రిక (వార పత్రిక)లో ప్రచురించే "మిత్రభేదము" పూర్తి పుస్తకము ఎక్కడ లభ్యమవుతుందో తెలుపకోర్తాను.

—'మిత్రభేదం' బొమ్మలకథ యింకా పుస్తకరూపంలో వెలువడలేదు. త్వరలో వచ్చుచున్నది. వేచియుండుడు.

* * *

శ్రీ బి. వీరేశ్వరరావు—తణుకు.

కాకుల కలయికను చూచినచో కీడు వాటిల్లునని అంటారు ఇది ఎంతవరకు సత్యం?

—ఒకరు కాకుల కలయిక చూడడమున్ను - వెంటనే వారికి ప్రాణోపద్రవం సంభవించడమున్ను ఎప్పుడో జరిగి ఉంటుంది. కాకతాళీయంగా జరిగిన యిటువంటి రెండుసంఘటనల కలయికను స్థిర సిద్ధాంతంగా నమ్మడంవల్లనే తప్పక కీడు వాటిల్లును.

* * *

రాధా గోవింద్ పాఢీ :—పార్వతీపురం.

సంక్రాంతి సంచికలో "కథల పోటీ" పెట్టదలచామని 8-10-1952 సంచికలో ప్రకటించారు. గత సంక్రాంతికి వెలువరించినట్టు, వచ్చే సంక్రాంతి సంచిక సినిమా సంచికగా వెలువరించరా? కారణం?

—ప్రత్యేక సంచికలలో వైవిధ్యం చూపించాలని మా ఆశయం. వచ్చే సంక్రాంతికి సినిమా సంచిక వెలువరించక పోవటానికింతకన్న వేరే కారణం లేదు.

* *

శ్రీ ఆర్. శేఖర్ రెడ్డి—హనుమకొండ.

మన తెలుగుభాషలో ప్రథమ నవల, ప్రథమ వచన నాటకం ఏది? వాటిని ఎవరు రచించినారు?

—నవల అని చెప్పదగిన మొట్టమొదటి తెలుగు నవల శ్రీ కీ॥ శే॥ కందుకూరి వీరేశలింగం పంతులుగారి "రాజశేఖర చరిత్రము". మొదటి వచన నాటకం ప్రహసనరూపంలో వీరేశలింగంగారే వ్రాశారు. వారి ప్రహసనాలు చాలా ఉన్నాయి.

* * *

కొలచల ధ్రువశర్మ—హైదరాబాదు.

"గడియారం చెప్పిన కథ" వ్రాసిన వారిపేరు తెలపుస్తారా? ఆకథ పుస్తకరూపంలో వెలువడుతుందా?

—మైకేల్ ఇరిన్ వ్రాసిన "*What Time Is It?*" అనే ఆంగ్ల పుస్తకాన్ని అనుసరించి విశ్వాత్ముల నరసింహమూర్తిగారు గడియారం చేత కథలు చెప్పించారు. ఆ కథను పుస్తక రూపంలో వెలువరించే ఆలోచన ప్రస్తుతానికి లేదు.

* * *

శ్రీ పుణ్యమంతుల శివసత్యనారాయణ—పిఠాపురం.

మీరు మీ వారపత్రికలయందు కవరు పేజీలలో బొమ్మల శీర్షికగా ప్రచురిస్తున్న "మిత్రభేదం"నకు మూల మేది? మేము మా పాఠ్యపుస్తకాలలో చదివిన మిత్రభేదానికీ మీరు ప్రచురించేదానికీ ఎక్కడా పోలిక లేదు. పైగా 'మిత్రలాభ'మందు రచింపబడిన 'పులి-బ్రాహ్మణుడు' కథ కూడ మిత్రభేదం బొమ్మల శీర్షికలో ఇదివరకు ప్రచురించివున్నారు... ఈ కథలు యింకా ఎంతకాలం ప్రచురిస్తారు? దీని తరువాత బొమ్మలశీర్షికగా ఏ కథలు తీసుకొని ప్రచురిస్తారు. తెలియజేస్తారా?

—మీరు పాఠ్యపుస్తకాలలో చదివినది చిన్నయ్యసూరిగారు రచించిన నీతిచంద్రికలోని భాగమై వుంటుంది. 'పంచతంత్రము'ను యిప్పటికి ఎందరో యీ మాదిరిగా అనువదించి వున్నారు. ఎం. డబ్లుయు. రైడర్ వంటివారు కొందరు ఆ కథలను యింగ్లీషులోకి కూడా అనువదించారు. అలాటి పుస్తకాలు రెండు మూడింటిని అనుసరించి యీ బొమ్మల కథలు వేయటం జరుగుతున్నది. మిత్రభేదం కథలు యీ నెల 19 వ తారీఖు పత్రికలో సమాప్తమౌతవి. ఆ తరువాత త్వరలో మిత్రలాభం వగైరా యితర తంత్రాల కథలను కూడా బొమ్మలకథల రూపంలో ప్రచురించాలనే మా ఆశయం.

సవరణ


5-11-52 సచిత్ర వారపత్రిక 11 వ పేజీలో వెలువడిన "కాంతికిరన్" సామర్లకోటవారి ప్రకటనలో 2, 3, 4 పంక్తులు

"అంతా సరిగానున్న అన్నరుకు రు. 300
మొదటి రెండువరుసలుసరిగానున్న రు. 150
మొదటి ఒకవరుస సరిగానున్న రు. 25"

అని యున్నది

"అంతా సరిగానున్న ప్రతిఅన్నరుకు రు. 300
మొదటి రెండువరుసలు సరిగానున్న
" ప్రతి అన్నరుకు రు. 150
మొదటి ఒకవరుస సరిగానున్న ప్రతి
అన్నరుకు రు. 25"

అని చదువుకొనవలెను.



★ అతకని బతుకులు ★

(25-వ పేజీ తరువాయి)

పించేద్దామనిఉంది" అన్నాడు. నా కుతూహలం ఎక్కువైంది.

"నా కేముందిరా — అయినవాళ్ళల్లో సంబంధం అంటె నాకు మాత్రం చేదా?" అన్నాడు నాన్న; నా మనస్సుప్పొంగింది.

"నాకు తెలుసు బావా, నీవు నిరాకరించవని" అన్నారు మామయ్య; కంఠంలో ఆనందం చిందులు తొక్కింది.

"కాని ఒకటుందిరా — వాడికేమీ ఇష్టమున్నట్లు లేదు" అన్నాడు నాన్న, అదంతా నా మీదికి నెట్టి; నా గుండెలు జారిపోయినై.

మామయ్య మాట్లాళ్ళేదు; తలకాయ వంచుకుని కూర్చున్నాను.

"ఏంరా, మీ మామయ్యకేం చెప్తావ్?" అన్నాడు నాన్న; శకుంతలో సారి నా మనోరంగంమీద నాట్యం చేసింది. నిజం చెప్పేద్దా మనుకున్నాను; కాని మాట పెగిలి రాలేదు.

మామయ్య హెచ్చరించాడు.

"ఇంకా నా చదువు పూర్తి గావాలి" అని గొణిగాను.

"పెళ్ళయితే నీచదువు మింగుడు పడదా ఏంరా?" అన్నాడు మామయ్య.

"ఎందుకు బావా, అసలు సంగతి నే చెబితినిగా" అన్నాడు నాన్న; అమ్మ అప్పుడే వచ్చి మనస్ఫూర్తిగా నవ్వి ఊరుకున్నది. నాకు ఆకాశం విరిగి మీద పడినట్లనిపించింది.

మామయ్య మాట్లాళ్ళేదు; "సరే, కానీ, భగవదేచ్ఛ" అన్నాడు కాసేపటికి.

నేను విశాఖపట్నంలో ఉండగా శకుంతల పెళ్లిశుభలేఖ అందింది. నాకు నవ్వాలో ఏడవాలో తెలీలేదు. శకుంతలన్నట్టు, నిజంగా నే అటునుంచి అటు పారిపోదామనిపించింది; కాని ధైర్యం చాల్లేదు.

ఆ మూడేళ్లు ఏదో వంకబెట్టి, ఇంటి దగ్గర్నుంచి ఉత్తరాలు వచ్చినా, విశాఖపట్నం వదిలి రాలేదు.

* * *

"నాలుగు రోజులుంటావా?" అన్నాడు మామయ్య, పొగాకు చుట్ట చుడుతూ.

"చెప్పలేను —" అన్నాను, బాగా పైకి వచ్చిన సూర్యుడివంక చూసి.

శకుంతల ఏదో చేత్తో పట్టుకుని అరుగు దిగి పక్కవాళ్ళింట్లోకి బైలుదేరింది.

"బావొచ్చాడే" అన్నాడు మామయ్య.

శకుంతల నా వేపు చూడకుండానే, సిగ్గుపడ్తూ, "కులాసాగా ఉన్నావా, బావా" అంది. నేను సమాధానంగా చిరునవ్వు నవ్వి ఊరుకున్నాను. శకుంతల కదిలి వెళ్ళిపోయింది.

"ఎప్పుడొచ్చారు?" అన్నాను.

నోట్లో చుట్టపెట్టుకోబోతూ, "నిన్ననేరా — అల్లుడికి ఒంట్లో బాగాలేదు ఒక నెలరోజులు సెలవుమీద వచ్చాడు, డాక్టరు కోసం" అన్నాడు మామయ్య.

నేను మాట్లాళ్ళేదు. కాసేపుండి "వెళ్లొస్తా మామయ్యా — ఇంకా ఇంటికి పోలేదు" అన్నాను, బైలుదేరుతూ. మామయ్య మాట్లాళ్ళేదు; సమాధానంగా చుట్టపొగ గుప్పున వదిలాడు.

నా హృదయం ఎందుకో తేలికపడ్డట్లై, మళ్ళీ బరువెక్కింది; ఇప్పుడు శకుంతల పరాయిది; బహిరంగంగా నాతో మాట్లాడటాని కశక్యురాలు. లోకం కాలంతో కలిసి కుట్రచేసి తెచ్చినమార్పు! నన్ను నేను నిందించుకున్నాను.

నేను ఇంటికి వెళ్ళేసరికి నాన్న వరాండాలో కుర్చీ వేసుకుని కూర్చుని భగవద్గీత చదువుకుంటున్నాడు. అమ్మ కాళ్లు కడుక్కోడానికి నీళ్ళిస్తూ, "ఈ మధ్య కాలేజీకి సెలవుపెట్టి ఎక్కడికో వెళ్లావుటగా?" అంది.

"నే నెక్కడికి పోతాను — ఏట్లోకి?" అన్నాను విసుక్కుంటూ.

అమ్మ మెదలకుండా వెళ్లిపోయింది. నాన్న భగవద్గీత మూసేసి, కళ్లుమూసుకుని కూర్చున్నాడు. నేను వీధిలో పోయే మనుష్యుల వంక చూస్తున్నాను. కాసేపటికి శకుంతల వచ్చింది, మందంగా అడుగులేసుకుంటూ. నన్ను చూసి, బెదిరిపోయినట్టు పక్కగా తొలిగి వెళ్లిపోయింది. కళ్లు గట్టిగా మూసుకున్నాను.

ఈ లోకంలో తనదేదో, పరాయిదేదో నిర్ణయించుకోవటం కష్టం. ప్రపంచమంతా రెక్కలు విరిచి తనకి కట్టబెట్టింది తనది; నిరాకరిస్తున్న హృదయాన్ని గదమాయించి, వెక్కిరిస్తున్న మనస్సుని తొక్కిపట్టి తనకు లభించిన వస్తువుని నమ్ముకుని జీవితం గడపాలి.

నాన్న కళ్లు తెరిచాడు: "ఏం-ఇవ్వాళ వచ్చావేంరా?" అన్నాడు.

"ఏంలేదు నాన్నా; కొంతకాలం సెలవు పెట్టాను" అన్నాను.

నాన్న కుర్చీలోంచి లేస్తూ "ఏం, ఒంట్లో బాగాలేదా?" అన్నాడు, ఆదుర్దాగా.

"బాగానే ఉంది. కాకపోయినా సెలవులన్నీ మురిగిపోతున్నై" అన్నాను. లేని నవ్వు తెచ్చిపెట్టుకుని.

"ఏడ్చినట్టుంది" అని లోపలికి వెళ్లిపోయినాడు.

నిజం — నా జీవితమే ఒక ఏడుపులా ఉన్నది. సన్నని చిరుగాలి చెట్ల ఆకుల చివర్లని కదిలించింది, మెల్లిగా.

శకుంతల దూరంగా ఒదిగి, ఇంట్లోంచి వెళ్లిపోయింది.

10

"పిల్లిద్దరూ బడికి వెళ్లారా?" అన్నాను, లోపలికి వెళ్లి. అమ్మ లోపల వంట చేసుకుంటున్నది. తలుపు కానుకుని కూర్చున్నాను.

అమ్మ, "ఊఁ" అని తనపనిలో మునిగిపోయింది. కాసేపుండి, "సెలవెందుకు పెట్టినట్టు?" అన్నది; నేను మాట్లాళ్లేదు.

"ఈ మధ్య అసలు లేనే లేవుటగా?" అన్నది, తిరిగి.

"ఆఁ — దేశంమీదికి పారిపోయినాను" అన్నాను.

అమ్మ నొచ్చుకుంది: "దేశంమీదికే పారిపోయినావో, ఏమైనావో — నాకెందుకులే? నే నేదన్నా కోపమేగా?" అని ఊరుకుంది. నేను మండే పొయ్యివంక చూస్తున్నాను.

"సంబంధాలొస్తున్నై" అన్నది అమ్మ, కాసేపుండి.

"వస్తై" అన్నాను, విరక్తిగా.

అమ్మకి కాస్త చుర్రుమంది: "వస్తై — అంటే రాకేంచేస్తాయిరా? ఏదో కాస్త మంచిసంబంధం చూసి ముడేసుకుంటే సరిపోతుందిగాని, ఎల్లకాలం బిగించుక్కూచుంటే ఎట్లా?" అన్నది, మండిపడ్తూ.

"నే నసలు పెళ్లిచేసుకోను" అన్నాను, వాకిలివేపు చూస్తూ.

"అబ్బో — మా బాగాచేసుకుంటావు" అన్నది, నా మాటల్ని నమ్మలేనట్టు. నేను మాట్లాళ్లేదు.

"లేకపోతే — నిజంగానే బైరాగుల్లో కలిసిపోతావాయేం? — అంతా వేషం" అన్నది, కాసేపుండి.

నాకు గుండె దడదడలాడింది.

"అయనా పెద్దవాడైపోతుండిరి; రోజులుగడిచిన కొద్దీ వయస్సు మీద పడ్తుందేకాని, చిన్నపిల్లలం కాబోవటం

లేదుగదా ! ఏదో అక్కరకొచ్చిన కొడుకు వనుకుంటే అట్లా భిక్షించు కూర్చుంటే ఎట్లా?" అన్నది, మళ్ళీ.

నేను ఏదో చెప్పబోయినాను

"ఏదో కాస్త ఆ శుభకార్యం తీరిపోతే, మాకు కాస్త విశ్రాంతి. ఆ గొట్టికాయలంటావూ, ఎట్లాగూ నీపాల బడేవాళ్ళే" అన్నది, ఆఖరుమాటగా.

"నేను వాళ్ళనేమీ భరించననటం లేదుగా ? నాకీ పెళ్ళిగూడా ఎందుకు, ఓ తగలాటం ?" అన్నాను, గట్టిగా.

"ఏం—ఆమరణబ్రహ్మచారివై కూచుంటావా ఏంరా?" అన్నది, నా మాటలకి ఆశ్చర్యపోతూ.

"ఏమో—ఇప్పుడుమాత్రం నాకు పెళ్ళి వద్దు" అన్నాను; శకుంతల నా కళ్ళముందు నాట్యమాడింది.

"అఘోరించావులే" అని తేల్చేసింది అమ్మ; నేను ఏమనటానికీ తోచక వరాండాలోకి వెళ్ళి కూచుని, సిగరెట్టంటించాను.

మనస్సు ఆశ్రమంవేపు మళ్ళింది · తాయి నా కళ్ళల్లోకి నిశ్చలంగా చూస్తూ నవ్వింది. తెలిసిగూడా యీ సంసారంలో ఇరుక్కోవలసిందేనా ? నా సంపాదనలో నాకు లభించే సౌఖ్యాలు పంచుకోటానికి, బహుశా, ఒక వ్యక్తి అవసరం కావచ్చు. కాని నా కృషిఫలితంలో నా భాగం అతిస్వల్పం; నా సంతానానికి దుఃఖం మాత్రమే మిగుల్తుందని తెలిసిగూడా తప్పు చెయ్యటంలో అర్థం నాకు కనబల్లేదు.

సాయంత్రం అమ్మ మళ్ళీ హెచ్చరించింది.

ఈ తడవ నిజం చెప్పేశాను: "అటువైన మీకు నావద్ద లభించేది ఏమీ ఉండదమ్మా; నా సంపాదన నా సంసారానికే చాలక పోవచ్చు" అన్నాను.

"ఏడిసినట్టుంది; మాకోసం పెళ్ళి మానుకుంటావా?" అని చివాట్లువేసింది. వీళ్ళకి ఎంత చెప్పినా తెలీదు.

బడినుంచి వచ్చేరావటంతోటే, "బజారుకు నీతోపాటు నేనుగూడా వస్తానన్నయ్యా" అని నన్ను ముందే 'బుక్' చేసుకున్నాడు రఘు. వాడి అమాయకత్వానికి నా హృదయం ద్రవించింది. మనస్సుల్లో గాలాలు వడని చిన్ననాటి రోజులు తిరిగి రావు, నాకు!

నాన్న వాకిట్లో కూర్చుని, చలికి ఒణుకుతున్నాడు.

"నా పనీ అయిపోయిందిరా—కాస్త నా మాటవింటే, నీకూ, నీ భార్యకీ యీ బుచతల్ని అప్పగించి నిశ్చింతగా ఉంటాను" అన్నాడు నాన్న.

నా కళ్ళు చెమ్మగిల్లినై.

"అన్నయ్యా, నేనూ రానా ?" అన్నాడు వెంకటి, నీళ్ళుపోసుకొచ్చి; నేను షికారుకు పోబోతున్నాను.

"చూస్తున్నావుగా, నా పరిస్థితీ—కాస్త ఆలోచించుకో" అన్నాడు నాన్న, ఆఖరు మాటగా.

కళ్ళెత్తి చూశాను; నాన్న చలికి ఒణుకుతున్నాడు, దుప్పటి చాటున. శరీరంమీద ముడతలు ప్రారంభమైనై.

"నీ కెందుకు నాన్నా—నా పెళ్ళిసంగతి నే చూసుకుంటాలే. నీ క్కావలిసిందల్లా, వీళ్ళసంగతేగా; అది నే చూసుకుంటే సరి" అన్నాను; రఘు నా వంక చూస్తున్నాడు, ఏమిటో తెలీక.

"ఏం చూసుకుంటావో ?" అని గొణుక్కున్నాడు నాన్న; నేను మెల్లిగా బయలుదేరాను, షికారుకి; వెంకటి, రఘు నా చేతులు పట్టుకుని కూడా వస్తున్నారు.

సరాసరి మామయ్యగారింటికి వెళ్ళాను: మామయ్య అరుగుమీద కూర్చొని, "ఏరోయ్ - అల్లుళ్ళంతా ఒక్కమాటు దండెత్తారు" అన్నాడు, చుట్ట అంటించుకోబోతూ నేను మందహాసం చేశాను.

ఇంతలోకే మామయ్య అల్లుడు వచ్చాడు. శకుంతల మొగుణ్ణి నే నింతవరకూ చూళ్ళేదు. మామయ్య తన అల్లుడికి నన్ను పరిచయం చేస్తూ, "ఇతనే మా మేనల్లుడు - నిరుడే ఎం. ఏ. కంప్లీట్ చేశాడు. గుంటూరు కాలేజీలో లెక్చరరు" అన్నాడు. మామయ్య అల్లుడూ, నేనూ చిరునవ్వులతో పలకరించుకున్నాం.

ఇంతలో అత్తయ్యా, శకుంతలా ఎక్కణ్ణుంచో వచ్చారు. "ఏం, కులాసానా?" అని పలకరించింది అత్తయ్య; శకుంతల సరాసరి లోపలికి వెళ్ళిపోయింది. నేను అత్తయ్య వేసిన ప్రశ్నకి సమాధానంగా నవ్వి ఊరుకున్నాను.

"పెళ్ళెప్పుడు ?" అన్నది.

"వాడి కెందుకే - వాడు సన్యాసాశ్రమం స్వీకరించబోతుంటేను" అన్నాడు మామయ్య, నవ్వి; అత్తయ్యకూడా నవ్వింది. నేను తప్పదన్నట్లు మందహాసం చేశాను.

"సన్యాసి కేంలే - మీరూ పుచ్చుకుంటూనే ఉంటిరిగా" అంది అత్తయ్య.

"నా కెక్కడ తీరుతుంది, నీతోటి ?" అని మామయ్య నవ్వి ఊరుకున్నాడు

"మీ మామయ్య పిచ్చి నీకూ పట్టుకునేను, జాగ్రత్త! - మా అందరికీ తొందరగా పప్పన్నం పెట్టించాలి" అని అత్తయ్య వెళ్ళిపోయింది.

"వాళ్ళ నాన్న వదిలిపెట్టాడూ ? ఈ మాఘ మాసంలోగా ఖరారేలే" అన్నాడు మామయ్య, వెళ్ళిపోతున్న భార్యతోటి.

వెంకటి, రఘు నా పక్కనే కూర్చున్నారు అరుగుమీద

"కాలేజీలో ఎట్లా ఉంది" అన్నాడు మామయ్య

"ఏముంది, ఎట్లా ఉండటానికి ?" అన్నాను.

"ఎంతిస్తున్నారు ?" అన్నాడు; చెప్పాను.

"మీ నాన్నా, అమ్మ కులాసానా ?" అన్నాడు; తలకాయూపాను.

చీకటిపడి, శకుంతల అరుగుమీద దీపం తెచ్చిపెట్టేవరకూ ఏదోమాట్లాడుకుంటూనే ఉన్నాం.

11

దీపం అరుగుమీదపెట్టి లోపలికి వెళ్ళిపోతున్న శకుంతల్ని చూసి, "మీ బావొస్తే పలకరించనైనా పలకరించవేమే ?" అన్నాడు మామయ్య; నేను కళ్ళెత్తి వెళ్ళిపోతున్న శకుంతలవంక చూశాను. ఈ బంగారుబొమ్మ నాదై ఉండవలసింది!

"నాకు తీరికలేదు, నీకుమల్లే కూర్చుని బాతాఖానీ కొట్టటానికి" అని శకుంతల ఆగకుండా లోపలికి వెళ్ళిపోయింది.

"అబ్బో -" అన్నాడు మామయ్య; నా గుండెలమీద ఎవరో సమ్మెటతో కొట్టినట్లైంది.

"వెళ్ళొస్తాను మామయ్యా - చీకటి పడింది" అన్నాను అరుగుమీదనుంచి దిగి; వెంకటీ, రఘూ నాకు చెరోవేపు నిలబడ్డారు, పోవటానికి సిద్ధంగా.

"మంచిది నాయనా - ఇక్కడున్నంత కాలం కనబడ్తూండు" అన్నాడు మామయ్య, తనుగూడా లేచి. నేను ఊకొట్టి బైలుదేరాను, సిగరెట్టంటించుకొని.

"నీ కెక్కడ పట్టుకుందిరా యీ జాడ్యం

అతకని బతుకులు

—వెనకే లేదే ?" అన్నాడు మామయ్య చుట్ట నోట్లో పెట్టుకోబోతూ

నేను మాట్లాడకుండా నవ్వి ఊరుకున్నాను.

"ఊ - సిగరెట్టు తాగి డబ్బులు తగలేస్తాడు - మా కియ్యకూడదేం ?" అని గొణిగాడు రఘు; నాకు నవ్వొచ్చింది

"ఆ - ఎందుకివ్వాల్రా నీకు ?" అన్నాడు మామయ్య నవ్వి.

రఘుకి సమాధానమేమీ తోచలేదు: అంతా నవ్వాం, ఒక్కమాటు.

"వస్తా, మామయ్యా" అని అక్కణ్ణుంచి వచ్చేశాను

ఒకనాడు తన వస్తువుగా తనను మురిపించిన జ్యోతి తన కళ్ళముందు పరాయిదైపోవటం కంటె దౌర్భాగ్యం ఏముంటుంది ?

చలిగాలి ఎక్కువైంది; గబగబా నడిచి ఇంటికొచ్చేశాం

"నీవు బైటికి బైలుదేరిన తర్వాత, మొన్నొచ్చినాయన మళ్ళీ వచ్చాడు" అన్నది అమ్మ, నే నింటికి వెళ్ళగానే

నేను మెదలకుండా విన్నాను

"రేపు బాగుంటట - పిల్లను చూసుకోటానికి రేపు సాయంత్రం వస్తామని మాటిచ్చారు, మీ నాన్న" అన్నది తిరిగి

"ఎందుకమ్మా - యీ బలవంతం ?" అన్నాను; కాని హృదయంలో - ఏ మూలో - వెళ్ళి చూడమని పలికింది

"ఏడిసినట్టుంది, అన్ని సంబంధాలూ వెళ్ళగొడితే, అంతా మనకోసం కాచుక్కూచుంటారా యేం? - వెళ్ళి చూడాల్సిందే" అన్నది గట్టిగా.

నేను మాట్లాళ్ళేదు.

తాయి నా కళ్ళముందు చిరునవ్వు నవ్వింది, శకుంతల వెక్కిరించింది

ఈ జగత్తంతా మిథ్య అనుకోవటం కేవలం అమాయకత్వం కరుడు గట్టుకుపోయిన ఆచారాలమధ్య తార్కికంగా జీవితం గడపటం కేవలం అసంభవం. చివరికి 'కర్మ'లో నమ్మకముంచక తప్పదేమో ననిపించింది నామీద దొర్లే ఘటనల కాఠిన్యానికి కళ్లనీళ్లు కార్చి, తలకాయ వంచాను; వైవాహిక జీవితంలోని సుఖదుఃఖాలకు సిద్ధపడ్డాను

"కనీసం నాకోసమన్నా పెళ్ళిచేసుకోరా" అని అమ్మ కంటనీరు పెట్టింది

"నేనూ పెద్దదాన్నై పోతున్నాను; కాస్త కోడలంటూ ఉంటే నా చేతికి అండగా ఉంటుందిరా" అని బతిమలాడింది.

"కాస్త మైలపని అది చేసుకొస్తుంటే, మడి పని నే నెట్టుకుపోతాను లేకపోతే యీ సంసారమంతా యీదటం నావల్ల గాదురా" అని భంగపడ్డది

చివరికి "నే బతికున్నన్నాళ్లూ నీ కేమీ అర్థంగాదు; అది కాస్త పుటుక్కుమంటేగాని నీకు తెలిసిరాదు" అని బెదిరించింది చెవులు రెండూ మూసుకున్నాను. నాన్న వాకిట్లో కూర్చుని బృహదారణ్యకోపనిషత్తు చదువుకుంటున్నాడు.

నిజంగా ఎవడి బతుకూ స్వంతం గాదు. ఈ ప్రపంచమే ఓ నాటకం; రమణి చెప్పినట్టు, తప్పించుకోటానికి ఎవరికీ వీల్లేదమో ననిపించింది తెలిసిగూడా సముద్రంలో దూకక తప్పేట్టులేదు.

భోజనంచేసి వాకిట్లో కుర్చీలోకూర్చుని సిగరెట్టంటించాను నాన్న భోజనం కానిచ్చి వాకిట్లో ప్రవేశిస్తూ, "ఆయన నీకోసం కాలేజీకి నాలుగు మాట్లొచ్చాడట" అన్నాడు

"నేను లేనప్పుడొచ్చి ఉంటాడు" అన్నాను

"మనకి దగ్గిరి వాడు—వాళ్ళ పూర్వీకులంతా మనకు తెలిసినవాళ్ళే, ఇప్పుడంటే రాకపోకలు తగ్గిపోయినై గానీ-" అన్నాడు నాన్న, పక్క నే పడక్కుర్చీలో పడుకుని

నేను మాట్లాళ్ళేదు

"ఈ సంబంధం చేసుకుంటే, అంతా కలిసిపోతాం—మీ మామయ్యకు మల్లే నిక్కూ, నీల్గుడూ లేవు" అన్నాడు నాన్న.

నేను అయిష్టంగా నవ్వి ఊరుకున్నాను

"చాలా పెద్దమనిషి కొంతకాలం నా క్లాసుమేటు గూడా" అన్నాడు నాన్న.

నేను సిగరెట్టు దమ్ము గట్టిగా పీల్చాను, నవ్వి

"మీమామయ్యగారింటి కెళ్లొచ్చావా?" అన్నాడు, తీరిగ్గా

నోట్లో పొగ ఉండటం వల్ల, తలకాయూపాను

"ఊఁ?" అన్నాడు హెచ్చరిస్తూ.

"వెళ్ళొచ్చాను" అన్నాను, పొగ వదిలేసి

"ఎట్లా ఉన్నారు" అన్నాడు నాన్న

"కులాసాగనే ఉన్నారు" అన్నాను

నాముక్తసరి సమాధానం నచ్చినట్టులేదు; కాసేపు మాట్లాళ్ళేదు.

నేను కాలిపోయిన సిగరెట్టు విసిరేశాను.

"రేపు మధ్యాహ్నం బండికి నీవూ, మీ అమ్మా వెళ్లిరండి" అన్నాడు నాన్న, లోపలికి వెళ్తూ; నేను మాట్లాడకుండా ఇంకో సిగరెట్టు వెలిగించాను.

ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు. తీయని సంగీతం మధ్య అపస్వరాలు వినిపించినై.

అనుకున్న ప్రకారం నేనూ, అమ్మా బైలుదేరి వెళ్ళాం, నాకు మామగారు కాదల్చుకున్న మా నాన్న స్నేహితుడింటికి ఆయన మర్యాదల్తో నన్ను చంపేశారు ఆఅదరానికి నేను కరిగిపోయినాను. మా నాన్న, తనూ కలిసి ఎట్లా తిరిగేవాళ్ళో అంతా చెప్పాడు నేను ప్రతిదానికీ నవ్వి ఊరుకున్నాను

నా మనస్సెందుకో మూలుగుతున్నది.

కాసేపటికి ఆయనకూతురు 'మేకప్'లో వచ్చింది. కళ్ళెత్తి చూశాను మెల్లిగా నా వేపు కళ్లు సగం తెరిచి చూసి, పక్కకి తిప్పుకున్నది చూపులు వేటకాడి వంక చూస్తున్న లేడి చూపుల్లా ఉన్నై అవి; వాటిలో చైతన్యం లేదు నా మనస్సు గాయపడ్డది, శకుంతల చిలిపికళ్లు నవ్వినై నాలో.

వెయ్యి సముద్రాలు నా హృదయంలో ఘోషించినై నాకు యీ పిల్ల ఏమౌతుందని మా జీవితాలు ముడివేసుకోవాలి? ప్రతి నరం తిరగబడింది, బరువుగా ఇంటికి తిరిగి వచ్చాను

శకుంతల నా హృదయంలో నాట్యం చేసింది; తాయి నా మనస్సులో పాలు గార్చింది కాని యీ అమాయకురాలు నా హృదయంలో జాలిగా ఏడ్చింది.

"నాకు పెళ్లి వద్దమ్మా" అన్నాను, ఇంటికి రాగానే

"ఏం, తీపరం రా—నిక్షేపంలాంటి పిల్లయితే" అన్నది కోపంగా

"ఏం, నీకు నచ్చలేదుట్రా?" అన్నాడు నాన్న

"అట్లాగే అంటాడు లెండి, మూడుముళ్లూ పడేదాకా" అన్నది అమ్మ, నా మాటల్ని లెక్కచెయ్యకుండా.

నేను మాట్లాడకుండా అక్కణ్ణుంచి వెళ్లిపోయినాను, వెంకటే, రఘూ నాకూడా వస్తూనే ఉన్నారు.

(ఇంకావుంది)

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St Madras


పంచతంత్రం
మిత్రభేదం
కర్త... విశ్వాత్ముల నరసింహమూర్తి
మళ్ళీ ఆ పాడు పక్షి - బిగ్గరగా అరవగ విని - కోయనాయకుడు మళ్ళీ - నలుగురి బంధించి తెచ్చి :- "నా పెంపుడు పక్షి ఎప్పుడు - వ్యర్థంగా అరవబోదు - మీవద్ద ను డబ్బుంటే - పొట్టలలో వుండి యుండు - రేపుదయం అందరినీ - పొట్టకోసి పరీక్షింతు"
దొంగ : (తనలో)
"ఈ ముగ్గురి పొట్టకోసి - మణులు తీసుకొన్న కోయ - నన్ను వదిలి పెడ తాడా? - అలాకాక ముందుగనా - పొట్టకోసి చూడమంటె - ఏమీ దొరకదు కనుకా - పాపం! యీ ముగురికైన - దుర్మరణం తప్పుతుంది!"
మరునాడు ఉదయం -
"ముందు నీవు ఆ ముగ్గురి పొట్టలు కోసినట్లు నే చూచి బ్రతుక లేను కనుక ముందు నన్నే కోయించుము."
"అటులే, నీ ఖర్మం మరి!"
దొంగ పొట్టకోసి చూడ - డబ్బేమీ కాన రాక - తనే పక్షి అనృతమాడె - ననుకొని ఆ కోయవాడు - మిగిలిన వారిని పూరక చంపివేయుటెందుకనుచు - పొమ్మని వదిలేశాడు.
వారు పోవుచుండ తిరిగి పక్షి అరిచె గానీ ఆ కోయవాడు లెక్కచేయ కుండా వూరుకున్నాడు
కరటకుడు దమనకునితో
"అందులకే, దమనకుడా! - దొడ్డబుద్ధిగల వైరియె - ఎంతైనా మేలంటిని. - బుద్ధిహీనుడగు మిత్రుడు - ఎంత హాని చేయగలడో - రాజుగారి కథ వింటే తెలుసుకొనగలవు కాదె!"
"ఎవరా రాజు? ఏమా కథ?"
ఆ ముగ్గురు మిత్రులట్లు
పోయి పోయి ఒక పట్నం
మూడు మణులు అమ్మారు
బోలెడంత డబ్బురాగ
పట్టణమంతా కొనేసి
రాజు కొడుకు తను రాజుగ
పండిత పుత్రుడు మంత్రిగ
వ్యాపారి సుతుడు ఖజాన
మంత్రిగ పాలిస్తుండెను
కొంతకాలమిట్లు గడువ రాజుగారు ఒక కోతిని పెంచుట ప్రారంభించెను దానిపైన మమకారం నానాటికి బలిసింది
ఒక చైత్రపు మధ్యాహ్నం - రాజుగారు రాణిగారు - కలిసి తోటలో తిరుగుతు - ఉండగ ఆ కోతికూడ - వారి తోటె తిరుగుతుండె
"ఇదుగో ఓ నేస్తం! - నేనూ నా రాణీకా - స్నేహిక్కడ చెట్టు నీడ - విశ్రాంతిగ నిదురిస్తాం. - ఈగైనా మామీదను - వాలకుండ చూడవోయ్. - కావలిస్తె ఈ కత్తిని - కూడా వుపయోగించుము"
రాజుగారు నిద్రించిన మరుక్షణం ఈగ ఒకటి ముక్కు మీద వాలింది నమ్మిన బంటైన కోతి ఈగపైకి కత్తి విసర -
రాజ శిరసు పగిలింది. రాణిగారు లబోదిబో మంటు నెత్తి మొత్తుకొంది.
"కనుకనె నీ వంటివారు మిత్రులైతె అందరికీ అన్ని విధాలా ముప్పే!"
43



Release through THE VAUHINI PICTURES LTD.,
MADRAS VIJAYAWADA GUNTAKAL